www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Aakash
Medical | IIT-JEE | Foundations
CALL (TOLL-FREE) 1800-102-2727

ఆదివారం | 9-6-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 54 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ. 3.45 తదుపరి చవితి; నక్షత్రం: పునర్వసు రా. 8.20 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ.8.01-9.39, తె.4.46 మొదలు; దుర్ముహూర్తం: సా.5.00-5.52; అమృతఘడియలు: సా.5.52-7.30; రాహుకాలం: సా.4.00-6.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.45 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x ఉగాండా (ఉ.6. గం.)

భారత్ x పాకిస్థాన్ (రాత్రి.8. గం.)

ఒమన్ x స్కాట్లాండ్ (రాత్రి 10.30 గం.)

కివీస్‌కు అఫ్ఘాన్ షాక్

కేన్ సేన 75 ఆలౌట్

కూల్చేసిన రషీద్, ఫజల్

గుర్బాజ్ అర్ధ శతకం



రషీద్

జార్జ్‌టౌన్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌లో వరుస సంచలనాలు నమోదవుతున్నాయి. రషీద్ ఖాన్ (4-0-17-4), ఫజల్ ఫరూకీ (3.2- 0-17-4) చెరో నాలుగు వికెట్లతో చెలరేగడంతో.. గ్రూప్-సిలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ 84 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌కు షాకిచ్చింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (56 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 80), ఇబ్రహీం జద్రాన్ (41 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 44) తొలి వికెట్‌కు 103 పరుగులు జోడించారు. అయితే, ఆ తర్వాతి బ్యాటర్లు వేగంగా పెవిలియన్ చేరారు. ఆఖరి ఓవర్‌లో కెప్టెన్ రషీద్ (6) రనౌట్ కాగా.. హాఫ్ సెంచరీ చేసిన గుర్బాజ్, గుల్బదిన్ (0)ను అవుట్ చేసిన బౌల్ట్ జట్టు స్కోరు 160 చేరకుండా అడ్డుకొన్నాడు. మ్యాట్ హెన్రీ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో అఫ్ఘాన్ బౌలర్ల దెబ్బకు కివీస్ 15.2 ఓవర్లలో 75 పరుగులకే కుప్పకూలింది. ఫిలిప్స్ (18), హెన్రీ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. గుర్బాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-సి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
అఫ్ఘానిస్థాన్	2	2	0	0	4	5.225
వెస్టిండీస్	1	1	0	0	2	0.411
ఉగాండా	2	1	1	0	2	-2.952
పీఎన్‌జీ	2	0	2	0	0	-0.434
న్యూజిలాండ్	1	0	1	0	0	-4.200

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోరు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 159/6 (గుర్బాజ్ 80, జద్రాన్ 44; బౌల్ట్ 2/22, హెన్రీ 2/37); న్యూజిలాండ్: 15.2 ఓవర్లలో 75 ఆలౌట్ (ఫిలిప్స్ 18; ఫరూకీ 4/17, రషీద్ 4/17).



రోహిత్



ప్రాక్టీస్‌లో విరాట్ కోహ్లి



బాబర్ ఆజమ్

ప్రపంచ క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న తరుణం రానేవచ్చింది. టీ20 వరల్డ్‌కప్‌లో అసలైన కిక్కిచ్చే ఫైట్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికి నాలుగు మ్యాచ్‌లు జరిగినా బోసిపోయి కనిపించిన నసౌ స్టేడియం ఇక ఇరు జట్ల ఫ్యాన్స్‌తో కిటకిటలాడనుంది. రీసేల్ మార్కెట్‌లో ఒక్క టిక్కెట్ ధరే కోటీ 50 లక్షలు పలుకుతుందంటేనే ఈ పోరుకున్న డిమాండ్ ఏంటో అర్థమవుతోంది. ఇదంతా.. భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ గురించే. ఈ మెగా టోర్నీ ముఖాముఖి పోరులో 6-1 ఆధిక్యంతో తిరుగులేని రికార్డున్న టీమిండియాను.. పసికూన యూఎస్ చేతిలో ఓడిన పాక్ ఏమేరకు ఎదుర్కోగలదో చూడాల్సిందే!

కిక్కిచ్చే ఫైట్

నేడే భారత్ X పాక్ మ్యాచ్

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

న్యూయార్క్: టీ20 ప్రపంచకప్‌లో అత్యంత ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. రెండేళ్ల తర్వాత తొలిసారిగా టీమిండియా ఆదివారం పాకిస్థాన్‌తో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై విజయంతో రోహిత్ సేన ఆత్మవిశ్వాసంతో ఉండగా.. పాకిస్థాన్ పసికూన యూఎస్‌ఏ చేతిలో ఓడి డీలా పడింది. దీంతో ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్న బాబర్ బృందానికి భారత్‌పై గెలుపు చాలా కీలకం. ఇక ఇక్కడి డ్రాప్ ఇన్ పిచ్‌పై అనూహ్య బౌన్స్ బ్యాటర్లను బెంబేలెత్తిస్తోంది. చివరిసారి ఇరుజట్లు 2022 టీ20 వరల్డ్‌కప్‌లో తలపడగా ఆఖరి బంతికి భారత్ గెలిచింది. ఉగ్రదాడి హెచ్చరికల నేపథ్యంలో ఈ మ్యాచ్‌కు అధ్యక్షస్థాయి భద్రతను ఏర్పాటు చేశారు.

మెరుగైన రికార్డుతో..: కొత్త బంతిని ఎదుర్కొనేందుకు ఈసారి కూడా ఓపెనర్లుగా రోహిత్, విరాట్ రానున్నారు. ఐర్లాండ్‌తో కోహ్లీ అనవసర షాట్‌కు వెళ్లి అవుటయ్యాడు. కానీ పాక్‌పై మెరుగైన రికార్డున్న విరాట్‌పై ఈసారీ భారీగా అంచనాలున్నాయి. బంతి పాతగా మారే వరకు ఓపిగ్గా ఎదురుచూస్తేనే ఈ పిచ్‌పై పరుగులు వస్తాయి. వన్‌డౌన్‌లో పంత్ ఫామ్ జట్టుకు సానుకూలాంశం. పాక్ స్పిన్నర్లపై ఎదురుదాడికి శివమ్ దూబే సిద్ధంగా ఉన్నాడు. ఐర్లాండ్‌తో ఆడిన మాదిరే భారత్ నలుగురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగనుంది.

తీవ్ర ఒత్తిడిలో..: ఐసీసీ టోర్నీల్లో భారత్‌పై ఓడడాన్ని అలవాటుగా మార్చుకున్న పాక్.. ఈ మ్యాచ్‌ను మరింత ఒత్తిడి మధ్య ఆడనుంది. పాక్‌కు బౌలింగే ప్రధాన బలంగా ఉన్నప్పటికీ యూఎస్ బ్యాటర్లు వీరిని దీటుగా ఎదుర్కొని సూపర్ ఓవర్‌లో గెలిచారు. ఈ ఓటమితో ఆగ్రహంగా ఉన్న అభిమానులను తిరిగి సంతోషంలో ముంచెత్తాలంటే భారత్‌పై విజయం పాక్‌కు అవసరం. పేసర్లు షహీన్, నసీమ్, ఆమిర్, రౌఫ్ తమ పేస్ పదునుతో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టాలనుకుంటున్నారు. బ్యాటింగ్‌లో రిజ్వాన్, ఉస్మాన్ విఫలమవుతున్నారు. బాబర్ వేగంగా ఆడాల్సి ఉంది. స్పిన్నర్ షాదాబ్ స్థానంలో సయీమ్ అయూబ్‌ను తీసుకునే చాన్సుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.

పాకిస్థాన్: రిజ్వాన్, ఉస్మాన్, బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్, ఆజమ్ ఖాన్, ఇఫ్తికార్, షాదాబ్/సయీమ్, షహీన్, నసీమ్ షా, ఆమిర్, రౌఫ్.

పిచ్, వాతావరణం

నేటి ఉదయం 10 గంటలకు వర్షం కురిసే అవకాశం ఉంది. టాస్ ఆలస్యం కావచ్చు. ఇక నసౌ స్టేడియం పిచ్‌ను అర్థం చేసుకోవడం కష్టంగా మారింది. ఇప్పటి దాకా జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండుసార్లు మాత్రమే 100+ స్కోరు దాటింది. అందుకే పేసర్లకు ఎక్కువగా అనుకూలించే ఈ ట్రాక్‌పై భారీ స్కోర్లను ఆశించలేం. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

స్వియటెక్.. హ్యాట్రిక్



పోలెండ్ స్టార్‌దే ఫ్రెంచ్ ఓపెన్ ● ఫైనల్లో పౌలినీ చిత్తు

పారిస్: టాప్‌సీడ్ ఇగా స్వియటెక్ సాధించింది..వరుసగా మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ కిరీటం సొంతం చేసుకుంది. ఈక్రమంలో అనేక రికార్డులు అందుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఏకపక్ష ఫైనల్లో 23 ఏళ్ల స్వియటెక్ 6-2, 6-1తో 12వ సీడ్ జాస్మిన్ పౌలినీ (ఇటలీ)ని చిత్తు చేసింది. గంటా ఎనిమిది నిమిషాలు సాగిన తుది సమరం..తొలి సెట్‌లో ఓ దశలో స్వియటెక్ 1-2తో వెనుకంజలో నిలిచింది. ఆపై వరుసగా 10 గేములు గెలిచి మొదటి సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో సెట్‌లోనైతే స్వియటెక్ ధాటికి పౌలినీ పూర్తిగా చేతులెత్తేసింది. ఏకంగా 5-0తో ప్రత్యర్థిని బెంబేలెత్తించిన పోలెండ్ స్టార్..ఆ సెట్‌ను మరింత సులువుగా ముగించడంతోపాటు మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. మ్యాచ్‌లో స్వియటెక్, జాస్మిన్ చెరో ఏస్ కొట్టగా..తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన 28 ఏళ్ల పౌలినీ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. స్వియటెక్ 18 విన్నర్లు కొడితే..పౌలినీ ఏడింటికే పరిమితమైంది. స్వియటెక్‌కు రొలాండ్ గారోస్‌లో ఇది వరుసగా 21వ విజయం. ఇక.. జస్టిన్ హెనిన్ (2005, 06, 07)) తర్వాత హ్యాట్రిక్ ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు అందుకున్న తొలి క్రీడాకారిణిగా స్వియటెక్ రికార్డు సృష్టించింది. గత ఐదేళ్లలో ఇగాకు ఇది నాలుగో ఫ్రెంచ్ ఓపెన్. అంతకుముందు ఆమె తొలిసారిగా 2020లో ఇక్కడ విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా స్వియటెక్‌కు ఇది ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2022లో యూఎస్ ఓపెన్ గెలిచింది. ఇక, గ్రాండ్‌స్లామ్స్‌లో ఫైనల్ చేరిన ప్రతిసారీ స్వియటెక్ విజేతగా నిలవడం విశేషం.

స్వియటెక్‌కు రూ. 21.65 కోట్లు

పౌలినీకి రూ. 10.82 కోట్లు

పురుషుల సింగిల్స్ ఫైనల్ నేడు



అల్కారజ్ X జ్వెరెవ్

సా. 6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

మిల్లర్.. గట్టెక్కించెన్

దక్షిణాఫ్రికా విజయం

వణికించిన డచ్ బౌలర్లు



మిల్లర్ (59 నాటౌట్)

న్యూయార్క్: లక్ష్యం 104 పరుగులు.. అయితేనేం నెదర్లాండ్స్ బౌలర్లు దక్షిణాఫ్రికా బ్యాటర్లకు పట్టపగలే చుక్కలు చూపించారు. అటు వికెట్లు తీస్తూ మరోవైపు ఒక్కో పరుగు కోసం చెమటోడ్చేలా చేయడంతో 12/4 స్కోరుతో దీనంగా నిలిచింది. అయితే ఈ స్థితిలో డేవిడ్ మిల్లర్ (51 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 59 నాటౌట్) చివరికంటా నిలిచి జట్టు పరువు దక్కేలా చేశాడు. అతడికి స్టబ్స్ (33) సహకరించాడు. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో సఫారీలు గెలిచారు. ఐసీసీ ఈవెంట్స్‌లో డచ్‌పై నెగ్గడం సౌతాఫ్రికాకిదే తొలిసారి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 పరుగులకు కుప్పకూలింది. ఏంజెల్‌బ్రెట్ (40), వాన్ బీక్ (23) మినహా అంతా విఫలమయ్యారు. ఆఖరి ఓవర్‌లో పేసర్ బ్రాట్‌మన్ ఒక్క పరుగుకు 3 వికెట్లు తీసి ఈ టోర్నీలో సఫారీల తరఫున మూడో ఉత్తమ బౌలర్ (4-0-11-4)గా నిలిచాడు. నోకియా, జాన్సెన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో దక్షిణాఫ్రికా 18.5 ఓవర్లలో 106/6 స్కోరు చేసి గెలిచింది.

అతికష్టంగా...: స్వల్ప ఛేదనలో సఫారీలు కూడా తడబడ్డారు. తొలి బంతికే డికాక్ (0) రనౌట్ కాగా.. డచ్ బౌలర్ల ధాటికి టీ20ల్లో తమ అత్యల్ప పవర్‌ప్లే (16/4) స్కోరుతో దక్షిణాఫ్రికా నిలిచింది. ఈ దశలో మిల్లర్, స్టబ్స్ ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ నిదానం కనబర్చడంతో పది ఓవర్లలో 32 పరుగులే సమకూరాయి. ఆ తర్వాత రెండు ఓవర్లలో మిల్లర్ జోరుతో 22 రన్స్ రాబట్టడంతో సౌతాఫ్రికా కోలుకుంది. అయితే 17వ ఓవర్‌లో స్టబ్స్‌ను బాస్ డి లీడ్ అవుట్ చేయగా, ఐదో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే జాన్సెన్ (3)ను వాన్ బీక్ వెనక్కి పంపడంతో ఉత్కంఠ పెరిగింది. ఈ దశలో మిల్లర్ బ్యాట్ ఝుళిపిస్తూ 19వ ఓవర్‌లో 6,4,6తో చెలరేగి అర్ధసెంచరీతో పాటు మ్యాచ్‌ను ముగించాడు.

పాయింట్ల పట్టిక — గ్రూప్-డి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	2	2	0	0	4	0.789
బంగ్లాదేశ్	1	1	0	0	2	0.379
నెదర్లాండ్స్	2	1	1	0	2	0.024
నేపాల్	1	0	1	0	0	-0.539
శ్రీలంక	2	0	2	0	0	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోరు

నెదర్లాండ్స్: 20 ఓవర్లలో 103/9 (ఏంజెల్‌బ్రెట్ 40, వాన్ బీక్ 23, బార్ట్‌మన్ 4/11, నోకియా 2/19, జాన్సెన్ 2/20) దక్షిణాఫ్రికా: 18.5 ఓవర్లలో 106/6 (మిల్లర్ 59 నాటౌట్, స్టబ్స్ 33; కింగ్మా 2/12, వాన్ బీక్ 2/21).

స్వల్ప స్కోర్ల ఉత్కంఠ పోరు

లంకపై బంగ్లా గెలుపు



హృదయ్ (40)

సంక్షిప్త స్కోరు

శ్రీలంక: 20 ఓవర్లలో 124/9 (నిస్సాంక 47, ధనంజయ డిసిల్వా 21, అసలంక 19, ముస్తాఫిజుర్ 3/17, రిషద్ హొస్సేన్ 3/22, టస్కిన్ 2/25).

బంగ్లాదేశ్: 19 ఓవర్లలో 125/8 (హృదయ్ 40, లిటన్ దాస్ 36, మహ్మదుల్లా 16 నాటౌట్, నువాన్ తుషార 4/18, హసరంగ 2/32).

డాలస్: ప్రతిష్ఠాత్మక టీ 20 వరల్డ్ కప్‌లో మరో స్వల్ప స్కోర్ల పోరు. అయినాసరే ఆఖరి ఓవర్ వరకూ ఈ మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. చివరకు మహ్మదుల్లా (16 నాటౌట్) అండతో బంగ్లాదేశ్ కేవలం రెండు వికెట్లతో శ్రీలంకపై గెలిచి మెగా టోర్నీలో బోణీ కొట్టింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 124/9 స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్ నిస్సాంక (47) టాప్ స్కోరర్. ధనంజయ (21) పర్లేదనిపించాడు. ముస్తాఫిజుర్ (4-0-17-3), రిషద్ హొస్సేన్ (4-0-22-3) చెరో మూడు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో తౌహిద్ హృదయ్ (20 బంతుల్లో ఓ ఫోర్, 4 సిక్సర్లతో 40) ధనాధన్ బ్యాటింగ్‌తోపాటు లిటన్ దాస్ (36)తో నాలుగో వికెట్‌కు 63 పరుగులు జోడించడంతో బంగ్లా గెలుపు సులువే అనిపించింది. కానీ నువాన్ తుషార (4-0-18-4) విజృంభించడంతో బంగ్లా 113/8తో ఇబ్బందుల్లో పడింది. విజయానికి 12 రన్స్ కావాల్సిన దశలో..19వ ఓవర్లో షనక బంతిని మహ్మదుల్లా సిక్సర్‌గా కొట్టి జట్టును గెలిపించాడు. రిషద్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

నార్వే చెస్ విజేత కార్ల్‌సన్

స్టావెంజర్ (నార్వే): నార్వే చెస్ టోర్నీలో భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడో స్థానంలో నిలిచాడు. ఆఖరిదైన పదో రౌండ్లో అమెరికా గ్రాండ్ మాస్టర్ హికరు నకమురాతో క్లాసికల్ గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించాడు. అయితే, ఆర్మగెడాన్‌లో నకమురాపై ప్రజ్ఞానంద గెలిచాడు. మొత్తం 14.5 పాయింట్లతో ప్రజ్ఞానంద తృతీయ స్థానం దక్కించుకొన్నాడు. వరల్డ్ నెంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (17.5 పాయింట్లు) విజేతగా నిలవగా.. నకమురా (15.5) రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. మహిళల విభాగంలో భారత స్టార్లు వైశాలి (12.5), కోనేరు హంపి (10) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. 19 పాయింట్లతో చైనా గ్రాండ్ మాస్టర్ జు వెన్ టైటిల్‌ను అందుకుంది.

అన్షు, అంతిమ్‌కు రజతాలు



బుడాపెస్ట్ (హంగేరి): బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్‌లో భారత రెజ్లర్ అన్షు మాలిక్ రజతం దక్కించుకొంది. మహిళల 57 కిలోల ఫైనల్లో అన్షు 1-12తో కీజిన్ హాంగ్ (చైనా) చేతిలో చిత్తుగా ఓడింది. భారత్‌కే చెందిన అంతిమ్ పంగల్ 53 కిలోల్లో రజతం సాధించగా.. 50 కిలోల్లో వినేష్ ఫొగట్ క్వార్టర్స్ బౌట్‌లో ఓడింది.

భారీ జీతంతో పాటు

వినూత్న ప్రోత్సాహకాలు

ఉద్యోగులను ఆకర్షించేందుకు కార్పొరేట్ల సరికొత్త వ్యూహాలు



బెంగళూరు/న్యూఢిల్లీ: ప్రతిభావంతులను ఆకర్షించడంతో పాటు ఉన్న ఉద్యోగులు వలస పోకుండా కాపాడుకునేందుకు కార్పొరేట్ కంపెనీలు సరికొత్త వ్యూహాలను అనుసరిస్తున్నాయి. వారికి భారీ జీతంతో పాటు వ్యక్తిగత అభివృద్ధికి మద్దతు, పనిలో వెసులుబాటు, తోబుట్టువులకూ ఆరోగ్య బీమా సదుపాయం వంటి వినూత్న ప్రోత్సాహకాలను ఆఫర్ చేస్తున్నాయి. రిస్క్, అడ్వైజరీ, బ్రోకింగ్ కంపెనీ డబ్ల్యూటీడబ్ల్యూ ఈ ఏడాదికి గాను గ్లోబల్ బెనిఫిట్స్ ఆటిట్యూడ్ సర్వేను చేపట్టింది. జీతంతో పాటు లభిస్తున్న అదనపు ప్రయోజనాలే ప్రస్తుత కంపెనీలో కొనసాగుతుండటానికి ప్రధాన కారణాల్లో ఒకటని సర్వేలో పాల్గొన్న 76 శాతం మంది ఉద్యోగులు వెల్లడించారు. ప్రస్తుతం లభిస్తున్న జీతంతో పాటు మరింత మెరుగైన ప్రయోజనాలను ఆఫర్ చేసే కంపెనీకి మారేందుకూ సిద్ధమని మూడింట రెండొంతుల మంది ఉద్యోగులు తెలిపారు. ప్రముఖ వినియోగదారుల ఉత్పత్తుల సంస్థ పీ అండ్ జీ తన ఉద్యోగులు వ్యక్తిగత అభివృద్ధి, కుటుంబ సభ్యులు, పిల్లలు, తల్లిదండ్రులు, పెంపుడు జంతువుల సంరక్షణ తదితర అవసరాల కోసం ఉపయోగించుకునేందుకు వార్షిక స్థిర నగదు భత్యం ప్యాకేజీని ప్రవేశపెట్టింది. కంపెనీ సమగ్ర సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ప్యాకేజీని ప్రవేశపెట్టినట్లు, సిబ్బంది తమ వ్యక్తి ప్రాధాన్యాల పైనా దృష్టి సారించేందుకు ఇది దోహదపడనుందని పీ అండ్ జీ ఇండియా చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు.

కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగులు గంటల తరబడి కూర్చుని పనిచేయాల్సిన పరిస్థితి. దాంతో వారికి ఊబకాయంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పలు ఆరోగ్య సర్వేలు ఇప్పటికే వెల్లడించాయి. ఈ నేపథ్యంలో దేశంలోని అతిపెద్ద ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ తన గ్రూప్ వ్యాపారాల ఉద్యోగుల కోసం గత ఏడాది ఆగస్టులో ఉచిత ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించింది. 33 నగరాల్లోని కంపెనీ కార్యాలయాల్లో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఫ్లిప్‌కార్ట్ సీనియర్ డైరెక్టర్ ఆకృతి చంద్ర తెలిపారు. కొత్తగా కంపెనీలో చేరబోయేవారు జీతంతో పాటు ఆ యాజమాన్యం అందిస్తున్న బీమా సదుపాయం వంటి అదనపు సదుపాయాల గురించీ వాకబు చేస్తున్నారని శాప్ ఇండియా హెచ్ఆర్ హెడ్ శ్వేత మొహంతి అన్నారు. శాప్ తన సిబ్బంది మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం యెల్లో సర్కిల్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

బిజినెస్



ఎల్‌జీ ఓఎల్ఈడీ సీ4 ఏఐ టీవీ

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా.. హైదరాబాద్ మార్కెట్లోకి సరికొత్త 64 అంగుళాల ఓఎల్ఈడీ సీ4 ఏఐ టీవీ తీసుకువచ్చింది. అడ్వాన్స్‌డ్ ఓఎల్ఈడీ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సామర్థ్యాలతో కూడిన ఈ టీవీ అద్భుతమైన పిక్చర్ క్వాలిటీతో వీక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని ఎల్‌జీ తెలిపింది. శనివారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో ఎల్‌జీ హెచ్ఈ డైరెక్టర్ యంగ్‌వాన్ జంగ్, సీఏవీ హెడ్ లీ ఈ టీవీని విడుదల చేశారు. బిల్ట్ ఇన్ యాపిల్ ఎయిర్‌ప్లే, గూగుల్ క్రోమ్ కాస్ట్ ఫీచర్లను ఈ టీవీలో పొందుపర్చింది. అన్ని ప్రముఖ రిటైల్ అవుట్‌లెట్స్‌తో పాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై అందుబాటులో ఉండనున్న ఈ టీవీ ప్రారంభ ధర రూ.1,79,999.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.7,000 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: బజాజ్ గ్రూప్ నుంచి మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. బజాజ్ ఫైనాన్స్ అనుబంధ విభాగమైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.4,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు మాతృసంస్థ బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన రూ.3,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది.తద్వారా సంస్థ మొత్తం రూ.7,000 కోట్లు సమీకరించనుంది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీల పరిధిలోకి వచ్చే కంపెనీలు 2025 సెప్టెంబరు నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాలన్న ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా బజాజ్ గ్రూప్ ఈ కంపెనీని మార్కెట్లో లిస్ట్ చేయబోతోంది. తాజా ఈక్విటీ ద్వారా సమీకరించనున్న నిధులను భవిష్యత్ మూలధన అవసరాలకు వినియోగించుకోనున్నట్లు కంపెనీ పేర్కొంది.

2015 సెప్టెంబరులో నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) వద్ద రిజిస్టర్ చేసుకున్న బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్.. గృహాలు, వాణిజ్య ప్రాపర్టీల కొనుగోలు, పునరుద్ధరణకు రుణాలందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కంపెనీ నికర లాభం 38 శాతం వృద్ధితో రూ.1,731 కోట్లకు చేరుకుంది.

టాటా ఏఐఏ లైఫ్ మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఏఐఏ).. మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్ పేరుతో సరికొత్త ఫండ్‌ను ప్రారంభించింది. మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్‌లోని 50 అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న స్టాక్స్‌లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ ఈ నెల 15 వరకు అందుబాటులో ఉండనుంది.

పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాల కంపెనీల కోసం ప్రత్యేక జీఎస్‌టీ ఫారం

న్యూఢిల్లీ: పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తుల తయారీదారుల పన్ను ఎగవేతలను అరికట్టేందుకు జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) ప్రత్యేక ఫారం 'జీఎస్‌టీ ఎస్ఆర్ఎం-2'ను ప్రవేశపెట్టింది. ఈ ఫారం ద్వారా కంపెనీలు సంబంధిత నెలకు సేకరించిన, వినియోగించిన ఇన్‌పుట్, అవుట్‌పుట్ వస్తు వివరాలను పన్ను అధికారులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు తమ యంత్రాలను రిజిస్టర్ చేసేందుకు జీఎస్‌టీఎన్ ఎస్ఆర్ఎం-1 ఫారాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది.

జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో చూపిన

మొత్తాన్ని చెల్లించకుంటే..?



రాంబాబు గొండాల

జీఎస్‌టీలో రిటర్న్ దాఖలు చేసే ప్రక్రియ మొదట జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌తో ప్రారంభమవుతుందనే విషయం తెలిసిందే. ఒక నెలలో జరిపిన అమ్మకాలు లేదా సరఫరాల తాలుకు వివరాలు, అంటే సరఫరాల విలువ, ఇన్వాయిస్‌ల వివరాలు, పన్ను శాతం, కట్టవలసిన పన్ను, ఇంకా క్రెడిట్ నోట్, డెబిట్ నోట్ వివరాలతో పాటు కొనుగోలుదారుల జీఎస్‌టీ వివరాలు కూడా ఇందులో ఉంటాయి. అలాగే జీఎస్‌టీఆర్-1లో చూపిన వివరాల ప్రకారమే అవతలి వ్యక్తి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకుంటాడు. ఒక విధంగా చెప్పాలంటే జీఎస్‌టీఆర్-1 అతి ముఖ్యమైన రిటర్న్. ఇందులో చూపిన పన్ను అనేది స్వయంగా మదింపు చేసిన పన్ను. దీనినే 'సెల్ఫ్ అసెస్డ్ ట్యాక్స్' అంటారు. కానీ, ఈ రిటర్న్ ద్వారా పన్ను చెల్లించే సౌలభ్యం లేదు. ఈ రిటర్న్‌లో చూపిన మొత్తాన్ని జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ద్వారా చెల్లించాలి. అందుకే, ఏదేనీ నెలకు లేదా పీరియడ్‌కు సంబంధించి జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ద్వారా కట్టిన పన్ను వివరాలు జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను వివరాలతో సరిపోవాలి. సాధారణంగా కట్టాల్సిన పన్ను కంటే తక్కువ కడితే, చట్ట ప్రకారం నోటీసు ఇవ్వవలసి ఉంటుంది. కానీ, జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను కంటే జీఎస్‌టీఆర్-3బీ ద్వారా కట్టిన పన్ను తక్కువగా ఉంటే ఎలాంటి నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేకుండా రికవరీ చర్యలకు ఉపక్రమించే అధికారం అధికారులకు ఉంది. ఎందుకంటే ఇది వ్యాపారి తాను స్వయంగా మదింపు చేసిన పన్ను కాబట్టి.

అయితే ఇలా పన్ను తక్కువ కట్టటానికి కొన్ని సందర్భాల్లో సరైన కారణాలు ఉండవచ్చు. ఉదాహరణకు ముందు నెలలో ఎక్కువ పన్ను కట్టి ఉండవచ్చు. ఆ మేరకు ఈ నెలలో తగ్గించి ఉండవచ్చు. పన్ను తక్కువ కట్టటానికి గల కారణాలను తెలుసుకోకుండా తగు చర్యలు తీసుకుంటే పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులు ఎదురవుతాయన్న కారణంతో ప్రభుత్వం కొత్తగా ఒక పద్ధతిని ప్రవేశపెట్టింది. దీనినే డీఆర్‌సీ-01 బీ అంటారు. ఎప్పుడైతే, జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను కంటే జీఎస్‌టీఆర్-3బీ ద్వారా కట్టిన పన్ను తక్కువగా ఉందో, అప్పుడు తగు వివరణ కోరుతూ సదరు వ్యాపారికి ఈ డీఆర్‌సీ-01 బీ జారీ చేస్తారు. ఇది జీఎస్‌టీ కామన్ పోర్టల్ ద్వారా జారీ చేయబడుతుంది. అంతే కాకుండా సంబంధిత వ్యాపారి, జీఎస్‌టీలో ఇచ్చిన ఈ-మెయిల్‌కు కూడా పంపబడుతుంది.

ఈ డీఆర్‌సీ-01 బీ రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది పార్ట్-ఏ, ఇందులో జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను వివరాలు, జీఎస్‌టీఆర్-3బీ ద్వారా కట్టిన పన్ను వివరాలు, ఎంత తక్కువ కట్టారు మొదలైన వివరాలు ఉంటాయి. తక్కువ కట్టిన పన్నును ఈ నోటీస్ అందుకున్న వారంలోపు వడ్డీతో సహా డీఆర్‌సీ-03లో కట్టాలి. ఆ వివరాలను పార్ట్-బీలో చూపాలి. లేదా పన్ను తక్కువ కట్టటానికి తగు కారణాలు ఉంటే, ఆ వివరాలను కూడా పార్ట్-బీలో చూపవచ్చు. లేదా రెండు కలిపి చూపవచ్చు. ఇలా వారం రోజుల లోపు వడ్డీతో సహా పన్ను కట్టటం లేదా వివరణ ఇవ్వటం జరగాలి. పన్ను కట్టకున్నా, వివరణ ఇవ్వకున్నా లేదా ఇచ్చిన వివరణ ఆమోదయోగ్యంగా లేకున్నా పైన చెప్పిన నోటీస్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా రికవరీ చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉంటుంది. కాబట్టి జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ వేసేటప్పుడు సంబంధిత వివరాలను జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌తో ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలి. సరైన కారణాలు ఉంటే తప్ప జీఎస్‌టీఆర్-1లో చూపిన దాని కంటే తక్కువ పన్ను కట్టకూడదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,670 ▼	65,700 ▼	96,000 ▼
ముంబై	71,913 ▼	65,872 ▼	90,535 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	460
వరంగల్	447	గోదావరి	455
చిత్తూరు	513	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	154
విశాఖపట్నం	135		

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 9-6-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 54 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ*

అక్షర యోధుడి అస్తమయం

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూత

చద్ది వార్తల తెలుగు పాత్రికేయాన్ని కొత్త పుంతలు తొక్కించిన చీఫ్ ఎడిటర్!

వార్తలనే అందించే టీవీకి 24 గంటల వినోదాన్ని జోడించిన తెలుగు టీవీ!

కమర్షియల్ సినిమాకు కళాత్మకత అద్దిన మూవీ మొఘల్!

హాలీవుడ్‌లోనే ఉండే ఫిలిం సిటీని తెలుగు నేలకూ తెచ్చిన ధన్యజీవి..

ఊరికి పరిమితమైన చిట్‌ఫండ్‌ను కార్పొరేట్ చేసిన మార్గదర్శి!

ఇంటింటా పెట్టుకునే పచ్చళ్లను పరిశ్రమగా మార్చిన దార్శనికుడు!

తన కంపెనీలతో వేల మందికి ఉపాధి కల్పిస్తున్న అన్నదాత..

ఆయనే.. అతి సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి అనన్య సామాన్యుడిగా ఎదిగిన చెరుకూరి రామోజీ రావు! నిత్యం ఉషోదయంతో సత్యం నినదించుగాక అనే ఆయన ఆ ఉషోదయానికి ముందే పరమపదించారు!

- 5న తీవ్ర గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిక
- ఆరోగ్యం క్షీణించి శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస
- ముర్ము, మోదీ, రేవంత్, బాబు దిగ్భ్రాంతి
- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ సహా నివాళులర్పించిన రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు
- నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో ఫిలింసిటీలో అంత్యక్రియలు

పనిలోనే విశ్రాంతి అంటూ దశాబ్దాలుగా అవిశ్రాంత పయనం సాగించిన ఆ మహా మనిషి శాశ్వత నిద్రలోకి జారుకున్నారు..! వేలాది జీవితాల్లో వెలుగుగా మారి.. కోట్లాది మందిని కదిలించిన చైతన్యమూర్తి ఇక సెల వంటూ వీడ్కోలు పలికారు..! సామాన్య రైతు కుటుంబంలో పుట్టి.. దీక్షాదక్షతతో ముందుక సాగి.. గొప్ప శక్తిగా మారి.. మహా వ్యవస్థగా ఎదిగిన ధీశాలి, ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు(88) అస్తమించారు. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ నాన క్రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ నెల 5న తీవ్ర మైన గుండె పోటు రావడంతో రామోజీరావును ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే గుండె పనితీరు విఫలం కావడంతో పాటు రక్తపోటు పడిపో యింది. దీంతో వెంటిలేటర్‌పై ఉంచి ఇంట్రా అరోటిక్ బెలూన్ పంప్ (ఐఏబీపీ) మద్దతుతో

మిగతా 13వ పేజీలో...

రామోజీరావు మరణం బాధాకరం. భారతీయ మీడియాలో ఆయన విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు. ఆయన సేవలు సినీ, పత్రికా రంగాల్లో చెరగని ముద్ర వేశాయి. తన అవిరళ కృషితో మీడియా, వినోద ప్రపంచాల్లో నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఆయనతో సంభాషించడం, ఆయన అపారమైన జ్ఞానం నుంచి లబ్ధి పొందేందుకు నాకు అనేక అవకాశాలు లభించడం నా అదృష్టం.


- ప్రధాని నరేంద్ర మోదీ



తెలుగు రాష్ట్రాలకు ఆరేడు

కేంద్ర మంత్రివర్గంలో పదవులు!?.. టీడీపీకి 3, బీజేపీకి 3, జనసేనకు 1

- రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాలశౌరి, పురందేశ్వరి, ఈటల, బండి లేదా డీకే అరుణకు చాన్స్
- కిషన్‌రెడ్డికి పదవిపై సందిగ్ధత.. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం?
- మంత్రివర్గంపై అర్ధరాత్రి దాకా మోదీ కసరత్తు
- మిత్రపక్షాలకు ఇచ్చే పదవులపై స్పష్టత!
- కీలక శాఖలు బీజేపీ వద్దే
- మిత్రపక్షాలకు రైల్వే, విద్య, ఐటీ, జలశక్తి..
- నేటి ఉదయం రాష్ట్రపతి భవన్‌కు జాబితా
- రాత్రి 7.15 గంటలకు మోదీ ప్రమాణం



ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఒడిసాలోని పూరీ తీరంలో మోదీ సైకత శిల్పం

న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు ఆరు నుంచి ఏడు గురికి మంత్రి పదవులు లభించే అవకాశాలు కనిపిస్తు న్నాయి. వీరిలో టీడీపీ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఒకరు ఉండవచ్చని తెలుస్తోంది. మంత్రి పదవులు వరించే అవకాశం ఉన్న వారిలో తెలుగు దేశం నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన నుంచి బాలశౌరికి, బీజేపీ నుంచి పురందేశ్వరికి

మిగతా 2వ పేజీలో...

మోదీ ప్రమాణానికి అసాధారణ భద్రత!

- ఢిల్లీలో హైఅలర్ట్.. డ్రోన్ సంచారం నిషిద్ధం
- నేటి ప్రమాణస్వీకార వేదిక రాష్ట్రపతి భవన్ పరిసరాలు ఎన్ఎస్‌జీ ఆధీనంలోకి
- 'జీ-20' తర్వాత మళ్లీ ఆ స్థాయి ఉక్కురక్షణ
- ఇప్పటికే ఢిల్లీకి దక్షిణాసియా దేశాధినేతలు

2

ఏమో.. మోదీ సర్కారు 15 రోజుల్లో కూలిపోవచ్చు

- కేంద్రంలో త్వరలో 'ఇండియా' సర్కారు
- ప్రమాణానికి పిలవలే.. వెళ్లేదీ లేదు: మమత

విపక్ష నేతగా రాహుల్!



ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాహుల్, సోనియా, ఖర్గే

గతంలో 3 సీట్లుంటే.. ఇప్పుడు 8 గెలిచాం

ఢిల్లీలో మీడియాతో రేవంత్

11

- సీడబ్ల్యూసీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- లోక్‌సభలో పార్టీకి నేతృత్వం వహించాలని విజ్ఞప్తి
- త్వరలో నిర్ణయం చెబుతానన్న అగ్రనేత
- మీరంతా నా కుటుంబం.. మీకు నేనున్నా: రాహుల్
- భారత్ జోడోయాత్రతో ప్రజలకు దగ్గరయ్యాం
- కాంగ్రెస్ రాష్ట్రాలలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు
- కారణాలను కనుగొని చర్యలు తీసుకుంటాం: ఖర్గే
- సీపీపీ నేతగా సోనియాగాంధీ తిరిగి ఎన్నిక
- ప్రజలతీర్పు మోదీకి వ్యతిరేకం: సోనియా

న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బాధ్య తలు స్వీకరించటానికి రంగం సిద్ధమైంది. పార్టీ లోక్ సభాపక్ష నేత పదవిని చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ రాహుల్‌ను కోరింది. త్వరలో దీనిపై నిర్ణయం తీసు కుంటానని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శనివారం ఢిల్లీలోని అశోకా హోటల్‌లో సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనే తలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఇతర సీడబ్ల్యూసీ సభ్యులు ఈ భేటీకి హాజర య్యారు. ఈ సందర్భంగా సభ్యులందరూ రాహుల్ ఈసారి లోక్‌సభలో పార్టీకి నేతృత్వం

మిగతా 2వ పేజీలో...

'నీట్' మార్కులపై కమిటీ

- నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కేంద్ర విద్యా శాఖ
- 1,500 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులపై సమీక్ష
- వారంలో కమిటీ నివేదిక: ఎన్‌టీఏ డీజీ

2

ఆరోగ్యశ్రీలోకి యాంజియోగ్రామ్

- కొత్తగా 65 చికిత్స విధానాలకు ఆమోదం
- 'ఆయుష్మాన్'లోని 98 చికిత్సలకు కూడా..

11

పెద్దపల్లిలో కోకాకోలా పరిశ్రమ

రూ.700 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధం

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

- పరీక్షకు హాజరు కానున్న 4.03 లక్షల మంది
- రాష్ట్ర వ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాలు
- ఉదయం 10.30 నుంచి ఒంటిగంట దాకా
- అరగంట ముందు వస్తేనే అనుమతి: టీజీపీఎస్సీ

12

జనం నేర్పిన గుణపాఠం



కొత్త పలుకు

ఈ దేశంలో ప్రజలెవ్వరూ రాజకీయ నాయకులను మోసం చెయ్యలేరు. నాయకులే అధికార పీఠాలు ఎక్కాక ప్రజలను వంచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ తీర్పు ద్వారా యావత్ దేశానికే అద్భుత సందేశాన్ని ఇచ్చారు. పాలకుడు ఎలా ఉండకూడదో తేల్చి చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ఎంచుకున్న మోడల్ భావి తరాల ప్రయోజనాలకు ఎంత ప్రమాదకరమైనదో తమ తీర్పు ద్వారా ప్రజలు స్పష్టం చేశారు.

వంచనతో రాజకీయాలు చేసే వారికి ఏ దుస్థితి ఎదురవుతుందో స్పష్టం చేశారు. సీఎం అనే వాడు బటన్లు నొక్కడానికే పరిమితం కాకూడదని, రాష్ట్ర భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలన్న సందేశాన్ని ప్రజలు బలంగా పంపారు. కేవలం సంక్షేమం లేదా అభివృద్ధిని మాత్రమే నమ్ముకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయని గతంలో చంద్రబాబు, ఇప్పుడు జగన్ విషయంలో రుజువైంది. ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల భావన ఉన్నప్పుడే ఎవరైనా మళ్లీ మళ్లీ అధికారంలోకి వస్తారు. ఆ విషయం విస్మరించి సోషల్ మీడియా సైన్యాలను ఏర్పాటు చేసుకొనో, ప్రధాన మీడియాను డొడ్లో కట్టేసుకొనో వబ్బం గడుపుకోవాలంటే కుదరదని ప్రధాని మోదీ దగ్గర నుంచి తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్ విషయంలో ప్రజలు రుజువు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు కుల మతాల రొచ్చులో కూరుకుపోయారన్న భావన నిన్నటిదాకా ఉండేది. తాజా తీర్పుతో వారు తమ విజ్ఞతను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో ఈవీఎంల బటన్లు నొక్కి మరీ చెప్పారు. బటన్లు నొక్కడం మినహా జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి ఇదీ అని చెప్పలేని పరిస్థితి. ప్రజలను కులాల వారీగా విడదీయాలని అనుకున్నారు. ఈ వన్నాగం ఫలించలేదు. పేదలకూ పెత్తందార్లకూ మధ్య పోరాటమంటూ రెచ్చగొట్టిన ప్రయత్నాలు కూడా వికటించాయి. జగన్‌కు వ్యతిరేకంగా మొత్తం 61 శాతం ఓట్లు పడ్డాయి.

ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత ప్రమాదకర ఆటకు జగన్ రెడ్డి తెరలేపారు. సంక్షేమం మాటున ప్రజలకు డబ్బు పంచి, ఆ మాటున దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడినా అధికారానికి ఢోకా ఉండదని భావించారు. అందుకే 2019లో అధికారంలోకి రావడానికి ముందు కూడా... ఒక్కసారి అధికారంలోకి వస్తే 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకొనేవారు. జగన్ అనుసరించిన ఈ మోడల్ ఎంత ప్రమాదకరమైనదో ప్రజలు ఐదేళ్లకే గుర్తించారు.

4

ఈ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రతీ రాష్ట్రంలోనూ ఒక జగన్ తయారయ్యేవారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తూ అంతిమంగా దేశాన్ని దివాలా తీయించేవారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లోని అరాచకత్వం మన దేశంలో కూడా ఏర్పడేది.

వైసీపీకి ఇప్పుడు 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నందున జగన్మోహన్ రెడ్డికి అధికారికంగా ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా దక్కదు.

ఇప్పుడు ప్రతిపక్షమే లేకుండా పోయిందని కూటమి నేతలుగానీ, ఎమ్మెల్యేలు గానీ, కాబోయే మంత్రులుగానీ విర్రవీగితే ఐదేళ్ల తర్వాత కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారని గుర్తుంచుకోవాలి.

బాధ్యత గల మీడియాగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు ప్రభుత్వ పోకడలపై కన్నేసి ఉంచుతాయి. జగన్ ప్రభుత్వ దుశ్చర్యలకు వ్యతిరేకంగా కష్టనష్టాలకు ఓర్చి అలుపెరుగని పోరాటం చేసినట్టుగానే.. కూటమి ప్రభుత్వంపై అక్షరాయుధాలు ఎక్కుపెట్టడానికి మేం వెనుకాడబోము.

ఈ కాలమ్ రాయడానికి ఉపక్రమించినప్పుడే రామోజీరావు ఇక లేరన్న వార్త వెలువడింది. తెలుగు జర్నలిజంలో చరిత్ర సృష్టించిన ఆయన మరణం పత్రికా రంగానికే కాదు, సమాజానికి కూడా లోటు. అధికార హుంకరింపులకు వెరవకుండా రామోజీరావు అక్షర యుద్ధం సాగించారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, 'ఆంధ్రజ్యోతి' సంస్థల తరఫున ఆయనకు అక్షర నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను!

‘నీట్’ మార్కులపై కమిటీ

- నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కేంద్ర విద్యాశాఖ
- 1,500 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులపై సమీక్ష

న్యూఢిల్లీ, జూన్ 8: నీట్-2024 పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్రం స్పందించింది. 1,500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను సమీక్షించడానికి నలుగురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను కేంద్ర విద్యాశాఖ ఏర్పాటు చేసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం ప్రకటించింది. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో చేసిన మార్పులు, పరీక్ష కేంద్రాల్లో సమయం వృథా అయిన వారికి గ్రేస్ మార్కులు కలపడం వంటివి కొందరు విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించడానికి కారణమయ్యాయని తెలిపింది. ‘1,500 మంది అభ్యర్థుల ఫలితాలను సమీక్షించేందుకు అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల కమిటీ వారం రోజుల్లో సిఫారసులతో కూడిన నివేదికను సమర్పిస్తుంది. దాని ప్రకారం ఈ అభ్యర్థుల ఫలితాలను సవరించే అవకాశం ఉంది’ అని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్ తెలిపారు. గ్రేస్ మార్కులతో పరీక్ష అర్హత ప్రమాణాలపై ఏ ప్రభావం ఉండదని, అలాగే ఈ అభ్యర్థుల ఫలితాలు సమీక్షించడం అడ్మిషన్ల ప్రక్రియపై ప్రభావం చూపబోదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు. కమిటీ సిఫారసులను అనుసరించి కొందరు విద్యార్థులకు పరీక్ష మళ్లీ నిర్వహించే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రజ్వల్ గర్ల్‌ఫ్రెండ్‌కు సిట్ నోటీసులు

బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడుల కేసు నిందితుడు, జేడీఎస్ తాజా మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ గర్ల్‌ఫ్రెండ్‌కు సిట్ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. ఏప్రిల్ 26న రాత్రి బెంగళూరు నుంచి జర్మనీకి వెళ్లిన ప్రజ్వల్, 34 రోజుల తర్వాత వెనుతిరిగి వచ్చాడు. జర్మనీలో ఉన్న సమయంలో ప్రజ్వల్‌కు గర్ల్‌ఫ్రెండ్ సాయం చేసినట్లు సిట్ గుర్తించింది. దీంతో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. కాగా, సిట్ అధికారులు ప్రజ్వల్, అతని తల్లి భవానీ రేవణ్ణను శనివారం పక్కపక్క గదుల్లోనే విచారించారు. వారం రోజులపాటు భవాని రేవణ్ణపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు శుక్రవారం సూచించింది. ఈ నేపథ్యంలో భవాని విచారణకు వెళ్లారు. సుమారు 5 గంటలపాటు సిట్ కార్యాలయంలో అధికారులు ఆమెను విచారించారు.

రేప్‌లు, హత్యలు చేసినా మీకు ఫర్వాలేదా?

- తనను కొట్టిన కానిస్టేబుల్‌ను సమర్థించిన వారిపై కంగన

న్యూఢిల్లీ, జూన్ 8: చండీగఢ్ విమానాశ్రయంలో తనపై జరిగిన దాడి ఘటనను సమర్థించిన వారిపై బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ విరుచుకుపడ్డారు. తనను చెంప దెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్‌ను సమర్థించిన వారిని ఉద్దేశిస్తూ.. ‘అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకు ఫర్వాలేదా?’ అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. శనివారం ‘ఎక్స్’లో ఆమె ఈ మేరకు పోస్టు చేశారు. ‘ప్రతి రేపిస్టు, హంతకుడు లేదా దొంగ నేరం చేయడానికి బలమైన భావోద్వేగ, శారీరక, మానసిక లేదా ఆర్థిక పరమైన కారణం ఉంటుంది. కారణం లేకుండా ఏ నేరం జరగదు. చట్టాలను ఉల్లంఘించి నేరాలకు పాల్పడే నేరస్తుల భావోద్వేగాలకు మీరు విలువ ఇవ్వడం అత్యాచారాలు, హత్యలను సమ్మతించడం కిందకే వస్తుంది” అని కంగన తన విమర్శలకు సూచించారు.

హమాస్ నుంచి నలుగురు బందీలకు విముక్తి

టెల్ అవీవ్, జూన్ 8: బందీలుగా చిక్కి ఎనిమిది నెలలుగా హమాస్ చెరలో మగ్గుతున్న.. తమ దేశానికి చెందిన నలుగురు పౌరులను ఇజ్రాయెల్ రక్షించింది. శనివారం సెంట్రల్ గాజాలోని హమాస్ శిబిరంపై ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నోవా అర్గామని (25), అల్మోగ్ మెయిర్ జాన్ (21), ఆండ్రీ కోజ్‌లోవ్ (27), షామీ జీవ్ (40) అనే నలుగురు బందీలను విడిపించింది. హమాస్ చెర నుంచి బయటపడ్డ ఈ నలుగురు క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విడుదలైన వారు తిరిగి తమ వారిని కలుసుకున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు.

డెన్మార్క్ ప్రధానిపై దాడి.. ఒకరి అరెస్టు

న్యూఢిల్లీ, జూన్ 8: డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడ్రిక్సెన్‌పై దాడి జరిగింది. శుక్రవారం సాయంత్రం డెన్మార్క్ రాజధాని కోపెన్‌హగన్‌లోని కోల్డ్‌రవెట్ ప్రాంతంలో ఒక వ్యక్తి ప్రధానిపై దాడి చేశారని, ఆ ఘటనతో ఆమె షాక్‌కు గురయ్యారని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దాడిలో ప్రధానికి ఎలాంటి గాయాలుకాలేదని నిందితుడ్ని అరెస్ట్ చేశామని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు చెప్పారు. అయితే మెటె ఆరోగ్య పరిస్థితి గురించి ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. కాగా, అత్యంత పిన్న వయస్సు డెన్మార్క్ ప్రధానిగా 2019లో ఫ్రెడ్రిక్సెన్ బాధ్యతలు స్వీకరించారు.

డీప్ ఫేక్ యుగంలో ఫొటోలు సాక్ష్యాలు కావు

- వివాహేతర సంబంధం కేసులో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 8: డీప్ ఫేక్ చిత్రాలు చలామణి అవుతున్న ప్రస్తుత కాలంలో ఫొటోలను సాక్ష్యాలుగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది. ఆ ఫొటోలు నిజమైనవని నిరూపించేందుకు ఇతరత్రా ఆధారాలు ఉండాలని తెలిపింది. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందంటూ ఓ భర్త సాక్ష్యాలుగా సమర్పించిన ఫొటోలపై ఈ వ్యాఖ్య చేసింది. ఓ జంటకు విడాకులు మంజూరు చేసిన ఫ్యామిలీ కోర్టు..భార్యకు, అయిదేళ్ల కుమార్తెకు కలిపి నెలకు రూ.75వేల వంతున మనోవర్తిగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ ఆయన హైకోర్టులో అప్పీలు చేయగా జస్టిస్ రాజీవ్ షక్దర్, జస్టిస్ అమిత్ బన్సల్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని, అందువల్ల మనోవర్తి ఇవ్వాల్సిన పనిలేదంటూ కొన్ని ఫొటోలను ఆయన కోర్టుకు సమర్పించాడు. ఫొటోలు స్పష్టంగా లేవని, డీప్ ఫేక్ చిత్రాల బెడద ఉన్నందున వాటిని సాక్ష్యాలుగా గుర్తించలేమని ధర్మాసనం తెలిపింది.

నేవీ మహిళా పైలట్‌కు తొలిసారిగా ‘గోల్డెన్ వింగ్స్’

న్యూఢిల్లీ, జూన్ 8: భారత నౌకాదళంలో పనిచేస్తున్న మహిళా పైలట్‌కు తొలిసారిగా గోల్డెన్ వింగ్స్ పతకం లభించింది. హెలికాప్టర్ పైలట్‌గా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సబ్ లెఫ్టినెంట్ అనామిక బి రాజీవ్‌కు ఈ గౌరవం దక్కింది. తమిళనాడులోని అరక్కోణంలో ఉన్న నేవల్ ఎయిర్ బేస్ స్టేషన్‌లో శనివారం జరిగిన పాసింగ్ అవుట్ పెరేడ్‌లో ఈస్టర్న్ నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్‌కర్ దీన్ని అందజేశారు. శిక్షణ పూర్తి చేస్తున్న 21 మందికి ఈ అవార్డులు దక్కాయి. ఆమెతో పాటు జమ్‌యాంగ్ త్సెవాంగ్ మరో రికార్డు సృష్టించారు. ఆయన లద్దాఖ్ నుంచి ఎంపికయిన తొలి నేవీ కమిషన్డ్ ఆఫీసర్ కావడం విశేషం. 22 వారాల శిక్షణలో ప్రతిభ చూపించిన వారికి ఈ పతకాలు బహూకరించారు.

సీట్లెందుకు తగ్గాయి.. లోపమెక్కడ?

- పార్టీ రాష్ట్రాల అధ్యక్షులతో బీజేపీ అధ్యక్షుడు నడ్డా భేటీ
- తెలుగు రాష్ట్రాల్లో ఫలితాలపై హర్షం

న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో 370 స్థానాలకు పైగా గెల్చుకుంటామని చెప్పిన బీజేపీకి ఆశించిన ఫలితం దక్కలేదు. దీంతో ఎన్డీఏ కూటమిలోని భాగస్వామ్య పక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, ఏయే రాష్ట్రాల్లో నష్టం ఏ మేరకు వాటిల్లింది? కారణాలేమిటి? అనే దానిపై ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అన్ని రాష్ట్రాల అధ్యక్షులతో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశం నిర్వహించారు. యూపీలో సీట్లు తగ్గడంపై ఈ భేటీలో ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిసింది. దక్షిణాదిలో ఇంకొన్ని సీట్లు వస్తాయని భావించామని, కానీ, ఆశించిన మేర రాలేదని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో ఫలితాలపై నడ్డా సంతోషం వ్యక్తం చేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో పార్టీకి పోలైన ఓట్ల శాతం పెరగడం, గతంలో కంటే నాలుగు స్థానాలు ఎక్కువగా రావడం శుభ పరిణామమని, అయితే.. 10 స్థానాలు వస్తాయని ఆశించామని, కానీ 8 స్థానాలే వచ్చాయని నడ్డా వ్యాఖ్యానించినట్లు సమాచారం. తెలంగాణలో పార్టీ బలోపేతంపై మరింత శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సూచించినట్లు తెలిసింది. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం, బీజేపీ తొలిసారిగా 8 శాసనసభ, 3 లోక్‌సభ సీట్లలో విజయం సాధించడంపై నడ్డా హర్షం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

విపక్ష నేతగా రాహుల్!

(మొదటి పేజీ తరువాయి)

వహించాలని, తద్వారా విపక్ష నేతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనిపై రాహుల్ సానుకూల సంకేతాలు ఇస్తూ.. త్వరలోనే తన నిర్ణయం చెబుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ‘మీరంతా నా కుటుంబం. గత పదేళ్లలో పార్టీని వీడి పోయే వాళ్లు పోయారు. మీకు నేనున్నా’ అని కాంగ్రెస్ నేతలకు భరోసానిచ్చారు. పోరాడే ధైర్యం ఉన్న వాళ్లే పార్టీలో ఉన్నారని రాహుల్ వ్యాఖ్యానించారు.

జోడోయాత్రతో పార్టీ ప్రజలకు దగ్గరైంది

రెండు గంటల పాటు జరిగిన సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఎన్నికల్లో దేశప్రజలు కాంగ్రెస్‌ను విశ్వసించారని తెలిపారు. రాహుల్ జరిపిన భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రతో దేశప్రజలకు కాంగ్రెస్ దగ్గరైందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక న్యాయం తదితర అంశాలను ఈ ఎన్నికలలో ప్రజల సమస్యలుగా రాహుల్ మార్చారని పేర్కొన్నారు. రాహుల్ యాత్రలు జరిగిన చోట్ల కాంగ్రెస్‌కు ఎన్నికలలో మంచి ఫలితాలు వచ్చాయని ఖర్గే తెలిపారు. గత పదేళ్లలో బీజేపీ జరిపిన విభజన, విద్వేషపూరిత రాజకీయాలను ప్రజలు ఎన్నికలలో తిరస్కరించారని, నియంతృత్వ, రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు బుద్ధి చెప్పారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి అపారమైన మద్దతు లభించిందని తెలిపారు. కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ మంచి పనితీరు కనబరిచినప్పటికీ మరికొన్ని రాష్ట్రాలలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో మంచి ఫలితాలు సాధించి లోక్‌సభ ఎన్నికలలో ఆ స్థాయి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయామని హిమచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు లభించిన స్థానాలను ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాని రాష్ట్రాల్లో పార్టీ పనితీరుపై కమిటీలను ఏర్పాటు చేసి సమీక్షిస్తామన్నారు. ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలు ఐక్యంగా, సమర్థంగా పని చేశాయని.. ఇదే ఒరవడిని ఇకపైనా పార్లమెంటులోనూ, పార్లమెంటు బయటా కొనసాగించాలని పేర్కొన్నారు. కాగా, రాహుల్‌గాంధీని లోక్‌సభలో ప్రతిపక్షనేతగా బాధ్యతలు స్వీకరించాలని సీడబ్ల్యూసీ సభ్యులు ఏకగ్రీవంగా కోరారు. కాంగ్రెస్ ఎజెండాను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రతిపక్షనేతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఖర్గే కూడా సీడబ్ల్యూసీ సభ్యుల విజ్ఞప్తికి మద్దతు పలికారు. స్పందించిన రాహుల్ త్వరలోనే తన నిర్ణయం చెబుతానని అన్నారు.

మళ్లీ అగ్రస్థానం చేరుకోవాలి

సీడబ్ల్యూసీ రెండు తీర్మానాలు చేసింది. ఒక తీర్మానంలో ఎన్నికల ఫలితాలు, పార్టీ పనితీరును ప్రస్తావించింది. ‘మోదీ పాలన 2014లో మొదలైనప్పటి నుంచీ దేశంలో ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామిక సంస్థలకు దుర్దశ ప్రారంభమైంది. దీనికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మోదీ గ్యారెంటీల పేరుతో ఎన్నికలకు వెళ్లిన ప్రధాని అబద్ధాలు, విద్వేషం, విభజనపూరిత ప్రచారం నిర్వహించారు. ప్రజలు దీనిని తిరస్కరిస్తూ తీర్పు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, సామాజిక, ఆర్థిక న్యాయాన్ని రక్షించుకోవటానికి వీలుగా తీర్పు ఇచ్చారు. ఇది మోదీకి రాజకీయంగానేగాక నైతికంగా, వ్యక్తిగతంగా కూడా ఓటమే. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజల పక్షాన అద్భుతమైన అంశాలను ముందుకు తీసుకొచ్చి ప్రచారం జరిపింది. ఎన్నికల్లో మనం పునరుజ్జీవం పొందాం. కానీ దేశ రాజకీయాల్లో ఒకప్పుడు మనకున్న అగ్రస్థానానికి తిరిగి చేరేందుకు చాలా దూరం వెళ్లాల్సి ఉంది. ప్రజలు కాంగ్రెస్‌కు మరో అవకాశం ఇచ్చారు. పార్టీని నిర్మించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు మనపై ఉంది. మనం చేయాలి. చేస్తాం’ అని తీర్మానంలో పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని రాహుల్‌ను కోరుతూ మరో తీర్మానం చేశారు. కాగా, ఈ భేటీకి ఏపీ, తెలంగాణ నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు దామోదర రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి, పల్లంరాజు, టి.సుబ్బిరామిరెడ్డి, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు హాజరయ్యారు. మరోవైపు, ఏపీలో జరుగుతున్న దాడుల పట్ల కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు స్పందిస్తూ.. ఈ రకమైన దాడులను వైసీపీయే మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ కూడా ఇదే తరహా దాడులకు పాల్పడుతోందన్నారు. శాంతిభద్రతలను పోలీసులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్, ఖర్గే, సోనియా, ప్రియాంక, కేసీ వేణుగోపాల్

రాయ్‌బరేలీకే రాహుల్ ఓటు

న్యూఢిల్లీ, జూన్ 8: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకునే అవకాశాలు ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఆయన ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీతో పాటు, కేరళలోని వయనాడ్ నుంచి కూడా గెలుపొందారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక సభ్యుడు రెండు స్థానాల్లో పోటీ చేయవచ్చు. కానీ ఒక స్థానానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. ఈ అంశంపై ఫలితాలు వెలువడిన 14 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే రెండూ రద్దవుతాయి. ఈ నేపథ్యంలో ఆయన ఏ నియోజకవర్గాన్ని అట్టిపెట్టుకోవాలి, దేన్ని విడిచిపెట్టాలన్నదానిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో చర్చ జరిగింది. వయనాడ్ నుంచే ప్రాతినిధ్యం వహించాలని కేరళ ఎంపీలు కోరగా, రాయ్‌బరేలీని నిలుపుకోవాలని యూపీ నేతలు కోరారు. మూడు సార్లు మినహాయిస్తే రాయ్‌బరేలీ నుంచి గాంధీ కుటుంబ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారని యూపీ నేతలు గుర్తుచేశారు. 1952 నుంచి ఆ కుటుంబానికి చెందిన వారే ఎంపీలుగా ఉన్నారని, అది తరతరాలుగా వారికి కంచుకోటలా ఉందని తెలిపారు. రాహుల్.. రాయ్‌బరేలీలో ఉంటేనే యూపీలో కాంగ్రెస్ బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయన రాయ్‌బరేలీనే నిలుపుకొని అవకాశం ఉందని భావిస్తున్నారు.

కాంగ్రెస్ సీపీపీ నేతగా సోనియాగాంధీ

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం జరిగింది. సీపీపీ నేతగా సోనియా పేరును ఖర్గే ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను గౌరవ్ గొగోయ్, కె.సుధాకరన్, తారిఖ్ అన్వర్ బలపరిచారు. ఈ సందర్భంగా సోనియా మాట్లాడుతూ, ఎన్నికల్లో మోదీ ప్రజాతీర్పును కోల్పోయారని, అయినప్పటికీ నైతిక బాధ్యత తీసుకోకుండా తిరిగి ప్రధాని పదవి చేపట్టటానికి సిద్ధమయ్యారని విమర్శించారు. మోదీ తన పనితీరును మార్చుకుంటారని ఆశించలేమని, కాబట్టే, విపక్షంగా ఎప్పటికప్పుడు ఆయనను, ఆయన ఎన్డీఏ ప్రభుత్వ పనితీరును ప్రజలకు జవాబుదారీగా ఉండేట్లు చూసే బాధ్యత మనదేనన్నారు.

లోకం తీరు



ప్రధాని పదవి ఇస్తామని నితీశ్‌కు ‘ఇండియా’ ఆఫర్

- జేడీయూ నేత త్యాగి



న్యూఢిల్లీ, జూన్ 8: బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్‌కు ప్రధాని పదవి ఇస్తామంటూ ఇండియా కూటమి ఆఫర్ చేసిందని ఆ పార్టీ నేత కేసీ త్యాగి సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే.. ఎలాంటి ఆఫర్లనూ తాము స్వీకరించేది లేదని చెప్పారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో త్యాగి ఈ వ్యాఖ్యలు చేశారు. “ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఇండియా కూటమి నితీశ్‌కు ప్రధాని పదవిని ఆఫర్ చేసింది. కానీ, వచ్చే ఐదేళ్లు ఎన్డీయేతోనే కలిసి పనిచేయాలని మేం నిర్ణయించుకొన్నాం” అని త్యాగి అన్నారు. తమను ఆఫర్లకు లొంగే నాయకులుగా కాంగ్రెస్ సహా మిత్ర పక్షాలు భావించడం బాధ కలిగించిందన్నారు. ఇండియా కూటమి కన్వీనర్ పోస్టుకు నితీశ్‌కు అర్హత లేదని భావించిన వారు ఇప్పుడు ప్రధాని పదవికి పనికి వస్తారని ఎలా భావిస్తున్నారని త్యాగి ప్రశ్నించారు. బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు. హోదా ఇవ్వకపోతే బిహార్ అభివృద్ధి అసాధ్యమని చెప్పారు. ఇదిలా వుంటే, ఎన్డీయే కూటమిలో భాగస్వామ్య పక్షంగా ఉన్న జేడీయూకు కేంద్రంలో రెండు పదవులు దక్కనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా పదవులకు సీనియర్ నాయకుడు లలన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్ పేర్లను నితీశ్ కుమార్ సూచించినట్టు సమాచారం. వీరిలో రామ్‌నాథ్ ఠాకూర్.. భారత రత్న కర్పూరీ ఠాకూర్ కుమారుడు కావడం గమనార్హం. కాగా, కేసీ త్యాగి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఖండించారు. “కూటమి విషయం పక్కన పెడితే.. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సమాచారం లేదు” అని అన్నారు.

మోదీ ప్రమాణానికి అసాధారణ భద్రత!

ఢిల్లీలో హైఅలర్ట్.. డ్రోన్ సంచారం నిషిద్ధం.. నేటి ప్రమాణస్వీకార వేదిక రాష్ట్రపతి భవన్

న్యూఢిల్లీ, జూన్ 8 : మోదీ 3.0 సర్కారు కొలువు తీరే వేళయింది. మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమం కోసం దేశ రాజధాని అసాధారణ రీతిలో అప్రమత్తమైంది. ప్రమాణ స్వీకార వేదిక అయిన రాష్ట్రపతి భవన్ పరిసరాల్లో ప్రైవేటు డ్రోన్ల సంచారాన్ని పూర్తిగా నిషేధించారు. ఢిల్లీ ఇప్పటికే భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. నేషనల్ సెక్యూరిటీ గార్డులు, షార్ప్ షూటర్ బృందాలు రంగంలోకి దిగాయి. ప్రమాణ స్వీకార మహోత్సవానికి దక్షిణాసియా దేశాల అధినేతలు వస్తుండటం, అధికార ఎన్డీయే పార్టీల అధినాయకులందరికీ ఆహ్వానాలు వెళ్లడంతో, ఢిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. ప్రపంచ దేశాల అధినేతలు గత ఏడాది పాల్గొన్న జీ-20 సదస్సుకు కల్పించిన భద్రతను తలపించేలా ఏర్పాట్లు ఉన్నాయని ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. ప్రపంచాధినేతలు ఢిల్లీలో బస చేసిన హోటళ్ల దగ్గర, వారు పాల్గొనాల్సిన సదస్సు ప్రాంగణం, పరిసర ప్రాంతాలను అప్పట్లో అణువణువున ప్రత్యేక భద్రతా బృందాలు జల్లెడ పట్టాయి. చిన్న పొరపాటుకూ తావు ఇవ్వకుండా డేగకళ్ల పహారా కొనసాగించాయి. మళ్లీ.. ఇప్పుడు అదే వాతావరణం దేశ రాజధానిలో కనిపిస్తోంది. ఢిల్లీ హై ఓల్టేజీ స్థితికి చేరుకుంది. ప్రమాణ స్వీకార వేడుకలో పాల్గొనే ప్రముఖులు బస చేసిన హోటళ్లు, రిసార్టులు, ప్రభుత్వ అతిథి గృహాల వద్ద పెద్దఎత్తున భద్రతా సిబ్బందిని మోహరించారు. మూడు అంచెల భద్రతా వలయాన్ని రాష్ట్రపతి భవన్ వద్ద, పరిసరాల్లో నిర్మించారు. మొదటి అంచెలో ఐదు కంపెనీల పారామిలిటరీ బలగాలు, రెండో అంచెలో నేషనల్ సెక్యూరిటీ గార్డులు, డ్రోన్లు, ఆ తర్వాతి అంచెలో స్నైపరు బృందాలు (స్వాట్- స్పెషల్ వెపన్స్ అండ్ ట్యాక్టిక్స్) ఉన్నాయి. రాష్ట్రపతి భవన్ బయటి పరిసరాలు పూర్తిగా ఎన్ఎస్‌జీ, స్వాట్ బృందాల అదుపులో ఉన్నాయి. ప్రముఖులు తాము బస చేసిన హోటళ్ల నుంచి ఏ మార్గంలో రాష్ట్రపతిభవన్‌కు వెళ్లాలి.. తిరిగి వారి బసకు ఎలా చేరుకోవాలనేదానిపై నిర్దిష్ట రూట్‌మ్యాప్‌ను తయారుచేశారు. ఈ రూట్లను స్నైపర్లు, సాయుధ బలగాలు తమ అదుపులోకి తీసుకున్నాయి. దాదాపు 2500 మంది పోలీసులను ఈ పనులకు నియమించారు. ఢిల్లీలోని వ్యూహాత్మక ప్రాంతాల్లో డ్రోన్ల పహరా కొనసాగుతోంది. అతిథులుగా ఆహ్వానించిన ఇరుగుపొరుగు (పాకిస్థాన్‌ను మినహాయించి) దేశాల అధినేతలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. లీలా, తాజ్, ఐటీసీ మౌర్య, క్లారిడ్జెస్, ఒబెరాయ్ తదితర ఫైవ్ స్టార్ హోటళ్లను వారికోసం బుక్ చేశారు.

హాజరుకానున్న పలు దేశాల అధినేతలు



మోదీ ప్రమాణ స్వీకారోత్సవం కోసం శనివారం ఢిల్లీకి చేరుకొన్న బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా

న్యూఢిల్లీ, జూన్ 8 : వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా మోదీ ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. 73 ఏళ్ల మోదీ భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూతో సమానంగా మూడోసారి ప్రధాని కానుండడం విశేషం. నెహ్రూ వరుసగా 1952, 1957, 1962 సాధారణ ఎన్నికల్లో గెలిచి ప్రధాని అయ్యారు. భారత పొరుగు దేశాలు, హిందూ మహా సముద్ర ప్రాంత దేశాల అధినేతలు మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మాల్దీవుల అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు, సీషెల్స్ వైస్‌ప్రెసిడెంట్ అహ్మద్ అఫిఫ్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జగ్‌నాథ్, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్రధాని షెరింగ్ తబ్గే హాజరుకానున్నారు. భారత్ అనుసరిస్తున్న పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం, సాగర్ విజన్‌లో భాగంగానే వీరిని ఆహ్వానించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కాగా 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సార్క్ దేశాల అధినేతలు హాజరయ్యారు. 2019లో రెండోసారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిమ్‌స్టెక్(బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టిసెక్టొరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోపరేషన్) దేశాల అధినేతలు హాజరయ్యారు. తాజా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దేశంలో పలువురికి ఆహ్వానం అందింది. మహారాష్ట్రలో వందేభారత్ రైలు లోకో పైలెట్ సురేఖా యాదవ్‌తోపాటు మరో 9 మంది లోకో పైలెట్‌లకు ఆహ్వానం అందడం విశేషం. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. రెడ్ కార్పెట్‌తో ఈ కార్యక్రమానికి చేసిన ఏర్పాట్ల చిత్రాలను రాష్ట్రపతి భవన్ విడుదల చేసింది.

కొన్ని ప్రభుత్వాలు ఒక్క రోజే!

- ఏమో.. మోదీ సర్కారు 15 రోజుల్లో కూలిపోవచ్చు
- కేంద్రంలో త్వరలో ‘ఇండియా’ కూటమి ప్రభుత్వం: మమత



కోల్‌కతా, జూన్ 8: ఎన్నికల్లో కనీస మెజారిటీ సాధించడంలో విఫలమై.. మిత్రపక్షాల మద్దతుతో ఎన్డీఏ అధికారం చేపడుతున్న వేళ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని ప్రభుత్వాలు ఒక్కరోజే ఉంటాయని.. మోదీ సర్కారు పదిహేను రోజుల్లో కూలిపోవచ్చేమో? అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా, అక్రమంగా అధికారంలోకి వచ్చిందని, వారికి శుభాకాంక్షలు చెప్పలేమని వ్యాఖ్యానించారు. కేంద్రంలో త్వరలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేమని అంటే ఎప్పటికీ చేయలేమని అర్థం కాదు కదా? అని తెలిపారు. శనివారం కొత్తగా ఎన్నికైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీల సమావేశంలో మమతా మాట్లాడారు. “400 సీట్లు గెలుస్తామని మాట్లాడినవారు సొంతంగా కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయారు. ఇండియా కూటమి వెనక్కుపోయిందని అనుకోవద్దు. పరిస్థితులు మారుతాయని మేం వేచి చూస్తున్నాం. కొద్ది రోజులు ఆగండి. ఏమో ఏమైనా జరగొచ్చు. ఇలాంటి బలహీన, అనిశ్చిత ప్రభుత్వం పడిపోతేనే మాకు ఆనందం. మోదీ ప్రమాణానికి మమ్మల్ని పిలవలేదు. పిలిచినా మేం వెళ్లేవాళ్లం కాదు. అసంతృప్తులను పట్టుకుని బీజేపీ వాళ్లు మళ్లీ పార్టీలను చీలుస్తారు” అని మండిపడ్డారు. కాగా, తృణమూల్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్‌గా మమతా బెనర్జీని, లోక్‌సభాపక్ష నేతగా సుదీప్ బందోపాధ్యాయను, ఉపనేతగా కకోలీ ఘోష్ దస్తీదర్‌ను ఎన్నుకున్నారు. రాజ్యసభా పక్ష నేతగా డెరెక్ ఓబ్రయిన్‌ను మరోసారి నియమించారు.

తెలుగు రాష్ట్రాలకు ఆరేడు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం లభించవచ్చని సమాచారం. తెలంగాణ నుంచి ఈసారి కిషన్ రెడ్డికి మళ్లీ మంత్రి పదవి ఇస్తారా? లేదా? అన్న చర్చ జరుగుతోంది. ఆయనకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలు కూడా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణకు చెందిన ఇతర నేతల్లో ఈటల రాజేందర్, డీకే అరుణ, బండి సంజయ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా, బండి సంజయ్, డీకే అరుణల్లో ఒకరికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించవచ్చునని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తమ్మీద ఏపీ, తెలంగాణలకు ఆరు నుంచి ఏడు మంత్రి పదవులు లభించే అవకాశం కనిపిస్తోంది. మూడవసారి ప్రధాని పదవిని చేపట్టటానికి సిద్ధమవుతున్న మోదీ తన నూతన మంత్రివర్గం కూర్పుపై కసరత్తును ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి వరకూ కసరత్తు కొనసాగినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ కూటమి మిత్రపక్షాలకు కేటాయించాల్సిన మంత్రిపదవులు, శాఖలపై మోదీ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారని, బీజేపీలో ఎవరెవరికి ఇవ్వాలనేది మాత్రం ఇంకా ఖరారు కాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదివారం రాత్రి 7.15 నిమిషాలకు మోదీ, ఆయనతోపాటు కొందరు మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్న విషయం తెలిసిందే. మోదీతోపాటు దాదాపు 30 మంది మంత్రులు ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలోకి తీసుకునే వారి పేర్ల జాబితాను ఆదివారం ఉదయమే రాష్ట్రపతి భవన్‌కు పంపిస్తారని, ఈ మేరకు ఆయా నేతలకు ప్రధానమంత్రి కార్యాలయం సమాచారం అందిస్తుందని తెలిసింది. ఇప్పటి వరకూ పూర్తిగా సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని నడిపిన మోదీ.. తొలిసారిగా సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించాల్సి రావడం వల్ల మంత్రివర్గ కూర్పులో మిత్రపక్షాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. అయితే హోం, ఆర్థికం, వాణిజ్యం, పరిశ్రమలు, రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, పెట్రోలియం, రోడ్డు రవాణా, న్యాయ మొదలైన మంత్రిత్వ శాఖలను బీజేపీయే తీసుకోవచ్చని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రైల్వే, విద్య, ఐటీ, జలశక్తి, విద్యుత్, గనులు, వ్యవసాయం తదితర మంత్రిత్వ శాఖల్లో క్యాబినెట్ మంత్రి పదవులుగానీ, సహాయ మంత్రి పదవులనుగానీ మిత్రపక్షాలకు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్డీయే మిత్రపక్షాల నుంచి

కేంద్ర మంత్రివర్గంలో ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలకు చెందిన కుమార స్వామి (జేడీఎస్), చిరాగ్ పశ్వాన్ (లోక్ జనశక్తి), ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ), లలన్ సింగ్, ఇటీవల భారతరత్న పురస్కారం పొందిన దివంగత నేత కర్పూరీ ఠాకూర్ తనయుడు రాంనాథ్ ఠాకూర్, సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), జితన్ రాం మాఝీ (హెచ్ఏఎం), అనుప్రియ పటేల్ (అప్నాదళ్), జయంత్ చౌదరి (ఆర్ఎల్డీ), శ్రీరంగ్ బర్నే, ప్రతాప్ రావు జాదవ్ (శివసేన)లకు అవకాశాలు కనిపిస్తున్నాయి.

బీజేపీ నుంచి..

బీజేపీ నుంచి అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియా, బసవరాజ్ బొమ్మై, ప్రహ్లాద్ జోషి, జితిన్ ప్రసాద, రాజీవ్ ప్రతాప్ రూడీ, గజేంద్ర సింగ్ షెకావత్, సురేశ్ గోపి, జితేంద్రసింగ్, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ సింగ్, శంతను ఠాకూర్, జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ, బాన్సురీ స్వరాజ్, పురందేశ్వరి, సంజయ్ జైస్వాల్ తదితరులు ఉండే అవకాశాలున్నాయి.

మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్ రూరల్ జూన్ 8(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో సీఎస్ఎంఆర్ఎస్(సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) బృందం పరీక్షలు నాలుగో రోజైన శనివారం కూడా కొనసాగాయి. కుంగిన ప్రతి పిల్లరుతోపాటు గేట్ల ముందున్న బే ఏరియాల్లో డ్రిల్లింగ్ చేపడుతున్నారు. తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా చేపట్టిన ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్, షీట్‌పైల్స్ అమరిక, సీసీ బ్లాకుల రీఅరెంజ్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయి. మరో వైపు ఏడో బ్లాక్‌లోని 22వ గేటును సుమారు 100.50 మీటర్ల మేర శనివారం సాయంత్రం ఎత్తారు. 7వ బ్లాక్‌లో మొత్తం 11 గేట్లుండగా నాలుగు గేట్లను బ్యారేజీ కుంగిన మరుసటి రోజే ఎత్తారు. మే 17న 15వ నెంబరు గేటును ఎత్తి, తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించిన అధికారులు గత బుధవారం సాయంత్రం అదే బ్లాకులోని 16,17 గేట్లను ఎత్తారు. 20,21 గేట్లను కట్ చేసి తొలగించే పనులు చేపడుతున్నారు. 19 నెంబరు గేటును ఎత్తాల్సి ఉంది. ఇక, అన్నారం బ్యారేజీలో చేపట్టిన గ్రౌటింగ్ పనులు శనివారంతో పూర్తయ్యాయి. బ్యారేజీలోని 28,38,35,44 వెంట్లలో డ్రిల్లింగ్ చేపట్టి మట్టి నమూనాలను సేకరించేందుకు సిద్ధమవుతున్నారు. 25 మీటర్ల మేర డ్రిల్లింగ్ చేపట్టి.. నమూనాలను పూణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులకు పంపించి పరీక్షలు చేయించనున్నారు. బ్యారేజీకి దిగువన చేపట్టిన సీసీ బ్లాకుల రీఅరెంజ్‌మెంట్ పనులు, బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఉన్న ఇసుక తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

బుద్ధవనాన్ని అగ్రస్థానంలో నిలుపుతాం

» మంత్రి జూపల్లి

నాగార్జునసాగర్, జూన్ 8: రాష్ట్రంలోని బుద్ధవనాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనం ప్రాజెక్టును శనివారం ఆయన నాగార్జునసాగర్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డిలతో కలిసి సందర్శించారు. బుద్ధవనంలో బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధవనంలో కలియదిరిగారు. మహాస్థూపం లోపల కాసేపు ధ్యానం చేశారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుద్ధవనాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రపంచానికి బౌద్ధ వారసత్వాన్ని, సంస్కృతిని చాటి చెప్పాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. నాగార్జునసాగర్‌ను పర్యాటకంగా మరింతగా అభివృద్ధి చేస్తే ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పాటు దిశగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నూతన ప్రతిపాదనలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు.

కేటీపీఎస్ కాలుష్యంపై మరోసారి తనిఖీలు చేయండి

» హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) కాలుష్యంపై మరోసారి తనిఖీలు నిర్వహించి, అఫిడవిట్ దాఖలు చేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కేటీపీఎస్ వ్యర్థాల వల్ల కిన్నెరసాని నది, కరకవాగు కాలుష్యానికి గురవుతున్నాయని గతంలో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. హైకోర్టు ఆదేశాలతో 2022లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించారు. ప్రస్తుత పరిస్థితి ఏంటో తెలుసుకునేందుకు మళ్లీ తనిఖీలు నిర్వహించి, అఫిడవిట్ రూపంలో నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ బోర్డుకు ఆదేశాలు జారీచేసింది. మూడువారాల్లో నివేదిక సమర్పించాలని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

రేపటి నుంచి కాళేశ్వరం విచారణపై దృష్టి

ఈ నెల 16 దాకా హైదరాబాద్‌లోనే జస్టిస్ ఘోష్

హైదరాబాద్, మహదేవపూర్ రూరల్ జూన్ 8(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణ ప్రక్రియ సోమవారం నుంచి ఊపందుకోనుంది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ విచారణ జరుపుతున్న సంగతి విదితమే. ఈ నెల 10 నుంచి వరుసగా ఆరు రోజుల పాటు బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో ఉన్న కమిషన్ కార్యాలయంలో అధికారులతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమావేశం కానున్నారు. శనివారం సుందిళ్ల బ్యారేజీని సందర్శించిన ఆయన.. అక్కడ మరమ్మతు పనులను పరిశీలించారు. వాటిపై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇక విచారణలో భాగంగా ఎవరెవరికి నోటీసులు ఇవ్వాలనే దానిపై జస్టిస్ ఘోష్ నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, నిర్మాణ, నిర్వహణ లోపాలపై కమిషన్‌కు 54 దాకా ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులతోపాటు ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన మధ్యంతర నివేదిక, కాగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమర్పించిన నివేదికల ఆధారంగా ఈ ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో నిర్ణయాత్మక పాత్ర పోషించిన అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇవ్వనున్నారు. తొలుత నోటీసులు జారీ చేసి, స్పందించని పక్షంలో సమన్లపై కమిషన్ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. వాస్తవానికి కాళేశ్వరంపై నివేదిక అందించడానికి ఈ నెల 30వరకే ప్రభుత్వం గడువు ఇచ్చింది. అయితే ఇప్పట్లో విచారణ పూర్తయ్యే అవకాశాలు లేకపోవడంతో మరో మూడు నెలలు నివేదిక అందించడానికి గడువు ఇచ్చే అవకాశాలున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జనం నేర్పిన గుణపాఠం

"ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. అవ్వా తాతల ఆప్యాయత, అక్కచెల్లెమ్మల అనురాగం ఏమైపోయింది? ఆధారాలు లేవు కనుక ఏదో జరిగిందని చెప్పడం లేదు".. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత జగన్మోహన్ రెడ్డి వ్యక్తం చేసిన ఆవేదన ఇది. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత "మాకు కేవలం 23 సీట్లు వచ్చాయంటే మేం ప్రజలను అంతగా బాధ పెట్టామా?" అని అప్పుడు ఓడిపోయిన చంద్రబాబు నాయుడు ఆత్మపరిశీలన చేసుకునే ప్రయత్నం చేయగా, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి మాత్రం పరనిందకు పాల్పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తాను ఏమి చేశానో? ఏ లక్ష్యంతో పనిచేశానో? ఆత్మపరిశీలన చేసుకుంటే తనకు 11 అసెంబ్లీ సీట్లు మాత్రమే రావడానికి గల కారణాలు జగన్‌కు ఇట్టే తెలిసిపోతాయి. ప్రజలు తనను మోసం చేశారనే భావన ఆయన మాటల్లో ధ్వనించింది. ఈ దేశంలో ప్రజలెవ్వరూ రాజకీయ నాయకులను మోసం చెయ్యలేరు. నాయకులే అధికార పీఠాలు ఎక్కాక ప్రజలను వంచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ తీర్పు ద్వారా యావత్ దేశానికే అద్భుత సందేశాన్ని ఇచ్చారు. పాలకుడు ఎలా ఉండకూడదో తేల్చి చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ఎంచుకున్న మోడల్ భావి తరాల ప్రయోజనాలకు ఎంత ప్రమాదకరమైనదో తమ తీర్పు ద్వారా ప్రజలు స్పష్టం చేశారు. పాలకుడిగా తమ బాధ్యతను విస్మరించి సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పంచిపెడుతూ తమ అధికారానికి తిరుగు ఉండదని భావించే వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టారు. 2019 ఎన్నికలకు ముందు అమాయకంగా ముఖం పెట్టి అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ తర్వాత తమను మోసం చేశారని ఆయన చర్యల ద్వారా ప్రజలు గ్రహించారు. వంచనతో కూడిన రాజకీయాలు చేసే వారికి ఏ దుస్థితి ఎదురవుతుందో స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అనేవాడు బటన్లు నొక్కడానికే పరిమితం కాకూడదని, రాష్ట్ర భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలన్న సందేశాన్ని ప్రజలు బలంగా పంపారు. కేవలం సంక్షేమం లేదా అభివృద్ధిని మాత్రమే నమ్ముకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయని గతంలో చంద్రబాబు, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి విషయంలో రుజువైంది. ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఫీల్‌గుడ్ భావన ఉన్నప్పుడే ఎవరైనా మళ్లీ మళ్లీ అధికారంలోకి వస్తారు. ఆ విషయం విస్మరించి సోషల్ మీడియా సైన్యాలను ఏర్పాటు చేసుకొనో, ప్రధాన మీడియాను దొడ్లో కట్టేసుకొనో పబ్బం గడుపుకోవాలంటే కుదరదని ప్రధాని నరేంద్ర మోదీ దగ్గర నుంచి తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ విషయంలో ప్రజలు రుజువు చేశారు. ఆత్మస్తుతి, పరనింద వల్ల ప్రయోజనం ఉండదు. ఐదేళ్లలో రెండు లక్షల 70 వేల కోట్ల రూపాయలు పంచిపెట్టినా తనకు ప్రజలు ఎందుకు ఓట్లు వేయలేదో అని జగన్ తెగ ఆశ్చర్యపోతున్నారు. సొంత సొమ్ము ఖర్చు చేసినవారు ఆవేదన చెందారంటే అర్థం చేసుకోవచ్చు. అప్పులు చేసి సంక్షేమం పేరిట పంచిపెట్టడం అనర్థమని గ్రహించకపోతే ఎలా? ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 'ప్రజా వేదిక'ను కూల్చడం ద్వారా తన మనస్తత్వం ఏమిటో జగన్‌రెడ్డి చాటి చెప్పారు. అప్పుడే అతని పతనం ప్రారంభమైంది. విద్వేషాల వల్ల తాత్కాలిక ప్రయోజనం కలగవచ్చునుగానీ అంతిమంగా నష్టమే జరుగుతుందని ఆయన తెలుసుకోలేదు.

ఏది మంచి... ఏది చెడు?

జగన్ మాత్రమే కాదు– ఆయనను సమర్థించే వాళ్లు కూడా ప్రజల తీర్పు పరమార్థాన్ని గ్రహించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. 'పేదలందరికీ జగన్ మంచి చేసినా ఓడిపోవడం ఏమిటి? ఏదో జరిగింది!' అంటూ గుండెలు బాదుకోవడం రోతగానూ ఉంటోంది. అప్పులు చేసి పంచిపెట్టడం, అదే సమయంలో రాజకీయ ప్రత్యర్థులను, ప్రశ్నించే వారిని వేధించడం, పోలీసులతో దమన నీతికి పాల్పడటం ఎంత మాత్రం సమర్థనీయం కాదని గ్రహించి ఉంటే ఎన్నికల ఫలితాలు ఇంత దారుణంగా వచ్చి ఉండేవి కావు. జగన్‌కు వ్యతిరేకంగా ప్రజలు కసిగా ఓట్లు వేశారు. స్వార్థ ప్రయోజనాలకోసం చిడతలు కొట్టిన వారిని మినహాయిస్తే ఏ ఒక్క వర్గం ప్రజలు కూడా ఆయన పాలన గొప్పగా ఉందని కీర్తించలేదు. అందుకే అత్తెసరు మెజారిటీలతో 11 సీట్లే దక్కించుకోగలిగారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కుల మతాల రొచ్చులో కూరుకుపోయారన్న భావన నిన్నటిదాకా ఉండేది. తాజా తీర్పుతో వారు తమ విజ్ఞతను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో ఈవీఎంల బటన్లు నొక్కి మరీ చెప్పారు. బటన్లు నొక్కడం మినహా జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి ఇదీ అని చెప్పలేని పరిస్థితి. ప్రజలను కులాల వారీగా విడదీయాలని అనుకున్నారు. ఈ పన్నాగం ఫలించలేదు. పేదలకూ పెత్తందార్లకూ మధ్య పోరాటమంటూ రెచ్చగొట్టిన ప్రయత్నాలు కూడా వికటించాయి. జగన్‌కు వ్యతిరేకంగా మొత్తం 61 శాతం ఓట్లు పడ్డాయి. అంటే, రాష్ట్రంలో పేదలకంటే పెత్తందార్లే ఎక్కువగా ఉన్నారా? జగన్ నమ్ముకున్న పేదలు, కులాలు, మతాలకు చెందిన వారిలో కూడా కొందరు ఆయనకు ఓట్లు వేయలేదు. 2019లో ప్రజలు తన నుంచి ఏమి ఆశించి 151 సీట్లతో ఆశీర్వదించారో జగన్ తెలుసుకోలేదు. చరిత్ర సృష్టించాలన్నా, తిరగ రాయాలన్నా మేమే అని వైసీపీ నేతలు సినిమా డైలాగులు కొట్టారు. వాళ్లు ఏ ఉద్దేశంతో అన్నారో కానీ జగన్ మాత్రం చరిత్రను తిరగరాశారు. 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన పార్టీ ఐదేళ్ల దిక్కుమాలిన పాలనతో 140 సీట్లు కోల్పోవచ్చునని జగన్ అండ్ కో నిరూపించారు. ఇది కూడా చరిత్రే కదా!


అహంకారానికి గుణపాఠం...

సోషల్ ఇంజనీరింగ్ సాధారణ ఎన్నికల్లో పనిచేయదని మరోమారు రుజువైంది. అధికారం ఉందని ఉచ్చనీచాలు మరచి ప్రవర్తించిన వారినందరినీ ప్రజలు రాజకీయంగా మట్టుబెట్టారు. ప్రకృతి చాలా గొప్పది. అహంకారంతో విర్రవీగే వారినెవరినీ అది ఉపేక్షించదు. తాను ఒక ముఖ్యమంత్రిననీ, రాజ ధర్మాన్ని పాటించాలనే స్పృహను జగన్‌రెడ్డి కోల్పోయారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని నిండు సభలో మంత్రులూ, శాసనసభ్యులూ అవమానిస్తున్నప్పుడు జగన్ మహదానందం పొందారు. ఆమె ఉసురు ఊరికే పోతుందా? ధర్మపత్నిని అవమానించినప్పుడు చంద్రబాబు నిస్సహాయంగా విలపించారు. శాసనసభను కౌరవ సభగా మార్చి తనను తీవ్రంగా అవమానించిన సభలోకి మళ్లీ ముఖ్యమంత్రిగానే అడుగు పెడతానని చంద్రబాబు చేసిన శపథంలోని ధర్మాగ్రహాన్ని ప్రజలు అర్థం చేసుకొని ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేశారు. జగన్ అండ్ కో ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అయితే వారిలో ఆ లక్షణం కనిపించడం లేదు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి తీర్పును తారుమారు చేశారని ప్రచారం చేస్తూ ఆత్మవంచన, పరనిందను కొనసాగిస్తున్నారు. అహంకారం తలకెక్కి వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తూ, లెక్కలేనితనంతో బరితెగిస్తూ, ప్రతిపక్షాన్ని అణచివేస్తూ, చట్టాలను కాపాడాల్సిన వ్యవస్థలనే ఆత్మరక్షణలో పడేస్తూ, న్యాయ వ్యవస్థనూ ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తూ, ప్రశ్నించిన వాళ్లను అవహేళనకు గురిచేశారు. రాజధానికి భూములిచ్చిన రైతులను కుల పరంగా దూషిస్తూ, విమర్శించిన వారిపై బూతులతో దాడులు చేస్తూ... పోలీసులతో వేధించారు. ప్రభుత్వ వ్యవస్థలను చెరపట్టి, అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేసి, యువతకు ఉపాధి కల్పనను గాలికొదిలేసి, రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా బోర విరుచుకొని తిరిగినందునే జన సునామీ ఏర్పడి జగన్ అండ్ కోను ఊడ్చి పారేసింది. గత ఐదేళ్లలో న్యాయ పాలన లేకుండా చేసి మొత్తం రాష్ట్రాన్ని ఉక్కపోతకు గురి చేశారు. ప్రభుత్వ అరాచకాలను, వైఫల్యాలను ఎత్తి చూపిన వారిని ఎల్లో గ్యాంగ్ అని నిందిస్తూ ఆనందం పొందారు. 'మా ఓటర్లు వేరు– ఎంత మంది వచ్చినా మా వెంట్రుక కూడా పీకలేరు' అని విర్రవీగారు. చిర్రెత్తుకొచ్చిన ప్రజలు జగన్ నెత్తి మీద పదకొండు వెంట్రుకలనే ఉంచి మిగతావి పీకిపారేశారు.

చరిత్ర తిరగరాసి...

2019 ఎన్నికల్లో తాము మోసపోయామని గ్రహించిన ప్రజలు 2024లో తమ తీర్పును తిరగ రాశారు. చుట్టూ ఉన్మాద మూకను పోగేసుకొని తనకు తాను అపర దాన కర్ణుడిగా బిరుదు తగిలించుకొని ఊరేగినంత మాత్రాన వాస్తవ పరిస్థితులను జనం తెలుసుకోలేరని అనుకోవడం జగన్ అజ్ఞానానికి నిదర్శనం. ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత ప్రమాదకర ఆటకు జగన్‌రెడ్డి తెరలేపారు. సంక్షేమం మాటున ప్రజలకు డబ్బు పంచి, ఆ మాటున దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడినా అధికారానికి ఢోకా ఉండదని భావించారు. అందుకే 2019లో అధికారంలోకి రావడానికి ముందు కూడా... ఒక్కసారి అధికారంలోకి వస్తే 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకొనేవారు. జగన్ అనుసరించిన ఈ మోడల్ ఎంత ప్రమాదకరమైనదో ప్రజలు ఐదేళ్లకే గుర్తించారు. అందుకే అవ్వా తాతలు, అక్క చెల్లెమ్మలు అని జగన్ దీర్ఘాలు తీసినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రజలెవ్వరూ ఆయనను మోసం చేయలేదు. ఆయనే గోముఖ వ్యాఘ్రంలా మారిపోయి విశ్వాస ఘాతకుడిగా వ్యవహరించారు. సొంత చెల్లిని, తల్లిని కూడా బయటకు గెంటారు. సొంత బాబాయిని చంపిన వారికి కొమ్ము కాస్తూ వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీత ఉసురు పోసుకున్నారు. తన భార్యను మాత్రం భారతమ్మా అని పిలిపించుకొనే జగన్‌రెడ్డి... సొంత చెల్లి షర్మిల పైకి తన ఉన్మాద మూకను ఉసిగొల్పారు. వీటన్నింటినీ ప్రజలు గ్రహించారు. జగన్ నిజ స్వరూపాన్ని తెలుసుకున్నారు. సంక్షేమం మాటున జరుగుతున్న అరాచకాన్ని గుర్తించారు. ఫలితమే ఈ చరిత్రాత్మక తీర్పు. చరిత్ర మరువలేని తీర్పు ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఎవరైనా అభినందించాల్సిందే. ఈ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రతీ రాష్ట్రంలోనూ ఒక జగన్ తయారయ్యేవారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తూ అంతిమంగా దేశాన్ని దివాలా తీయించేవారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లోని అరాచకత్వం మన దేశంలో కూడా ఏర్పడేది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ తీర్పు ద్వారా ఆ పెను ముప్పు నుంచి రాష్ట్రాన్ని మాత్రమే కాదు– దేశాన్ని కూడా కాపాడారు. పాలకులు ఎలా ఉండాలో కూడా ప్రజలు పరోక్షంగా చెప్పారు. నిర్బంధాలు, అణచివేత, ఉన్మాదుల స్వైరవిహారం, రోత మీడియా, కూలి మీడియా– ఇలా ఎంత మంది జతకట్టినా తమ మెదళ్లను కలుషితం చేయలేరని, లొంగదీసుకోలేరని ప్రజలు రుజువు చేశారు. మొత్తంగా జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలన చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతుంది. ఎలాంటి వారు ముఖ్యమంత్రి అవకూడదో ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్పష్టం చేశారు.

> నిర్బంధాలు, అణచివేత, ఉన్మాదుల స్వైరవిహారం, రోత మీడియా, కూలి మీడియా– ఇలా ఎంత మంది జతకట్టినా తమ మెదళ్లను కలుషితం చేయలేరని, లొంగ దీసుకోలేరని ప్రజలు రుజువు చేశారు. మొత్తంగా జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలన చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతుంది. ఎలాంటి వారు ముఖ్యమంత్రి అవకూడదో ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్పష్టం చేశారు.



దక్కని విపక్ష హోదా..

వైసీపీకి ఇప్పుడు 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నందున జగన్మోహన్ రెడ్డికి అధికారికంగా ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా దక్కదు. 2019లో వైసీపీకి ఇదే ప్రజలు 151 సీట్లు ఇచ్చారు. ఇప్పుడు అదే ప్రజలు తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమికి 164 సీట్లు ఇచ్చారు. దేశ చరిత్రలోనే ఇంత భారీ మెజారిటీ ఎవరికీ దక్కలేదు. 2019 తర్వాత తెలుగుదేశం పార్టీకి 23 మంది శాసనసభ్యులే ఉండటం, అందులో కూడా నలుగురు జగన్ పార్టీలోకి దూకడం చూశాం. ఆనాడు చంద్రబాబుకు అధికారికంగా ప్రతిపక్ష నాయకుడి హోదా లేకుండా చేయాలని జగన్‌రెడ్డి ప్రయత్నించి విఫలమయ్యారు. ఇదంతా గతం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం నామమాత్రంగానే ఉంది. ఆనాడు తెలుగుదేశం పార్టీకి సంఖ్యా బలం తక్కువగా ఉండటంతో అధికార వైసీపీ నేతలు అహంకారంతో విర్రవీగారు. ఇప్పుడు ప్రతిపక్షమే లేకుండా పోయిందని కూటమి నేతలుగానీ, శాసన సభ్యులు గానీ, కాబోయే మంత్రులుగానీ విర్రవీగితే ఐదేళ్ల తర్వాత కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారని గుర్తుంచుకోవాలి. మెజారిటీ ఎంత ఉందన్నది కాదు– రాజ ధర్మాన్ని పాటిస్తూ రాజ్యాంగబద్ధ పాలన అందించాల్సిన బాధ్యత కూటమి నాయకులు, ముఖ్యంగా కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉంది. జగన్మోహన్ రెడ్డి డబ్బు పంచినా ప్రజలు ఎందుకు ఈసడించుకున్నారో అహరహం గుర్తుంచుకోవాలి. ప్రతిపక్షం బలహీనంగా ఉన్నందున తమకు అడ్డమే ఉండదని అనుకోవద్దు. బాధ్యత గల మీడియాగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు ప్రభుత్వ పోకడలపై కన్నేసి ఉంచుతాయి. జగన్ ప్రభుత్వ దుశ్చర్యలకు వ్యతిరేకంగా కష్టనష్టాలకు ఓర్చి అలుపెరుగని పోరాటం చేసినట్టుగానే... కూటమి ప్రభుత్వంపై అక్షరాయుధాలు ఎక్కుపెట్టడానికి మేం వెనుకాడబోము.

చంద్రబాబు జీవితమే ఒక పాఠం..

రాజకీయాలలో అన్ని రోజులూ ఒకేలా ఉండవు. ఇందుకు చంద్రబాబు రాజకీయ జీవితమే ప్రత్యక్ష ఉదాహరణ. యువతరం, రాజకీయ నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. జయాపజయాలకు పొంగి, కుంగి పోకూడదు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. మరెన్నో అవమానాలను అనుభవించారు. అవమానాలు ఎదురైనప్పుడు తాను జాతీయ రాజకీయాలను శాసించిన రోజులను తలచుకుంటూ కుంగిపోలేదు. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోగానీ, విభజిత ఆంధ్రప్రదేశ్‌లోగానీ పదిహేనేళ్ల పాటు ప్రతిపక్ష నేతగా ఉన్న చరిత్ర ఆయనది. ముఖ్యమంత్రిగా పద్నాలుగు సంవత్సరాలు పనిచేసిన ఆయన ఖాతాలోకి మరో ఐదు సంవత్సరాలు చేరబోతున్నాయి. ఇది మరో చరిత్ర కాబోతున్నది. తెలుగు జాతి ఉన్నంత వరకు ఆయన చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. చంద్రబాబును అవకాశం దొరికినప్పుడల్లా అవమానించిన కేసీఆర్, జగన్మోహన్ రెడ్డిల పరిస్థితి ఏమిటి? 2018లో రెండోసారి గెలిచిన కేసీఆర్ 2019లో చంద్రబాబు ఓడిపోయినప్పుడు ఆయనకు రిటన్ గిఫ్ట్ ఇచ్చానని వికటాట్టహాసం చేశారు. 2023 ఎన్నికల్లో చంద్రబాబు ఏ రూపంలో రిటన్ గిఫ్ట్ ఇచ్చారో తెలియదుగానీ కేసీఆర్ ఓడిపోయి పార్టీని కూడా కాపాడుకోలేని దుస్థితిలో ఉన్నారు. తాను జైలు జీవితం గడపడానికి చంద్రబాబు కారణమని భావిస్తూ వచ్చిన జగన్‌రెడ్డి ప్రతీకారంతో రగిలిపోయారు. తాడూ బొంగరం లేని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును జైలుకు పంపి అహం చల్లార్చుకున్నారు. ఆ కేసులో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని బెదిరించి చంద్రబాబుకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్పించారు. ఆ అధికారిని తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకొని "గతంలో తనను జైలుకు పంపించిన చంద్రబాబును ఇప్పుడు జైలుకు పంపాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారికి ఉండదా? ముఖ్యమంత్రిని సంతోష పెట్టడానికైనా మీరు చంద్రబాబుకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వాల్సిందే' అని ధనుంజయ్ రెడ్డి బెదిరించారు. తన రాజకీయ జీవితం మచ్చలేకుండా ముగియాలని చంద్రబాబు భావించేవారు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్టుగా ఆయన జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అంతమాత్రాన ఆయన కుంగిపోలేదు. రెట్టించిన ఉత్సాహంతో మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం చేసి మరీ అధికారంలోకి వచ్చారు. తెలుగుదేశం పార్టీకి ఇకపై భవిష్యత్తు ఉంటుందా? అన్న అనుమానాన్ని అనేక సందర్భాలలో ఎంతోమంది వ్యక్తం చేశారు. జాతీయ మీడియా ఆయనను కీలక సమయాల్లో పట్టించుకోలేదు. 2019కి ముందు ప్రధాని నరేంద్ర మోదీతో విభేదించిన చంద్రబాబు ఆయనకు దూరమయ్యారు. ఆ సందర్భంగా చంద్రబాబుపై ప్రధాని కోపంగా ఉన్నారని ప్రచారం జరిగింది. వాజపేయి ప్రధానిగా ఉన్న రోజుల్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీని అప్పటి ఎన్డీయే కన్వీనర్ చంద్రబాబు పట్టించుకోలేదు. అది మనసులో పెట్టుకున్నారో లేదో తెలియదు గానీ గత ఐదేళ్లుగా చంద్రబాబుతో అంటీముట్టనట్టుగానే ప్రధాని మోదీ వ్యవహరించారు. అయినా చంద్రబాబు కుంగిపోలేదు. తాజా ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కుదరడం, రాష్ట్రంలో ప్రజలు అసాధారణ తీర్పు ఇవ్వడంతో పాటు కేంద్రంలో బీజేపీకి సొంతంగా మెజారిటీ లభించకపోవడంతో చంద్రబాబుకు మళ్లీ ప్రాధాన్యం పెరిగింది. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబుకు రాజకీయంగా గొప్ప గౌరవ మర్యాదలు లభించాయి. జాతీయ మీడియా ఆయన కోసం పరుగులు పెట్టింది. అంతమాత్రాన ఆయన పొంగిపోవడం లేదు. 2019లో ఓడిపోయాక దాదాపు రెండేళ్లపాటు చంద్రబాబును పలకరించేవారే కరువయ్యారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వేరెవరూ ఆ పరిస్థితిని తట్టుకోలేరు. కానీ చంద్రబాబుకు సహనం ఎక్కువ. మంచి రోజుల కోసం ఓపికగా ఎదురుచూశారు. ఆ మంచి రోజులు ఇప్పుడు వచ్చాయి. చంద్రబాబు విజయ గర్వంతో విర్రవీగకపోవచ్చునుగానీ తాజాగా గెలిచిన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఎలా ప్రవర్తిస్తారో చూడాలి. కేంద్రంలో చంద్రబాబుకు పెరిగిన పలుకుబడి రాష్ట్రానికి మంచి చేస్తుందని ఆశిద్దాం! జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పులపాలై అభివృద్ధిలో అధోగతికి చేరుకుంది. ఇప్పుడు రాష్ట్రాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది. ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా జగన్ వ్యతిరేకతే పనిచేసింది. జగన్ వ్యతిరేక, జగన్ అనుకూలురుగా ప్రజలు విడిపోయారు. ఒక ముఖ్యమంత్రి పట్ల వ్యక్తిగతంగా ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఎందుకు ఏర్పడిందో కూటమి నేతలు గుర్తెరగాలి. జాతీయ రాజకీయాల్లో తిరుగులేని నేతగా, ప్రపంచ నాయకుడిగా కీర్తించబడిన ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ప్రజలు తమ తీర్పు ద్వారా హెచ్చరికలు పంపారు. ఏ పాలకుడైనా కట్టు తప్పినప్పుడు ప్రజల ధర్మాగ్రహానికి గురికావాల్సిందే. ఇందుకు ఎవరూ మినహాయింపు కాదు. 'నేను' అన్న అహం ఎవరికి తలకెక్కినా ప్రకృతి రూపంలో పతనం కాచుకొనే ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ఈ సత్యాన్ని గుర్తించి ధర్మబద్ధమైన పాలన అందిస్తారని ఆశిద్దాం! మెజారిటీ ఎంత వచ్చిందన్నది ముఖ్యం కాదు– అధికారం ఐదేళ్లు మాత్రమేనని అప్రమత్తంగా ఉండాలి. లేనిపక్షంలో ప్రజల చేతిలో ఓటు అనే ఆయుధం వేటు వేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

ఈ కాలమ్ రాయడానికి ఉపక్రమించినప్పుడే రామోజీరావు ఇక లేరన్న వార్త వెలువడింది. తెలుగు జర్నలిజంలో చరిత్ర సృష్టించిన ఆయన మరణం పత్రికా రంగానికే కాదు, సమాజానికి కూడా లోటు. అధికార హూంకరింపులకు వెరవకుండా రామోజీరావు అక్షర యుద్ధం సాగించారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, 'ఆంధ్రజ్యోతి' సంస్థల తరఫున ఆయనకు అక్షర నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను!

> రాజకీయాలలో అన్ని రోజులూ ఒకేలా ఉండవు. ఇందుకు చంద్రబాబు రాజకీయ జీవితమే ప్రత్యక్ష ఉదాహరణ. యువతరం, రాజకీయ నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. జయాపజయాలకు పొంగి, కుంగి పోకూడదు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. మరెన్నో అవమానాలను అనుభవించారు. అవమానాలు ఎదురైనప్పుడు తాను జాతీయ రాజకీయాలను శాసించిన రోజులను తలచుకుంటూ కుంగిపోలేదు. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోగానీ, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో గానీ పదిహేనేళ్ల పాటు ప్రతిపక్ష నేతగా ఉన్న చరిత్ర ఆయనది. ముఖ్యమంత్రిగా పద్నాలుగు సంవత్సరాలు పనిచేసిన ఆయన ఖాతాలోకి మరో ఐదు సంవత్సరాలు చేరబోతున్నాయి. ఇది మరో చరిత్ర కాబోతున్నది. తెలుగు జాతి ఉన్నంత వరకు ఆయన చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. చంద్రబాబును అవకాశం దొరికినప్పుడల్లా అవమానించిన కేసీఆర్, జగన్మోహన్ రెడ్డిల పరిస్థితి ఏమిటి?

> 2019లో ఓడిపోయాక దాదాపు రెండేళ్లపాటు చంద్రబాబును పలకరించేవారే కరువయ్యారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వేరెవరూ ఆ పరిస్థితిని తట్టుకోలేరు. కానీ చంద్రబాబుకు సహనం ఎక్కువ. మంచి రోజుల కోసం ఓపికగా ఎదురుచూశారు. ఆ మంచి రోజులు ఇప్పుడు వచ్చాయి. చంద్రబాబు విజయ గర్వంతో విర్రవీగకపోవచ్చును గానీ తాజాగా గెలిచిన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఎలా ప్రవర్తిస్తారో చూడాలి. కేంద్రంలో చంద్రబాబుకు పెరిగిన పలుకుబడి రాష్ట్రానికి మంచి చేస్తుందని ఆశిద్దాం! జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పులపాలై అభివృద్ధిలో అధోగతికి చేరుకుంది. ఇప్పుడు రాష్ట్రాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది. ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా జగన్ వ్యతిరేకతే పనిచేసింది. జగన్ వ్యతిరేక, జగన్ అనుకూలురుగా ప్రజలు విడిపోయారు. ఒక ముఖ్యమంత్రి పట్ల వ్యక్తిగతంగా ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఎందుకు ఏర్పడిందో కూటమి నేతలు గుర్తెరగాలి. మెజారిటీ ఎంత వచ్చిందన్నది ముఖ్యం కాదు– అధికారం ఐదేళ్లు మాత్రమేనని అప్రమత్తంగా ఉండాలి.

> అధికారం ఉందని ఉచ్చనీచాలు మరచి ప్రవర్తించిన వారినందరినీ ప్రజలు రాజకీయంగా మట్టుబెట్టారు. ప్రకృతి చాలా గొప్పది. అహంకారంతో విర్రవీగే వారినెవరినీ అది ఉపేక్షించదు. తాను ఒక ముఖ్యమంత్రిననీ, రాజ ధర్మాన్ని పాటించాలనే స్పృహను జగన్ రెడ్డి కోల్పోయారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని నిండు సభలో మంత్రులూ, శాసనసభ్యులూ అవమానిస్తున్నప్పుడు జగన్ మహదానందం పొందారు. ఆమె ఉసురు ఊరికే పోతుందా? ధర్మపత్నిని అవమానించినప్పుడు చంద్రబాబు నిస్సహాయంగా విలపించారు. శాసనసభను కౌరవ సభగా మార్చి తనను తీవ్రంగా అవమానించిన సభలోకి మళ్లీ ముఖ్యమంత్రిగానే అడుగు పెడతానని చంద్రబాబు చేసిన శపథంలోని ధర్మాగ్రహాన్ని ప్రజలు అర్థం చేసుకొని ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేశారు. జగన్ అండ్ కో ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అయితే వారిలో ఆ లక్షణం కనిపించడం లేదు.

'ఆగచ్ఛంతు! కాఫీం పిబామః'

(రండి! కాఫీ సేవిద్దాం)

'కాఫీకి కులమూ వర్గమూ ఉంటాయా?' అని రాహుల్ కుమార్ వేసిన ప్రశ్న బాగుంది (మే 28, ఆంధ్రజ్యోతి). శ్రీనాథాదులు ప్రస్తావించిన వంటకాల్ని 'ఇవి బ్రాహ్మణ వంటకాలుగా ఉన్నవి' అని ఒక విమర్శకుడన్నాడు. వంటకాలకూ కులాలు అంటగట్టే పాడు రోజులివి. కమ్మగా వండితే తినందెవరు? బ్రాహ్మణేతరులు 'టీ'ని, బ్రాహ్మణులు 'కాఫీ'ని ఎక్కువగా ఇష్టపడతారు. బ్రాహ్మణుల ఇళ్లలో ఒకప్పుడు మడికాఫీ, మైలకాఫీ ఉండేవి. ఆహార అలవాట్లనేవి కుల వర్గాలకు చెందినవి కాదు, కుటుంబాలకు చెందినవి! ఒక్కో కుటుంబంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో అలవాటు, ఒక్కో ఆచారం ఉంటాయి.

దక్షిణాదిలోనే కాఫీ సేవన ఎక్కువ. తమిళులు కాఫీ పైన 'కాఫీరైటు'ని హక్కు భుక్తం చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో APFDCకి 2003 నుంచి 2015 వరకూ 11సార్లు కాఫీ ఉత్పత్తి, వినియోగాల్లో 'ఫ్లేవర్ ఆఫ్ ఇండియా' జాతీయ అవార్డు దక్కింది. కాఫీ సేవనలో తెలుగు వాళ్లే మిన్న! తెలుగు కథల్లో కథానాయిక కాఫీ కప్పుతోనే వస్తుందిగానీ టీ తెచ్చి ఇవ్వడం అరుదు. 'టీ' కన్నా 'కాఫీ'కి స్టేటస్ ఎక్కువని కొందరి అభిప్రాయం. ఖరీదూ ఎక్కువే కదా!

'శ్రీమన్మహాదేవి లోకేశ్వరీ! కాళికాసన్నిభాకారిణీ! లోకసంచారిణీ! అంబ! కాఫీ జగన్మోహినీ!' అంటూ, 1919లో పోకూరు కాశీపతి కాఫీ దండకం రాశాడు. 'కాంత లేకున్న మానె, నే కాలమందు కాఫీ యుండిన జాలు, దుఃఖంబు లేదు' అనీ, 'మధురాన్నములు మాని మహనీయు లందఱు, దోసె లుప్మాలకు దాసులైరి/ శత వర్షజీవులు శల్యగతప్రాణు లకట! కాఫీ గత ప్రాణులైరి' అంటూ కాఫీ దాస్యాన్ని ఉమర్‌అలీషా కవి ఎత్తిపొడిచారు. కాఫీ, కత్తెర మార్కు (సిజర్సు) సిగరెట్లు కారాకిళ్లీలను సమబుద్ధితో సేవించే జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిని 'చుఱుకీకృత కాఫీ టీ/ జలనిధి! ఖిల్లీ సహస్రచర్వణచణ ని/ ర్మల ధూమోజ్జ్వల పరివే/ ష రస స్ఫూర్తీ! సిజర్సు సారంగమణీ' అన్నారు కాటూరి వెంకటేశ్వరరావు తన చుట్టతాను తాగుతూ!

కాంగ్రెస్‌తోనే కాఫీ వ్యాప్తికి వచ్చింది! జాతీయోద్యమం తొలి నాళ్లలో ఛాందసవాద వ్యతిరేక బ్రహ్మసమాజవాదుల ప్రాబల్యం కారణంగా కాఫీ లేదా టీలకు కాంగ్రెస్ సభల్లో గిరాకీ ఉండేది. 1907లో బిపిన్ చంద్రపాల్ మచిలీపట్టణం వచ్చి మహోపన్యాసం చేశారు. ముట్నూరి కృష్ణారావు ఆయన గౌరవార్థం ఇచ్చిన విందులో చక్రపొంగలి, గారెలు, ఆవడలు వడ్డించారు. చివరగా కాఫీలు తాగారంతా! తర్వాత బ్రాహ్మణ సంఘం ఆ విందుకెళ్ళిన బ్రాహ్మణులకు శ్రీముఖం పంపింది. బిపిన్ చంద్రపాల్ మతం మారిన క్రైస్తవుడని అపోహ పడి ఆయనతో కలిసి గారెలు ఆవడలు తిని కాఫీ వంటి మాదకద్రవ్యం సేవించినందుకు కులవెలి విధిస్తామన్నారు. నోబుల్ కాలేజీలో పని చేసే నరసింహశాస్త్రి 'తైలపక్వ భక్ష్యాలు అంటే, నూనెలో వేసి వండిన భక్ష్యాల్ని శూద్రుడు వండినా బ్రాహ్మణుడు తినవచ్చు' అని యాజ్ఞవల్క్య స్మృతిలోంచి ఒక శ్లోకం చదవటంతో ఆ కేసు వీగిపోయింది. సాంప్రదాయ వాద కాఢలిక్కులు కూడా 'ఈ తురక (టర్కీ) పానీయం త్రాగడమేంటి?' అన్నవాళ్లే! చివరికి అందరి మనసుల్నీ జయించింది కాఫీ.

యురోపియన్లు కెటిల్ నిండా కాచుకుని కాఫీ చేదు కషాయాన్ని తాగుతారు. పాలు కలిపితే దోషాలు తగ్గుతాయని ఆయుర్వేద వైద్యుల సూచన వలన మనం పాలు, తీపి కలిపిన కాఫీ, టీలు తాగుతున్నాం.

> అరబిక్ పదం 'కహ్వా' అంటే, 'అమృతం గింజలు' అని అర్థం. అదే కాఫీ అయ్యింది. 16వ శతాబ్దికి టర్కీ, పర్షియా, ఆఫ్రికాలకు కాఫీ చేరింది. మనకొచ్చేసరికి, డచ్చి వాళ్లిచ్చిన కాఫీ గింజలు చిక్‌మగుళూరులో మొదట మొలకెత్తాయి. కన్నడ, కొడగు, తెలుగు ప్రాంతాల్లో కాఫీ తోటలేర్పడ్డాయి. కాఫీ అమృతం కాదు. అలాగని అంటరాని విషమూ కాదు. జీవన వ్యవస్థలో కాఫీ ఒక భాగం. కాఫీలోని కెఫీన్ ఒక సైకోయాక్టివ్ రసాయనం. మనసుని ఉత్తేజపరుస్తుంది. అందుకే ప్రపంచంలో చాలా మందికి కాఫీ ఒక ఉదయరాగం! అది మితిమీరితే హృదయగాయం!

ఇథియోపియాలో ఒక సూఫీయోగి క్రీ.శ. 13–14 శతాబ్దాల్లో కాఫియా అనే మొక్క గింజల్ని తిని పక్షులు అనూహ్యమైన ఉత్తేజాన్ని పొందటం గమనించటంతో లోకానికి కాఫీ గురించి తెల్సింది. అరబిక్ పదం 'కహ్వా' అంటే, 'అమృతం గింజలు' అని అర్థం. అదే కాఫీ అయ్యింది. 16వ శతాబ్దికి టర్కీ, పర్షియా, ఆఫ్రికాలకు కాఫీ చేరింది. 17వ శతాబ్ది నాటికి కాఫీ తాగితే చిరంజీవులూ, గజకేసరులూ అవుతారని, ఇది అజీర్ణగజాంకుశం అనీ ప్రచారం జరగటంతో ఫ్రెంచి చక్రవర్తులు, ఫ్రెంచి ప్రజలు దీన్ని అమితంగా సేవించటం మొదలు పెట్టారు. కాఫీ నిలయాలు ఆలయాల్లా ఫ్రాన్స్ అంతా వెలిశాయి! మనకొచ్చేసరికి, డచ్చి వాళ్లిచ్చిన కాఫీ గింజలు చిక్‌మగుళూరులో మొదట మొలకెత్తాయి. కన్నడ, కొడగు, తెలుగు ప్రాంతాల్లో కాఫీ తోటలేర్పడ్డాయి.



కాఫీ గింజల కషాయంలో కేలరీలు(2.2), కార్బోహైడ్రేట్లు(0), కొవ్వు, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ చాలా స్వల్పం. నిస్సారమైన పానీయం ఇది. కాబట్టి, పాలు పంచదార లేని చేదు కాఫీ షుగరు, స్థూలకాయం, గుండె జబ్బులు, బీపీల్లో మేలే చేస్తుందని 'హార్వార్డ్ టి హెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్' వారి వివరణ. కాఫీ కషాయం ఆస్తమా, మానసిక ఆందోళనలు, పార్కిన్ సోనిజం, కేన్సర్ వ్యాధులున్న వారందరికీ మంచిదే! కాఫీ అతిగా తాగితే ఇనుము వంటబట్టక రక్తహీనత కలుగుతుంది. లివరు మీద చెడు ప్రభావం కలిగిస్తుంది.

కప్పు అచ్చుకాఫీలో 64 మి.గ్రా. కెఫీనుంటుంది. ఒకేరోజు గ్రాము కెఫీన్ అంటే 15 కప్పుల కాఫీ తాగితే అది విషమే! 10 గ్రాములు కెఫీన్ తీసుకుంటే తక్షణం మరణిస్తారు. కొన్ని నొప్పిబిళ్ళల్లో కెఫీన్ కలుస్తుంది. చూసుకోకుండా కాఫీ తాగితే కెఫీన్ మోతాదు ఎక్కువౌతుంది. ఏ ఇంగ్లీషు మందులు వేసుకున్నా వెంటనే కాఫీ తాగకండి! ఆ మందులకు కెఫీన్ విరోధం ఉండవచ్చు. ఎనర్జీ డ్రింకుల్లో కూడా కెఫీన్ కలుస్తుంది, జాగ్రత్త. బెడ్ కాఫీ తాగటం కన్నా, ఫైబరున్న కూరగాయల సలాడ్ లేదా చిరుధాన్యాల పారిజ్ (అంబలి) తీసుకుని కాఫీ తాగితే కెఫీన్ వ్యాపనం ఆలస్యం అవుతుంది. కాఫీనీ, సిగరెట్టునీ ఒకేసారి తాగకండి! కెఫీన్ శరీరంలో రెట్టింపు వేగంతో వ్యాపిస్తుంది.

కెఫీన్ శాతం తగ్గించటానికి జర్మన్లు 60శాతం చికోరీ, 40శాతం కాఫీ కలిపిన మిశ్రమాన్ని మిష్కాఫీ అనీ, ఫ్రెంచివాళ్లు 'రికోరీ' అనీ అమ్మటం మొదలుపెట్టారు. ఆ మేరకు కెఫీన్ కూడా 60శాతం తగ్గినట్టే కదా! చికోరీ ఓ పరిమళద్రవ్యం. ప్రమాదకరమైంది కాదు. బీరులోనూ కలుపుతున్నారిప్పుడు. 1861 అమెరికన్ అంతర్యుద్ధ కాలంలో కాఫీ కరువొస్తే, బెండగింజల్ని, చింతగింజల్ని, శనగల్ని, మొక్కజొన్న, ఈత, ఖర్జూరం గింజల్ని నల్లగా వేయించి విసిరి కాఫీ కాచుకున్నారట! ఈ గింజల్ని కాఫీతో కల్తీచేస్తే వచ్చే ప్రమాదం ఏమీ లేదు. రంగు విషాలూ, విషరసాయనాలూ, విషపరిమళాలూ కలిపి కాఫీని విషపూరితం చేస్తేనే ప్రమాదం.

కాఫీగింజల్ని మనముందే మరాడించి, మనం కోరినంత చికోరీ కలిపి ఇచ్చే షాపుల్లో కాఫీ పొడిని కొంత నమ్మొచ్చు. కాఫీ అమృతం కాదు. అలాగని అంటరాని విషమూ కాదు. జీవన వ్యవస్థలో కాఫీ ఒక భాగం. కాఫీలోని కెఫీన్ ఒక సైకోయాక్టివ్ రసాయనం. మనసుని ఉత్తేజపరుస్తుంది. అందుకే ప్రపంచంలో చాలా మందికి కాఫీ ఒక ఉదయరాగం! అది మితిమీరితే హృదయగాయం!

■ డా. జి.వి. పూర్ణచందు



● మృగశిర కార్తె ఎఫెక్ట్..

చేపలకోసం పోటెత్తారు!

అర్ధరాత్రి నుంచే కొనుగోళ్లు.. ముషీరాబాద్‌కు ఒక్కరోజే 60 టన్నుల దిగుమతి




కొనుగోలు దారులతో కిటకిటలాడిన ముషీరాబాద్ చేపల మార్కెట్ (ఇన్‌సెట్లో : భారీ చేపను ప్రదర్శిస్తున్న ఓ వ్యాపారి)

ముషీరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా శనివారం నగరంలో చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పలు బహిరంగ ప్రదేశాల్లోనూ చేపల విక్రయాలు జోరుగా సాగాయి. మృగశిర కార్తె నేపథ్యంలో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ కొనుగోలుకు వెనకాడలేదు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక 1.30 నుంచే ముషీరాబాద్ చేపల మార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. ఈ నేపథ్యంలో ముషీరాబాద్ మార్కెట్‌కు శనివారం ఒక్కరోజే 50 నుంచి 60 టన్నుల చేపలు దిగుమతి అయ్యాయని వ్యాపారులు తెలిపారు. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, కరీంనగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, భువనగిరి జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి సైతం చేపలు భారీగా దిగుమతి అయ్యాయి. మార్కెట్‌లో కొనుగోలుదారులు అధికంగా రావడం.. చేపల లోడ్‌తో వచ్చిన భారీ వాహనాలను రోడ్లపైనే నిలపడంతో పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

కొర్రమీను @600

ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో శనివారం కొర్రమీను ధరలు విపరీతంగా పెరిగాయి. కిలో రూ. 550 నుంచి 600కు విక్రయించారు. ధర ఎక్కువైనప్పటికీ అమ్మకాలు జోరుగా కొనసాగాయి. శుక్రవారం కొర్రమీను చేప ధరలు రూ.500 నుంచి 550 ఉండగా నేడు ఒకేసారి 50 రూపాయలు పెరిగింది. రవ్వ చేపలు కిలో రూ.120 నుంచి 130కి విక్రయించారు. బొచ్చ చేపలు కిలో రూ. 110 నుంచి 120కి విక్రయించారు. శుక్రవారం ధరలతో పోల్చితే కిలో 30 రూపాయల వరకు పెరిగాయి.





చేపల మందు నోట్లో వేస్తున్న బత్తిని కుటుంబసభ్యులు

తూనికలు, కొలతల శాఖ దాడులు..

చేపల మార్కెట్‌లో విక్రయాలు పెద్దఎత్తున కొనసాగడంతో శనివారం తూనికలు,కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తూకాలను పరిశీలించారు. అవకతవకలకు పాల్పడకుండా వినియోగదారులు నష్టపోకుండా అధికారులు ఉదయం నుంచి మార్కెట్‌లోనే ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు చేశారు. దీంతో విక్రయదారులు ఆందోళనకు గురయ్యారు.



తూకం తనిఖీ చేస్తున్న అధికారులు

తిండి దొరకకనే..



రెచ్చిపోతున్న శునకాలు..

- ఆహారం కోసం వీధి కుక్కల విపరీత ప్రవర్తన
- వీధుల్లో చిన్న పిల్లలపై దాడులు
- మియాపూర్‌లో జరిగిందదే..?
- అధికారుల నిర్లక్ష్యంతో ఆరేళ్ల బాలుడి మృతి
- తాజాగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రెండు ఘటనలు
- దుండిగల్‌లో రెండేళ్ల బాలుడిపై..
- నిజాంపేటలో 14ఏళ్ల బాలుడిపై దాడి

కరవడం కాదు.. కొన్ని ప్రాంతాల్లో కుక్కలు ప్రాణాలు తీస్తున్నాయి. అభం, శుభం తెలియని చిన్నారులు బలవుతున్నారు. అయినా, జీహెచ్ఎంసీ మాత్రం ఎప్పటిపాటే పాడుతోంది. లక్షల సంఖ్యలో కుక్కలకు శస్త్ర చికిత్సలు చేశాం. వ్యాక్సినేషన్ పూర్తయిందని కాగితాల్లో కాకి లెక్కలు చూపుతోంది. కుక్కకాట్ల సంఖ్య పెరుగుతున్నా.. ప్రాణాలు కోల్పోతున్న వారు అధికమవుతున్నా.. యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కాలనీ, బస్తీ అన్న తేడా లేకుండా నగరంలోని చాలా ప్రాంతాల్లో వీధి కుక్కల సంఖ్య క్రమేణా పెరుగుతోన్నా.. అధికారులు అదే అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

- శనివారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లో ఇంట్లో ఆడుకుంటున్న బాలుడిపై, నిజాంపేటలో రోడ్డుపై వెళుతున్న మరో బాలుడిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి.
- ఇటీవల మియాపూర్ మక్తా మహబూబ్‌పేటలో ఆరేళ్ల బాలుడు సాత్విక్‌పై వీధి కుక్కలు దాడి చేసి చంపాయి. తీవ్రగాయాలతో చనిపోయిన చిన్నారి మృతదేహం పలువురిని కంటతడి పెట్టించింది. తోటి పిల్లలతో సాత్విక్ ఆడుకుంటుండగా ఈ ఘటన జరిగింది.
- గతంలోనూ అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడు వీధి కుక్కల దాడిలో మృతిచెందాడు. ఇంటి సమీపంలో రోడ్డుపై వెళ్తోన్న బాలుడిపై మూడు, నాలుగు కుక్కలు దాడి చేశాయి. సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ కావడంతో ఘటన చర్చనీయాంశమైంది.

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో శునకాలు రెచ్చిపోతున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరిపై ఎగబడి కరుస్తున్నాయి. ఇటీవల మియాపూర్‌లోని చెత్త రవాణా(ట్రాన్స్‌ఫర్) కేంద్రం వద్ద బాలుడిపై కుక్కలు ఎగబడి పేగులు బయటపడేలా కొరికి పడేశాయి. తాజాగా శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వేర్వేరు ప్రాంతాల్లో చిన్నారులపై కుక్కలు దాడిచేశాయి. అయితే, కుక్కలకు సరైన ఆహారం లభించక పిల్లలపై ఎగబడి కరిచి ఉంటాయని జీహెచ్ఎంసీ వర్గాలు భావిస్తున్నాయి.

నగరంలో చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్లను కొంత కాలంగా అభివృద్ధి చేస్తున్నారు. చెత్త బహిరంగంగా డంప్ చేయకుండా నేరుగా తరలింపు వాహనాల్లో వేసేలా యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు(ఎస్‌సీటీఎస్) అభివృద్ధి చేస్తున్నారు. మియాపూర్‌లోని

మిగతా 8వ పేజీలో..

తీవ్రంగా గాయపడిన ఇద్దరు పిల్లలు





గాయాలపాలైన హరిషి, తీవ్ర గాయమైన సాయిచరణ్ చేయి

దుండిగల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దుండిగల్, నిజాంపేటలలో శనివారం కుక్కలు రెచ్చిపోయాయి. ఇద్దరిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. దుండిగల్ మున్సిపల్‌లోని 10వ వార్డులోని నింటూసింగ్ నియమాదేవి దంపతుల కుమార్తె హరిషి(2). తల్లి వేరే గదిలో పని చేసుకుంటుండగా ఇంట్లో ఆడుకుంటున్న చిన్నారిపై రెండు వీధి కుక్కలు దాడి చేశాయి. కంటిపై భాగం, కాళ్లు, చేతులు, వీపు, ముఖంపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. చిన్నారి కేకలకు పరుగున వచ్చిన తల్లి.. కుక్కలను వెళ్లగొట్టింది. వెంటనే పాపను ఆస్పత్రికి తీసుకెళ్లింది.

మరో ఘటనలో..

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని జర్నలిస్ట్‌కాలనీలో సాయిచరణ్(14) నడుచుకుంటూ వెళ్తుండగా వీధికుక్కలు వెంటాడి తీవ్రంగా గాయపరిచాయి. బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



ఇంత నిర్లక్ష్యమా..?

ప్రభుత్వ అతిథిగృహం అంటే అధికారులెవరికీ పట్టింపు లేకుండా పోతోంది. బేగంపేటలోఉన్న మంజీర అతిథి గృహం గోడల్లోనుంచి ఇలా చెట్లు పెరుగుతున్నా పట్టించుకునే వారెవరూ లేరు. చెట్ల పెరుగుదలతో భవనం బీటలు వారి గోడలు కూలే అవకాశాలున్నాయి. మరి అధికారులెప్పుడు మేల్కొంటారో చూడాలి...

- ఫొటో , ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

బేగంపేటలో యువకుడి దారుణ హత్య

- బండరాయితో మోది మంటల్లోకి తోసేసి..

6

రివార్డు, గిఫ్ట్ కూపన్‌ల పేరుతో సైబర్ వల

- ఏపీకే ఫైల్, సందేశం పంపి నగదు దోపిడీ

7

చదువుల కోసం విదేశాలకు..

- పెద్దగా తెలియని దేశాలకూ తెలుగు విద్యార్థుల పరుగులు
- పోలాండ్, మెక్సికో, తైవాన్‌లనూ ఎంచుకుంటున్న వైనం
- వైద్య విద్యార్థులకు ఫేవరేట్‌గా ఫిలిప్పీన్స్, మలేషియా



హైదరాబాద్ సిటీ, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు అనగానే తెలుగు విద్యార్థులకు టక్కున గుర్తొచ్చేది యూఎస్, యూకే, ఆస్ట్రేలియా వంటి అగ్రదేశాలే. అయితే ఇటీవలి కాలంలో ఆయా దేశాలకు వెళ్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరగడం.. పలు దేశాలు వీసా నిబంధనలు కఠినం చేయడం, పీఆర్ అవకాశాలను తగ్గించడం, పార్ట్‌టైమ్ ఉద్యోగాలపై నియంత్రణ, రూ.లక్షలు ఖర్చు చేసి వెళ్లినా ఒక్కోసారి ఆయా దేశాల ఇమిగ్రేషన్‌లలో ఎదురయ్యే సమస్యలతో వెనక్కి తిరిగి రావడం.. తదితర కారణాల వల్ల ప్రత్యామ్నాయ అవకాశాలను వెదుకుతున్నారు. దీంతో విద్యార్థులు పోలెండ్, మెక్సికో,

మిగతా 8వ పేజీలో..

ప్రమోషన్ వరించేనా..!



రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమయింది. ఈ నేపథ్యంలో జిల్లాలో అర్హులైన టీచర్లలో టెన్షన్ మొదలైంది. సీనియారిటీ ప్రాతిపదికన ఎంతమందికి అవకాశం లభిస్తున్నది.. ఎందరికి నిరాశ ఎదురవుతుందో తెలియక ఉత్కంఠకు లోనవుతున్నారు. ఏళ్ల తరబడి ఒకే కేడర్‌లో పనిచేస్తున్న తమను ఈసారైనా పదోన్నతి వరిస్తుందో.. లేదోనని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సెప్టెంబర్‌లో చర్యలు చేపట్టింది. ఈ మేరకు సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 15నుంచి నుంచి గెజిటెడ్ హెచ్ఎంలు, 17 నుంచి స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా కొంతమందికి బదిలీలు కూడా జరిగాయి. అయితే గెజిటెడ్ హెచ్ఎంల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, బదిలీలను ముగించిన తరుణంలో ఎల్ఎఫ్ఎల్ (లో ఫీమేల్ లిటరసీ) ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో లోపాలను ఎత్తిచూపుతూ కొందరు సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) కోర్టును ఆశ్రయించారు. దీంతో సెప్టెంబర్‌లో షెడ్యూల్ ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. పదోన్నతుల కోసం ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు తీవ్ర నిర్వేదనకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కొత్త షెడ్యూల్‌పై టీచర్లు మళ్లీ ఆశలు పెట్టుకున్నారు. శనివారం నుంచి ప్రారంభమైన ప్రక్రియ ఈనెల 20 వరకు కొనసాగనున్న తరుణంలో తమకు అవకాశం

మిగతా 8వ పేజీలో..





కల్పన, ఆమె కుమార్తె లక్ష్మీ ప్రసన్న

ధీర వనితలు..

- దోపిడీ దొంగలతో ధైర్యంగా పోరాడిన తల్లీకూతుళ్లు
- కారపు నీళ్లు కళ్లల్లో కొట్టినా.. ప్రతిఘటించిన వైనం
- బైక్ కీ లాక్కొని అరవడంతో దొంగలు పరార్
- ఘరానా దొంగలను అరెస్ట్ చేసిన రాచకొండ పోలీసులు

పహాడిషరీఫ్/హైదరాబాద్ సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్నాచింగ్‌కు పాల్పడేందుకు వచ్చిన ఇద్దరు దుండగులు ఒంటరిగా వాకింగ్ వెళ్లిన తల్లీ కుమార్తెలను టార్గెట్ చేశారు. తల్లీ కుమార్తెలిద్దరూ ధైర్యంగా పోరాడారు. కళ్లల్లో కారం నీళ్లు పోసినా ఏమాత్రం వెరవకుండా పోరాడుతూనే వారి బైక్ కీస్ తీసుకుని గట్టిగా కేకలు వేశారు. దీంతో దొంగలు బైక్‌ను, వెంట తెచ్చిన బ్యాగ్‌ను వదిలేసి తోకముడిచారు. రెండు వారాల క్రితం జరిగిన ఈ సంఘటనపై దర్యాప్తు చేసిన రాచకొండ పోలీసులు ఘరానా దొంగలిద్దరినీ అరెస్ట్ చేశారు. వారి నుంచి 8 తులాల బంగారం, 30 తులాల వెండి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, డీఐ సుధీర్‌కృష్ణతో కలిసి డీసీపీ సునీతారెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు.

మహేశ్వరం మండలం, మంకాల్ గ్రామానికి చెందిన గడ్డమీది కల్పన మే 24న ఉదయం 5 గంటలకు తన కుమార్తెలు లక్ష్మీప్రసన్న, నేహా, కుమారుడు మనీష్‌కుమార్‌తో కలిసి శంషాబాద్ వెళ్లే సర్వీస్ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లారు. సుమారు 5:50కి ఒక బైక్‌పై ఇద్దరు దుండగులు ముఖానికి మాస్కులు, హెల్మెట్‌లు ధరించి వారికి దగ్గరగా వచ్చి కారం కలిపిన నీళ్లను కల్పన కళ్లలో కొట్టారు. ఆమె ఒక్కసారిగా గట్టిగా అరవడంతో పిల్లలంతా పరుగున తల్లివద్దకు వచ్చారు. ఈలోపు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కోవడానికి దుండగులు యత్నించారు.

ప్రతిఘటించి బైక్ కీ లాక్కున్న తల్లీకూతుళ్లు..

ఈ హఠాత్పరిణామంతో ఒక్కసారిగా అప్రత్తమత్తమైన కల్పన, ఆమె కుమార్తె లక్ష్మీప్రసన్నలు ఆత్మ విశ్వాసంతో, ధైర్యంగా దొంగలకు ఎదురు తిరిగారు. దాంతో రెచ్చిపోయిన దొంగలు కర్రతో తల్లీ కుమార్తెలను కొట్టడంతో నుదిటిపై వారికి గాయాలయ్యాయి. అయినా పట్టువిడవకుండా గట్టిగా కేకలు వేస్తూ తిరగబడి వారి బైక్ తాళాలు లాక్కున్నారు. దీంతో దొంగలు బైక్‌ను, వెంటతెచ్చుకున్న బ్యాగును అక్కడే వదిలేసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కల్పన, ప్రసన్నలను ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స

మిగతా 8వ పేజీలో..

బేగంపేటలో యువకుడి దారుణ హత్య

బండరాయితో మోది మంటల్లోకి తోసేసి..

బేగంపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బేగంపేటలో ఓ యువకుడిని బండరాళ్ళతో మోది మంటల్లో తోసి దారుణంగా హత్య చేశారు. బేగంపేట పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 2011లో కొమ్మల సంతోష్ తాను ప్రేమించిన సాయికన్యను పెద్దల ఆమోదంతో వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు (రోహిత్(11), దీక్షిత(9)) ఉన్నారు. సంతోష్‌కు స్థానికంగా నివాసముండే అన్నామలై అయ్యప్పతో పరిచయం ఏర్పడింది. వారం రోజుల క్రితం భార్య రహస్యంగా అయ్యప్పతో ఫోన్‌లో మాట్లాడుతుండడాన్ని సంతోష్ గమనించి భార్యను కొట్టాడు.

సంతోష్ జూన్ 7న అయ్యప్పపై దాడి చేసి బెదిరిండంతో తాను పనిచేసే చోట హౌస్ కీపింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సాయికన్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు అంగీకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ తన స్నేహితులు సయ్యద్ రజా, గొర్ల హర్షవర్ధన్‌లకు ఫోన్ చేసి బేగంపేట మయూరిమార్గ్ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రమ్మని చెప్పాడు. సాయంత్రం 6:30 గంటల సమయంలో అయ్యప్పతో పాటు సంతోష్ అతని ఇద్దరు స్నేహితులు గ్రౌండ్‌లో కలుసుకున్నారు. మద్యం తాగిన తరువాత సంతోష్ ఆవేశంతో అయ్యప్పను గ్రానైట్ రాయితో పలు మార్లు కొట్టి మండుతున్న చెత్త కుప్పలోకి తోసేశారు. అయ్యప్ప చనిపోయి ఉంటాడని భావించి అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు గమనించి అయ్యప్పను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మరణించాడు. అయ్యప్ప భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి, సంతోష్‌తో పాటు అతని ఇద్దరు స్నేహితులను అరెస్టు చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

● కమిషనర్ కార్యాలయం ఎదుట ఎల్‌హెచ్‌పీఎస్ ధర్నా


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజేశ్‌నాయక్, ప్రకాశ్ రోథోడ్ తదితరులు

కార్వాన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఐటీడీఏ, ఇతర ప్రభుత్వ సంస్థల్లోని బ్యాక్‌లాగ్ పోస్టులను 100 శాతం స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంస్థల శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట లంబడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌పీహెచ్‌ఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ధర్నాలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ రోథోడ్, రాష్ట్ర కార్యదర్శి గోవిందు నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు వడిత్య రమేశ్ నాయక్, సురేశ్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1996 పెసా చట్టం ప్రకారం స్థానిక గిరిజన అభ్యర్థులతోనే 100 శాతం భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. 5వ షెడ్యూల్డ్ భారత రాజ్యాంగం, 1/59, (ఎల్‌టీఆర్) 1/70 చట్టాలు అమల్లోకి తీసుకురావాలని కోరారు. ఎస్టీల 10 శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.

వైద్యుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి: జేఏసీ


డీఎంఈ కార్యాలయం ఎదుట ప్ల కార్డులతో వైద్యులు

మంగళ్‌హాట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వైద్యాఆరోగ్య శాఖలో చేపట్టనున్న వైద్యుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాలేజీ అండ్ హాస్పిటల్స్ టీచింగ్ డాక్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల మెడికల్ కాలేజీల వైద్యుల బృందం కోఠిలోని డీఎంఈ కార్యాలయానికి వచ్చి ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. బదిలీల్లో వైద్య సంఘాలు, వైద్యుల సంఘం నేతల ప్రమేయం లేకుండా చూడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు చైర్మన్ డాక్టర్ వి.శేఖర్, ప్రతినిధులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాబురావు, డాక్టర్ మనీష్, డాక్టర్ కవిత తదితరులు మీడియాతో మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో తిష్టవేసిన వైద్యులకు స్థానచలనం కల్పించడంతో పాటు రెండేళ్లకు మించి ఒకేచోట గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

గోవులను రక్షించి, గోవధను నిరోధించాలి



మాట్లాడుతున్న జస్‌రాజ్, మహేష్ అగర్వాల్ తదితరులు

బర్కత్‌పుర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా అక్రమంగా నగరంలోకి గోవులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలను తీసుకోవాలని భారతీయ ప్రాణమిత్ర సంఘ్ డిమాండ్ చేసింది. గోవులను రక్షించి, అక్రమ గోవధను నిరోధించాలని వారన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులు సమావేశంలో భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ అధ్యక్షుడు సీఏ జస్‌రాజ్ శ్రీశ్రీమాల్, కార్యదర్శి మహేష్ అగర్వాల్, రిధీష్ జాగీర్దార్, జస్మత్ పటేల్ తదితరులు మాట్లాడారు. ఈ నెల 20న బక్రీద్ పండగ సందర్భంగా ఇప్పటి నుంచే అక్రమంగా నగరంలోకి గోవులను తరలిస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గోవుల అక్రమ రవాణాను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని వారు విమర్శించారు. ప్రభుత్వం అన్ని ప్రాంతాలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి తామే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి గోవులను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని స్వస్థలాలకు తరలిస్తామని వారు హెచ్చరించారు. గోవుల అక్రమ రవాణా నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో డీజీపీ, నగర, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు.

రేపటి నుంచి పీజీఈసెట్ పరీక్షలు

● నిమిషం లేటైనా అనుమతి ఉండదు

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీజీఈసెట్) పరీక్షలు ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు జరగనున్నాయి. ఈ సెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షాకేంద్రాలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని సెట్ కన్వీనర్ డాక్టర్ ఎ.అరుణకుమారి తెలిపారు. పీజీఈసెట్ పరీక్షలు ప్రతిరోజూ సెషన్1 ఉదయం 10గంటలకు, సెషన్2 మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. పరీక్ష సమయం కంటే గంటన్నర ముందుగానే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పీజీఈసెట్‌కు 22,712 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో హైదరాబాద్ జోన్ నుంచి 18,300 మంది, వరంగల్ జోన్ నుంచి 4,412మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తెలంగాణేతర అభ్యర్థులు 1,145మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 556 మంది ఆంధ్ర, 257మంది రాయలసీమకు చెందిన వారుండగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 332మంది ఉన్నట్లు కన్వీనర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునీర్‌పటేల్

నితీష్, చంద్రబాబు ఎన్డీయే నుంచి బయటకు రావాలి

బర్కత్‌పుర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రయోజనాల కోసం ఎన్డీయే కూటమి నుంచి టీడీపీ, జేడీయూ పార్టీలు బయటకు రావాలని అఖిల భారత తంజీమ్-ఎ- ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్‌పటేల్, ఉపాధ్యక్షుడు ఎండీ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. పదేళ్లల్లో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి దేశ ప్రతిష్టను దిగజార్చిందని వారు ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ, జేడీయూ అధినేతలు చంద్రబాబు, నితీష్‌కుమార్.. మోదీ నిజస్వరూపాన్ని తెలుసుకుని తక్షణమే కూటమి నుంచి బయటకు రావాలన్నారు. టీడీపీ, జేడీయూ పార్టీలు ఎన్డీయే కూటమి నుంచి తప్పుకుంటే దేశంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని వారన్నారు. సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు ఎంటీ. కాశీం, ఎండీ ముజారుద్దీన్, ఎండీ యూసుఫ్, ఎండీ చాంద్‌పాషా, ఎండీ సమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, పాత్రికేయులు

రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు

● నివాళులర్పించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్/మదీన/చాంద్రాయణగుట్ట, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటు అని పలువురు పేర్కొన్నారు. రామోజీరావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మరణించారు. శనివారం సాయంత్రం రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొని నివాళులర్పించారు. రామోజీరావు ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు. రామోజీరావు మృతికి ఓల్డ్‌సిటీ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలియజేశారు. చార్మినార్ వద్ద రామోజీరావు చిత్రపటానికి వివిధ పత్రికలకు చెందిన రిపోర్టర్లు, నాయకులు పాల్గొని పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రామోజీరావు మృతి పట్ల తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జి.కన్నయ్యలాల్ ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

సికింద్రాబాద్ నుంచి 19వ భారత్ గౌరవ్ రైలు

● సీనియర్ సిటిజన్స్‌తో ప్రారంభించిన అధికారులు


రైల్ ఎక్కుతున్న సీనియర్ సిటిజన్లు దినేష్, సాధన

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాల యాత్రకు సికింద్రాబాద్ నుంచి ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన 19వ భారత్ గౌరవ్ రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శనివారం ప్రారంభమైంది. దీనిని ప్రయాణికుల్లో సీనియర్లు దినేష్ చుక్కే(75), సతీమణి సాధనా చుక్కే(63) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జెండా ఊపడంతో భారత్ గౌరవ్ రైలు ప్రయాణం ప్రారంభమైంది. అయోధ్య-కాశీ వెళ్లే ప్రయాణికుల నుంచి ఈ రైలు ఎంతో ఆదరణ పొందిందని, వందశాతం పూర్తి ఆక్యుపెన్సీతో బయలుదేరిందని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి భారత్ గౌరవ్ రైళ్లు పెద్దపీట వేస్తున్నాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● సిటీ సివిల్ కోర్టు ప్రధానన్యాయమూర్తి రేణుకా

చార్మినార్ జూన్ 8(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుకా యారా సూచించారు. లోక్ అదాలత్‌తో కేసులను పరిష్కరించుకుని డబ్బు ఆదా చేసుకోవచ్చని అన్నారు. శనివారం సిటీ సివిల్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,353 కేసులు పరిష్కరించారు. వాటిల్లో పెండింగ్‌లో ఉన్న 323 కేసులు, 3,030 ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కారం కాగా, లబ్ధిదారులకు ఇచ్చిన మొత్తం రూ.26,02,84,800 అందజేశారు. లోక్ అదాలత్‌లో సిటీ సివిల్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుకా యారా, కె.మురళీమోహన్, 9వ అదనపు ప్రధానన్యాయమూర్తి డానీ రూత్, 11వ అదనపు ప్రధాన న్యాయమూర్తి భవానీ, 4వ సీనియర్ సివిల్ జడ్జి కాంచనరెడ్డి, 17వ సీనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య, 10 జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని యువతి
రెండేళ్ల బాలుడిని తీసుకుని అదృశ్యం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి


రిషిక్


మతిస్థిమితంలేని యువతి

చార్మినార్ జూన్ 8(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని యువతి పక్కింట్లో ఉంటున్న రెండేళ్ల బాలుడిని కనిపించకుండా పోయింది. ఈ ఘటన మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌షాహీ గంగాపుత్ర సంఘం ప్రాంతానికి చెందిన గణేష్, వరలక్ష్మీ భార్యాభర్తలు వీరికి ఇద్దరు సంతానం. ఇంటి పక్కన ఉంటున్న నిఖితకు మతిస్థిమితం సరిగా లేదు. ఆమె రోజూ చిన్న కుమారుడు రిషిక్‌ను తీసుకెళ్లి ఇంటి పరిసరాల్లో ఆడుకుంటుండేది. శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో రిషిక్‌ను తీసుకువెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో రిషిక్ తల్లి శనివారం మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు .

అరెస్టు వారెంట్ జారీ అయింది

● ఆస్తులు జప్తు చేస్తామని వీడియోకాల్...
● రూ. 4.15లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మీ పేరుతో నకిలీ క్రెడిట్ కార్డులు, నకిలీ పాస్‌పోర్టులు, డ్రగ్స్ పార్శిల్స్ విదేశాలకు వెళ్తుండగా పట్టుబడ్డాయి. కస్టమ్స్ అధికారుల ఫిర్యాదు మేరకు మీ మీద సీబీఐలో కేసు నమోదయింది., మిమ్మల్ని అరెస్టు చేయాల్సిందిగా ఢిల్లీ కోర్టు నుంచి వారెంట్ జారీ అయిందంటూ బెదిరించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ. 4.15లక్షలు కాజేశారు.ఆ తర్వాత తేరుకున్న బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తికి ఇటీవల రాత్రి వాట్సాప్ వీడియోకాల్ వచ్చింది. సీబీఐ నుంచి మాట్లాడుతున్నామని నమ్మించిన కేటుగాళ్లు.. కాల్ రికార్డు చేయబడుతుందని, ఎవరికీ చెప్పొద్దని ముందుగానే బాధితున్ని హెచ్చరించారు. అనంతరం అసలు విషయం చెప్పారు. మీ పేరుతో విదేశాలకు వెళ్తున్న పార్శిల్‌లో నకిలీ క్రెడిట్ కార్డులు, నకిలీ పాస్‌పోర్టులు, డ్రగ్స్ ఉన్నాయి. విచారణలో మీ ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ లింకైనట్లు తేలింది. దాంతో మిమ్మల్ని అరెస్టు చేయాలని ఢిల్లీ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని లేఖను చూపించారు. అనంతరం కేసు సీబీఐకి వచ్చిందని భయపెట్టారు. మిమ్మల్ని అరెస్టు చేయకుండా ఉండాలన్నా, కేసులో మీకు హెల్ప్ చేయాలన్నా కొంతమొత్తంలో డబ్బులు చెల్లించాలి. మీ ప్రమేయం లేదని తేలితే.. మీ డబ్బులు తిరిగి ఇస్తారు అని నమ్మించారు. రాత్రికి రాత్రే బాధితున్ని భయపెట్టి రూ. 4.15లక్షలు కొల్లగొట్టారు. మరుసటి రోజు షాక్ నుంచి తేరుకున్న బాధితుడు ఇదంతా మోసమని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీజీఎస్పీడీసీఎల్‌లో పేరుకుపోతున్న ఫైళ్లు

● ప్రతి పనికీ సీఎండీని కలవాలంటున్న ఇన్‌చార్జి డైరెక్టర్లు
● కొత్త డైరెక్టర్ల ఎంపికపై ఉత్కంఠ

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఇన్‌చార్జి డైరెక్టర్ల తీరుతో ఫైళ్లు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. గత కొన్నిరోజులుగా ఇన్‌చార్జి డైరెక్టర్లు ఆయా విభాగాల్లో ఫైళ్లను పరిశీలించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏ పనికావాలన్నా డిస్కం సీఎండీని కలవాలని డైరెక్టర్లు చెబుతున్నారని కొంతమంది కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. డిస్కం పరిధిలో గత ప్రభుత్వ హయాంలో సుమారు 80కిపైగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పనులు నిలిచిపోవడానికి స్థల వివాదం కారణం కాగా, అధికారులు అన్నింటికీ ఒకటే కారణం చూపి పనులు నిలిపివేశారని ఆరోపిస్తున్నారు. కొత్త టెండర్లు పిలవడం లేదని, మెయింటెన్స్ పనులకు నిధులు కేటాయించడం లేదని, గ్రేటర్‌లో వందల ప్రాంతాల్లో 11 కేవీ ఫీడర్లు ఓవర్‌లోడ్ కారణంగా సరఫరా లో అంతరాయాలు తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డైరెక్టర్ల పోస్ట్‌లకు ఆశావాహుల ప్రయత్నాలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డిస్కంలో పదేళ్లుగా డైరెక్టర్లుగా కొనసాగిన వారిని తొలగించడంతో పాటు కొత్త డైరెక్టర్ల నియామానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల కోడ్‌తో డైరెక్టర్ల నియామకం ఆలస్యం కావడంతో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారినే ఇన్‌చార్జి డైరెక్టర్లుగా, సీఎండీలు నియమించారు. కోడ్ ముగియడంతో కొత్త డైరెక్టర్ల నియామకాలపై ఉత్కంఠ నెలకొంది. టీజీఎస్పీడీసీఎల్‌లో డైరెక్టర్ల పోస్టులకు ఇప్పటికే కొంతమంది ఆశావాహులు కాంగ్రెస్ పెద్దలను కలుస్తూ ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. డైరెక్టర్ల నియామకాలకు ఓ ప్రత్యేక కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిస్కంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్గిన సీనియర్ ఇంజనీర్లను డైరెక్టర్లుగా నియమించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఐఏఎస్‌లు సీఎండీలుగా ఉంటూ అవినీతి ఆరోపణలు లేని సీనియర్ ఇంజనీర్లను డైరెక్టర్లుగా నియమిస్తే విద్యుత్ సంస్థల్లో మార్పులు తీసుకువచ్చే అవకాశముంటుందని సీనియర్ రిటైర్డ్ ఇంజనీర్లు సూచిస్తున్నారు.

గృహజ్యోతికి ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు

● అర్హత కల్గిన వారికీ జీరో బిల్లులు: సీజీఎం ఆనంద్

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అర్హత కల్గిన విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని రంగారెడ్డి జోన్ సీజీఎం పి.ఆనంద్ తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో తెల్లరేషన్ కార్డు కల్గి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న వారంతా జీరో బిల్లుకు దరఖాస్తు చేసుకోవచ్చని శనివారం తెలిపారు. రంగారెడ్డి జోన్ పరిధిలోని సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లలో జూన్ 6 నుంచే జీరో బిల్లులు జారీచేస్తునట్లు తెలిపారు. రంగారెడ్డి జోన్ నాలుగు సర్కిళ్లలో 3,73,400 మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నారని అత్యధికంగా వికారాబాద్ సర్కిల్‌లో 1,14,455 లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,01,737, సరూర్‌నగర్‌లో 93,516, సైబర్‌సిటీ సర్కిల్‌లో 63,692 మంది లబ్ధిదారులున్నట్లు తెలిపారు. జోన్ వ్యాప్తంగా జీరో బిల్లులు జారీచేస్తున్నామని, అయినా కొంతమంది దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక విద్యుత్‌కార్యాలయాలకు వస్తున్నారని, అర్హత కల్గిన వారంతా ప్రజాపాలన సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వారి వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయగానే జీరో బిల్లు జారీ అవుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని అన్నారు. .

14 ఎంయూలు తగ్గిన విద్యుత్ డిమాండ్

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో గ్రేటర్‌లో రోజు వారీ విద్యుత్ డిమాండ్ 14 మిలియన్ యూనిట్లకు తగ్గింది. జూన్ 1న గ్రేటర్‌జోన్‌లో 86 మిలియన్ యూనిట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్, 7 నాటికి 72 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. వర్షాల కారణంగా నాలుగురోజులుగా రోజువారీ విద్యుత్ వినియోగం 72-73 మిలియన్ యూనిట్లుగా మాత్రమే నమోదవుతుంది. గ్రేటర్‌లో గత శనివారం(జూన్ 1న) 4,046 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవ్వగా, శుక్రవారం(జూన్7) నాటికి 3,412 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది.

ప్రత్యేక చర్యలు..

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా విద్యుత్‌శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సెక్షన్, డివిజన్లలో అదనపు సిబ్బంది నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోపాటు 24 గంటలు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సిబ్బందితోపాటు ఆపరేషన్ వింగ్ ఏఈ, ఏడీఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ లైన్లపై చెట్లకొమ్మలు తొలగించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ తీగలు వేస్తున్నారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టే సిబ్బంది తప్పనిసరిగా భద్రత సూత్రాలు పాటించాలని, అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహించాలంటూ ఇప్పటికే టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించారు.

రివార్డు, గిఫ్ట్ కూపన్‌ల పేరుతో సైబర్ వల

● ఏపీకే ఫైల్, సందేశం పంపి నగదు దోపిడీ

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి చైతన్యకు స్టేట్‌బ్యాంక్ పేరుతో వాట్సాప్‌లో ఓ సందేశం వచ్చింది. మీ బ్యాంక్ ఖాతాకు ఎస్‌బీఐ రివార్డు రూ.7,250 యాక్టివేట్ అయిందని, ఈ రోజుతో కాలపరిమితి ముగుస్తుందని మెసేజ్ వచ్చింది. రివార్డు కావాలంటే కింద పంపిన లింక్ ద్వారా ఎస్‌బీ రివార్డు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, క్లెయిమ్ చేసుకుంటే మీ ఖాతాలో డబ్బు జమ అవుతాయని సందేశంలో ఉంది. తన నెంబర్‌తోపాటు, స్నేహితులు, సహోద్యోగులు ఉన్న వాట్సాప్ గ్రూపులో కూడా ఇదే మెసేజ్ రావడంతో కొంతమేరకు నమ్మకం వచ్చింది. స్నేహితుడు కూడా ఇదే మెసేజ్ పంపడం, మెసేజ్ వచ్చిన నెంబర్ డీపీలో బ్యాంక్ లోగో ఉండడం, చాలాకాలంగా ఎస్‌బీఐలో ఖాతా ఉండడంతో నిజమని భావించిన చైతన్య ఏపీకే లింక్‌ను ఓపెన్ చేశాడు. ఎస్‌బీఐని పోలిన వెబ్‌సైట్(ఎస్‌బీఐ రివార్డ్స్) ఓపెన్ కావడంతో, ఖాతా వివరాలు, కార్డు, సీవీవీ వివరాలు నమోదు చేశాడు. కొంతసేపటికి ఖాతా నుంచి డబ్బు విత్‌డ్రా అయినట్లు సందేశాలు రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమాచారం చోరీ..

ఓటీపీ, ఓఎల్‌ఎక్స్ మోసాలపై అవగాహన పెరడగంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ముందుకు వెళ్తున్నారు. ప్రముఖ బ్యాంక్‌లు, సంస్థలు, ఈ కామర్స్ సైట్ల పేర్లను దీనికోసం వాడుతున్నారు. సిమ్‌లను సేకరించి, వాటికి ప్రముఖ సంస్థలు, బ్యాంక్‌ల లోగోలు, పేర్లు తగిలిస్తున్నారు. పలువురికి రివార్డు, ఆఫర్ కూపన్‌ల పేరుతో లింక్‌లను పంపుతున్నారు. లింక్ ఓపెన్ చేస్తే, దాని ద్వారా ఫోన్‌ను హ్యాక్ చేసి సమాచారాన్ని తస్కరిస్తున్నారు. సందేశాలు ఎక్కువ మందికి వెళ్లేలా పలు వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇది నిజమా? కాదా? అని కూడా నిర్ధారించకుండా కొంతమంది తమ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ఇదే సందేశాన్ని ఫార్వర్డ్ చేస్తున్నారు. పంపింది స్నేహితుడే కదా అని, ఓపెన్ చేసిన వారు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు. ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని సేకరించిన సైబర్ నేరగాళ్లు, ఖాతా వివరాలు సేకరించి డబ్బు కాజేయడంతోపాటు, సమాచారం, వీడియోలు, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతున్నారు.

డైరెక్టర్లు లైంగికంగా వేధిస్తున్నారని..

సీబీఐటీలో ఉద్యోగుల ఆందోళన

● ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట బైఠాయింపు

నార్సింగ్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గండిపేట్‌లోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో బోధన, బోధనేతర ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఇద్దరు డైరెక్టర్లు మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. శనివారం ఉదయం కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఓ అధ్యాపకురాలిని, మరికొందరు మహిళా ఉద్యోగులను ఐక్యూఏసీ డైరెక్టర్లు లైంగికంగా వేధిస్తున్నారని, ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆరోపించారు. ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డైరెక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళా ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి

ధీర వనితలు..

(5వ పేజీ తరువాయి)

అందించారు. కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పహాడిషరీఫ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రత్యేక బృందాలు రంగంలోకి..

డీసీపీ సునీతారెడ్డి.. మూడుప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక పోలీసుల దర్యాప్తులో కొన్ని టెక్నికల్ ఆధారాలు దొరికాయి. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, సిబ్బంది సుధీర్, వెంకటేశ్వర్లు, రైల్వే పోలీసుల సహకారంతో ఇద్దరు దొంగల (మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన టక్ షమ్‌షేర్‌సింగ్, నిజామాబాద్‌కు చెందిన దండ్ల బాబు అలియాస్ బాబు బాలాజీ గైక్వాడ్)ను అదుపులోకి తీసుకొన్నారు.

పటాన్‌చెరులో బైక్ చోరీ చేసి..

వారిని విచారించిన క్రమంలో ఇద్దరు నిందితులు పటాన్‌చెరులో బైక్ చోరీ చేసి.. అదేరోజు పహాడీషరీఫ్‌లో కల్పన మంగళసూత్రం, మహేశ్వరంలో గొర్ల కాపరి వద్ద వెండి, బంగారం వస్తువులు, కందుకూరులోని రాచలూర్‌లో ఓ మహిళ నుంచి మంగళసూత్రం లాక్కొని పారిపోయినట్లు తేలింది. గతంలో వీరు జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటి వరకు వీరిపై 82 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మహేశ్వరం ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, క్రైమ్ బృందాలను డీసీపీ అభినందించారు. దోపిడీ దొంగలతో ధైర్యంగా పోరాడిన కల్పన, ప్రసన్నలను డీసీపీ అభినందించారు.



నివాళులర్పిస్తున్న బ్రహ్మకుమారీలు, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, మాగంటి గోపీనాథ్, బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్

రామోజీకి నివాళి..

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఫిల్మ్‌సిటీలో ఆయన మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.



మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి



రామోజీరావు కుమారుడు కిరణ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్

ప్రపంచం గర్వించదగినది తెలంగాణ విద్యార్థి ఉద్యమం

● ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ● 'ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం' పుస్తకావిష్కరణ

తార్నాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగినది తెలంగాణ విద్యార్థి ఉద్యమమని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. నలమాస కృష్ణ రచించిన 'ఉస్మానియా వెలుగులో.. తెలంగాణ విద్యార్థి ఉద్యమం' అనే పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. నలమాస కృష్ణ రచించిన పుస్తకాన్ని చూడగానే తెలంగాణ ఉద్యమ రచన మొదలైందనే సంతోషం కలిగిందని అభిప్రాయపడ్డారు. సమాజంలో చరిత్ర రచన అనేది ముఖ్యమైన విషయమని, తెలంగాణ విద్యార్థి ఉద్యమాన్ని సంఘటనగా కాకుండా విద్యార్థి ఉద్యమ క్రమాన్ని రచయిత కృష్ణ ఈ పుస్తకంలో పొందుపరిచాడని కొనియాడారు. ప్రపంచం గర్వించదగిన తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో విద్యార్థుల ఆత్మహత్యలు బాధాకరమని, విద్యార్థుల త్యాగం లేకపోతే తెలంగాణ ఆవిర్భవించకపోయేదని అన్నారు. అనంతరం ఓయూ ప్రొ.కాశీం మాట్లాడుతూ పదేళ్ల తెలంగాణను సమీక్షించుకుంటున్న కాలంలో, విద్యార్థి ఉద్యమంపైన ఇప్పటి వరకు ఒక నిర్మాణాత్మకమైన రచన లేదనే లోటును ఈ పుస్తకం భర్తీ చేస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఒక తాటి పైన నిలిపిన శక్తులను, చీల్చిన శక్తులను ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగిందన్నారు. అనంతరం పుస్తక రచయిత నలమాస కృష్ణ మాట్లాడుతూ భారత సామాజిక ఉద్యమాల చరిత్రలో తెలంగాణ విద్యార్థి ఉద్యమం నిలిచిపోతుందని గుర్తు చేశారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమంపై చేసిన ఈ పరిశోధన కేవలం విద్యార్థులకు ఉండే సహజ లక్షణాలనే కాకుండా, సామాజిక ఉద్యమాల్లో వాళ్ల పోషించిన పాత్రనూ విశ్లేషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పుస్తక సహ సంపాదకుడు డేవిడ్, ప్రొ. వెంకటేశ్ నాయక్, ప్రొ. గాలి వినోద్ కుమార్, ప్రొ. ఎస్.స్వామి, మందాల భాస్కర్, దుర్గం భాస్కర్, కోట శ్రీనివాస్, దరువు ఎల్లన్న, స్టాలిన్, కంచర్ల బద్రి, నెల్లి సత్య, మోహన్ ధరావత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుస్తక రచయిత నలమాస కృష్ణ, వేదికపై ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ తదితరులు

చదువుల కోసం విదేశాలకు..

(5వ పేజీ తరువాయి)

తైవాన్, నెదర్లాండ్స్ లాంటి దేశాలవైపు చూస్తున్నారు.

ఆర్థికం.. అవకాశం..

అదే దేశాల ఎంపికకు ప్రాధాన్యం

మనవాళ్లు విద్య కోసం ఎంతటి ప్రాధాన్యత ఇస్తారో, అంతకంటే ఎక్కువగా ఖర్చు, ఉపాధి అంశాలకూ ప్రాధాన్యం ఇస్తుంటారు. మెరుగైన అవకాశాల కోసం యూఎస్ నిలయమే కావొచ్చు కానీ, పోలెండ్, జర్మనీలాంటి దేశాలతో పోలిస్తే ఖర్చు చాలా ఎక్కువ అని చెబుతున్నారు. ఉపాధి పరంగానూ జర్మనీలో మంచి అవకాశాలే ఇప్పుడు ఉన్నాయని అందుకే తాము జర్మనీకి వెళ్లామని చిక్కడపల్లికి చెందిన వసంత్ పేర్కొన్నారు. మన దేశంలో పేమెంట్ మెడిసిన్ సీట్లతో పోలిస్తే మలేషియా, ఫిలిప్పీన్స్, వియత్నాం తదితర దేశాలలో తక్కువగానే ఉందని, అందుకే ఇటీవలి కాలంలో ఆ దేశాలకు వెళ్తున్న వారి సంఖ్య పెరిగిందని అమీర్‌పేటలోని ఓ కన్సల్టెన్సీ ప్రతినిధి తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ దేశాల యుద్ధం నేపథ్యంతో పాటుగా పశ్చిమ దేశాలలో ఉద్రిక్త పరిస్థితులు కూడా విద్యార్థులను మలేషియా వంటి దేశాలవైపు చూసేలా చేస్తున్నాయని చెబుతున్నారు.

చాలా వరకూ దేశాలు ఇటీవలి కాలంలో విదేశీ విద్యార్థులకు అవకాశాలను తెరవడం, విద్యముగిసిన తరువాత ఒకటి లేదా రెండేళ్లు అక్కడ ఉండి ఉద్యోగం చేసే అవకాశం కల్పిస్తుండటంతో చాలామంది చిన్న దేశాలైనా ఓకే అంటున్నారని చెబుతున్నారు. స్థానిక భాషలకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ, ఇంగ్లిష్ మాట్లాడే వారి సంఖ్య కూడా ఆయా దేశాలలో ఎక్కువగానే ఉండటంతో భాషాపరమైన అవరోధాలు కూడా పెద్దగా ఉండవని, అది కూడా మనవాళ్లు పలు దేశాలకు వెళ్లేందుకు కారణంగా పలు కన్సల్టెన్సీల ప్రతినిధులు వెల్లడిస్తున్నారు.

తెలుగువారే ఎక్కువ

ఉన్నత విద్యకోసం వెళ్లే వారు ఎక్కువ శాతం అగ్రదేశాలకే ఓటువేస్తున్నారు. విదేశాకు వెళ్లేవారిలో భారతీయ విద్యార్థుల సంఖ్య పరంగా చూస్తే తెలంగాణ టాప్3లో ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇండియన్ స్టూడెంట్ మొబిలిటీ రిపోర్ట్ 2023 ప్రకారం విదేశాలకు వెళ్తున్న మొత్తం భారతీయ విద్యార్థుల్లో 12.50శాతం మంది తెలుగు రాష్ట్ర విద్యార్థులే ఉన్నారు. 2019లో దాదాపు 11 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళితే.. 2022లో అది 13 లక్షలకు పైగానే ఉంది. ప్రస్తుతం 15శాతం వృద్ధితో, 2025 నాటికి 20 లక్షల మంది విద్యార్థులు విదేశీ విద్య కోసం వెళ్లవచ్చని అంచనా. సంప్రదాయ యూఎస్ యూకే, ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాలతో పాటుగా జర్మనీ, పోలాండ్, కిరిగిస్తాన్, ఐర్లాండ్, సింగపూర్, ఫిలిప్పీన్స్, ఫ్రాన్స్ న్యూజిలాండ్‌కు కూడా విద్యకోసం వెళ్తున్న విద్యార్థులు పెరుగుతున్నారు. గత ఏడాది పోలాండ్ 10వేల మంది విదేశీ విద్యార్థులను స్వాగతిస్తే వారిలో 3వేల మంది భారతీయులేనని, అందులో తెలుగువారి సంఖ్య తక్కువేం కాదని కన్సల్టెన్సీలు పేర్కొంటున్నారు. అలాగే మలేషియాకు ఒక్క హైదరాబాద్ నుంచే 100 మందికి పైగా విద్యార్థులు గత ఏడాది వచ్చారని అక్కడి యూనివర్శిటీల ప్రతినిధులు ఇటీవల జరిగిన ఓ ఫెయిర్‌లో పేర్కొనడం మన వాళ్ల విజ్ఞాన తృష్ణను తెలియజేస్తున్నది.

ఏయే దేశాలలో ఏయే కోర్సులను ఇష్టపడుతున్నారంటే..

వియత్నాం..

ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటుగా మెడిసిన్ ఇక్కడ చదివేందుకు అనుకూలంగా భావిస్తున్నారు.

పోలాండ్ ..

అంతర్జాతీయంగా టాప్ 1000 యూనివర్శిటీలలో 10 ఇక్కడే ఉన్నాయి. ఇక్కడ ట్యూషన్ ఫీజు సంవత్సరానికి 2-7 లక్షల వరకూ ఉంటుంది. పార్ట్ టైమ్ వర్క్ వారానికి 20 గంటల వరకూ చేసుకునే అవకాశాలున్నాయి. విద్య ముగిసిన తరువాత 1-2 సంవత్సరాలు పనిచేసుకునే అవకాశాలున్నాయి.

ఐర్లాండ్..

భారతీయ విద్యార్థులకు ఇటీవలి కాలంలో నచ్చిన దేశంగా నిలిచింది. రెండేళ్లపాటు విద్య ముగిసిన తరువాత ఇక్కడ ఉండే అవకాశాలున్నాయి. ఇదే మనవాళ్లను బాగా ఆకర్షిస్తున్నది. సాఫ్ట్‌వేర్, మెడిసిన్, బ్యాంకింగ్, ఫైనాన్స్ వంటి కోర్సులకు ఇక్కడ ఆదరణ ఎక్కువ.

తిండి దొరకకనే..

(5వ పేజీ తరువాయి)

చెత్త రవాణా కేంద్రం బహిరంగంగా ఉంది. దీంతో చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకునేందుకు సమీపంలో ఉండే సేకరణ కార్మికుల పిల్లలు వస్తుంటారు. వారితో ఆడుకునేందుకు వెళ్లిన సాత్విక్ కుక్కల దాడిలో మరణించాడు. చుట్టూ ఫెన్సింగ్/ప్రహరీ లేకపోవడంతో కుక్కలు వచ్చాయి. మాంసం తినేందుకు అలవాటు పడిన కుక్కలు.. సరిపడా ఆహారం లభించని సమయంలో విపరీతంగా ప్రవర్తిస్తుంటాయి. ఈ క్రమంలోనే బాలుడిపై దాడి జరిగి ఉంటుందని వెటర్నరీ వైద్యుడొకరు తెలిపారు. అంబర్‌పేట ఘటన జరిగిన సమయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. స్థానికంగా ఓ మహిళ కుక్కలకు మాంసం పెట్టడం అలవాటు చేసిందని, ఆమె అందుబాటులో లేకపోవడంతో ఆహారం లభించక బాలుడిపై దాడి చేశాయని చెప్పారు. మియాపూర్‌లోనూ అదే జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోడ్ల పక్కన చెత్త కుప్పలు..

వల్నరబుల్ గార్బేజ్ పాయింట్లను తొలగిస్తున్నామని జీహెచ్ఎంసీ చెబుతున్నా.. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సేకరణ కార్మికులు ఇళ్ల వద్దకు సరిగా రాకపోవడంతో కొందరు.. రూ.150 నుంచి రూ.200 వసూలు చేస్తుండడంతో ఇంకొందరు.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారు. చికెన్ దుకాణాలు, కర్రీ పాయింట్లకు చెందిన కొందరు మాంసం వ్యర్థాలను చెత్త కుప్పల్లో వేస్తున్నారు. వాటిని తినేందుకు అలవాటు పడిన కుక్కలు.. ఒక్కోసారి మనుషులను కరుస్తున్నాయి. పలు జోన్లలో ఒకటి, రెండు ప్రాంతాల్లో చెత్త కుప్పలు వేసే ప్రాంతాన్ని శుభ్రం చేసి ఫొటోలకు ఫోజులిస్తున్న అధికారులు.. గ్రేటర్‌వ్యాప్తంగా పరిస్థితిని చక్కదిద్దడంపై దృష్టి సారించడం లేదు. వర్షాకాలం కావడంతో చెత్తకుప్పల వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశముంది. కుక్కలూ విపరీతంగా ప్రవర్తించే ప్రమాదమూ ఉంది.

మాదకద్రవ్యాలు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

మల్కాజిగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మిర్జాలగూడలోని ఓ పెట్రోల్ పంపు ఎదురుగా మెట్టుగూడ నుంచి మల్కాజిగిరి వైపు వచ్చే రోడ్డులో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. లాలాపేట్‌కు చెందిన అబ్దుల్ ముబీన్(25)ను తనిఖీ చేశారు. అతడి నుంచి 25 ఎల్ఎస్‌డీ బ్లాట్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ రావు, ఎస్‌టీఎఫ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

ప్రమోషన్ వరించేనా..

(5వ పేజీ తరువాయి)

లభిస్తుందని వేచిచూస్తున్నారు.

జిల్లాలో సుమారు 421 పోస్టులు ఖాళీ..

జిల్లాలోని 16 మండలాల పరిధిలో 691 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఇందులో ఆయా మీడియంలలోని స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో సుమారు 421 ఖాళీలు ఉన్నాయి. వీటిని తాజా ప్రమోషన్ల ప్రక్రియలో భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాగా, మరో 147 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను డీఎస్సీ ద్వారా పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే పదోన్నతుల ప్రక్రియ ముగిసిన తర్వాత ఎస్‌జీటీ కేడర్‌లో ఖాళీగా ఉండే పోస్టులను డీఎస్సీలో కలుపుతారా.. లేకుంటే పెండింగ్‌లో ఉంచుతారా.. అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, ఈనెల 20లోపు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

వివిధ కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ప్రమోషన్ ఖాళీలు సుమారుగా (మీడియం వారీగా)

పోస్టు	ఉర్దూ	తెలుగు	ఇంగ్లిష్	మొత్తం
స్కూల్ అసిస్టెంట్ (గణితం)	18	29	07	54
స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	13	06	01	20
స్కూల్ అసిస్టెంట్ (బయో సైన్స్)	42	35	10	87
స్కూల్ అసిస్టెంట్ (సోషల్)	42	41	06	89
స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)	13	11	03	27
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)	02	15	01	18
స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)	18	00	02	20
స్కూల్ అసిస్టెంట్ (హిందీ)	00	11	06	17
స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ డైరెక్టర్)	04	11	03	18
ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం	28	43	00	71
మొత్తం	180	202	39	421

ఒకే కేడర్‌లో ఉద్యోగ విరమణ

పదోన్నతుల కోసం పడిగాపులు కాస్తూ చాలామంది టీచర్లు ఒకే కేడర్‌లో ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ప్రమోషన్లు పొందకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్న వారు రూ.లక్షల్లో బెనిఫిట్లను కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో నెలనెలా వచ్చే పింఛన్ చాలా తక్కువగా ఉంటుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో టీచర్లలో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రధానంగా ఉద్యోగ విరమణకు తక్కువ కాలం ఉన్న వారు సంతోషపడుతున్నారు.

ఎందరికి వచ్చేనో..?

జిల్లాలో ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో పదోన్నతులకు సిద్ధంగా ఉన్న దాదాపు 421 పోస్టుల కోసం 2,650 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రమోషన్లకు ఎన్ని పోస్టులు చూపిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

సండే సెలబ్రిటీ



గొంతు ఒక మిషన్ కాదు..

ఈ తరం గాయనీమణులలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నవారిలో గీతా మాధురి ఒకరు. ప్రస్తుతం 'ఇండియన్ ఐడల్ సీజన్ 3'కి జడ్జీగా వ్యవహరిస్తున్నారు. గత దశాబ్దకాలంగా తెలుగువారిని తన పాటల ద్వారా, షోల ద్వారా అలరిస్తున్న గీతా మాధురితో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.

మీ గీతాల ప్రస్థానం ఎలా సాగుతోంది?

జర్నీ చాలా బావుంది. ఇప్పటిదాకా నేను సాధించిన దానికి నాకు తృప్తిగా ఉంది.

గొప్పగా వెలిగిన గాయకులు హఠాత్తుగా ఎందుకు మాయమయిపోతూ ఉంటారు?

కొందరికి వెలుగు వెలిగి ఆరిపోవటం అనేది ఉండదు. అయితే కొందరికి తప్పదు. దీనిని నేను వేరేగా ఆలోచిస్తా. ఒక కంపెనీని తీసుకోండి. దానికి ఒక ఉచ్ఛస్థితి ఉంటుంది. కొన్ని కంపెనీలు మూతపడిపోతాయి. కొన్ని కొనసాగుతూ ఉంటాయి. మరికొన్ని బోటాబోటిగా సాగుతాయి. ఇలాంటి పరిస్థితులు కంపెనీలకే కాదు గాయకులకు, నటులకు.. అందరికీ వస్తుంది. ఇక గాయకుల విషయానికి వద్దాం. అవకాశాలు రాక వదిలేశారా? వచ్చినా సరిగ్గా పాడలేకపోయారా? పరిస్థితులు అనుకూలించ లేదా? ఇలా ప్రతి వ్యక్తికీ ఒక్కో కథ ఉంటుంది. కొంతమంది వేరే కెరీర్స్‌లోకి వెళ్లిపోతారు. కొంతమంది ఇతర దేశాలకు వెళ్లిపోతారు. కొందరికి అవకాశాలు రావు. వీటన్నింటినీ ఒకే గాటన కట్టలేం. ప్రతి వ్యక్తికి ఒక వెలుగు ఉంటుంది. ఆ సమయంలోనే వారిని పిలుస్తారు.

నేను ఇంట్లో అప్పుడప్పుడు హమ్ చేస్తూ ఉంటా. ప్రాక్టీస్ చేస్తూ ఉంటా. అంతే తప్ప ఇంట్లో వాళ్లను వచ్చి 'నా పాట వినండి' అనను. నాకే చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది.

మీ కెరీర్‌లో ఎక్కువ సంతృప్తి ఇచ్చిన సంఘటన ఏదైనా ఉందా?

ఇళయరాజాగారి షోలో పాటపాడటం అనేది నాకు అత్యంత సంతృప్తి ఇచ్చిన సంఘటన అని చెప్పాలి. సుమారు 15 ఏళ్ల క్రితం అనుకుంటా. అప్పుడప్పుడే సినిమాల్లో పాడటం మొదలుపెట్టా. ఆ సమయంలో ఇళయరాజా షోలో పాడటం పాడటం అనేది నాకు అమూల్యం. నేను కలలో కూడా అది అనుకోలేదు. ఆ తర్వాత మళ్లీ కుదరలేదు. ఈ రోజు (శనివారం) హైదరాబాద్‌లో జరుగుతున్న ఇళయరాజా షోలో యాంకరింగ్ చేస్తున్నా. మధ్యలో ఒకటి రెండు అవకాశాలు వచ్చాయి. ఒకసారి నేను హైదరాబాద్‌లో లేను. వేరే దేశానికి వెళ్లాను. మరో సారి కూడా కుదరలేదు.

సోషల్ మీడియాలో నేను యాక్టివ్‌గా ఉంటాను. దీన్ని పాజిటివ్‌గానే తీసుకోవాలి. మన టాలెంట్‌ను షోకేస్ చేయటానికి పనికొస్తుంది. దానిని ఎక్కువగా వాడితే టైమ్ వేస్ట్ అనిపిస్తుంది. దానిని మనం వాడుకోవాలి తప్ప... దానికి బానిస కాకూడదు.

ఒక గాయనిగా మీకు ఎక్కువ తృప్తిని ఇచ్చే విషయం ఏమిటి?

మాకు ఎలా ఉంటుందంటే- ఒక రికార్డింగ్ పూర్తయ్యే వరకు 'సంగీత దర్శకుడికి నచ్చుతోందా? లేదా?' అనే సందిగ్ధత ఉంటుంది. 'నేను వాళ్లకు నచ్చినట్లు పాడానా? సినిమాలో ఈ పాట ఉంటుందా? లేదా?'... ఇలాంటి అనుమానాలు ఎన్నో వస్తూ ఉంటాయి. ఈ అనుమానాలు అందరిలోనూ ఉంటాయి. ఎందుకంటే మేము ఒక్క సంగీత దర్శకుడికే కాదు... అనేకమందికి పాటలు పాడతాం. షోలు చేస్తూ ఉంటాం. ప్రతి పాట, ప్రతి షో కొత్తదే! చాలా ముఖ్యమైనదే! అందువల్ల ఎప్పుడూ అలాంటి అనుమానాలు ఉంటాయి. అంతా అయిపోయిన తర్వాత చాలా ఆనందంగా ఉంటుంది. ఇదొకటి అయితే- నేను ఎప్పుడు గాయని అవుతానని అనుకోలేదు. అలాంటిది గాయని అయ్యానంటే ఇప్పటికీ ఆనందంగా అనిపిస్తుంది.

డబ్బింగ్ అనేది నాకు ప్రత్యామ్నాయ ప్రొఫెషన్ కాదు. నా గొంతు నచ్చి, బాగా ఒత్తిడి పెట్టినప్పుడు మాత్రమే డబ్బింగ్ చెప్పాను. అందుకే రెగ్యులర్‌గా డబ్బింగ్ చెప్పలేదు.

మీరు పరిశ్రమకు వచ్చే నాటికీ, ఇప్పటికీ తేడా ఏదైనా ఉందా?

ఇప్పుడు ఇంకా ఎక్కువ పోటీ ఉందనిపిస్తోంది. ఇప్పుడు సోషల్ మీడియాకు ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అప్పటికన్నా ఇప్పుడు ఎక్కువ మందికి పాటలు చేరుతున్నాయి. ఇవన్నీ కూడా 'మనం దేన్ని కోరుకుంటున్నాం?' అనే విషయంపై ఆధారపడి ఉంటాయి. సినిమాలలో పాడాలనుకొనేవారికి అదే లక్ష్యం కాబట్టి దానికొక మార్గం ఉంటుంది. పోటీ వేరేగా ఉంటుంది. పాటలు పాడి యూట్యూబ్‌లో పెట్టుకొనేవారికి పోటీ వేరేగా ఉంటుంది. అది యూట్యూబ్ కాంపిటేషన్. కానీ ఎక్కువ మంది సినిమాల్లో పాడాలనుకుంటారు.



మా పిల్లలు పుట్టినప్పుడు చాలా ఆనందించాను. నేను ఒక మంచి పాట పాడినప్పుడు చాలా ఆనందంగా అనిపిస్తుంది.

కొత్తగా వచ్చిన వారు విజయం సాధించాలంటే ఏం చేయాలి?

ఓర్పు, కష్టపడి పనిచేయటం, ఎప్పుడూ నేర్చుకోవటం. వీటన్నింటిలోను నేర్చుకోవటం ముఖ్యం. మంచి గురువు దగ్గరకు వెళ్లాలి. ఆ తర్వాత అనుభవం చాలా ముఖ్యం. ప్రతి పోటీకి వెళ్లాలి. పాడాలి. ఎన్ని డబ్బులు వస్తున్నాయని చూసుకోకూడదు. మొదటే 'పుష్ప'లో పాడేయ్యాలనుకోకూడదు. అనుభవం వస్తే ఎక్కువ కాలం నిలబడగలుగుతారు. 'కేరాఫ్ కంచరపాలెం' అనే సినిమాలో 'ఆశాపాశం...' అనే పాట అనురాగ్ కులకర్ణి పాడాడు. చిన్న సినిమా అని తను వదిలేస్తే ఆ పాట వచ్చేది కాదు కదా!

కానీ జర్నీ అంత సులభం కాదు కదా?

మన ఊహలు ఎక్కువగా ఉంటే బాధ కూడా ఎక్కువే ఉంటుంది. మనకన్నా లేని వాళ్లతో పోల్చుకుంటే ఎక్కువ నిరాశ ఉంటుంది. నేను ఎప్పుడూ నాకు లభించిన చిన్న చిన్న విషయాలకు ఎక్కువ ఆనందపడతాను. దేవుడు నాకు ఎంతో ఇస్తున్నాడు అనుకుంటా! అంతే కాదు. నేను మనందరినీ నడిపించే ఒక శక్తి ఉందని నమ్ముతా!

'జడ్జి' అని ఎవరైనా అంటే భయమేస్తుంది. కానీ ఎవరైనా పాడితే ఇంకా ఎలా మెరుగుపరుచుకోవచ్చో చెప్పటమే జడ్జి పాత్ర అని నమ్ముతా!

మీరు ఎమోషనల్ వ్యక్తా?

నేను ఎమోషనల్‌గా ఉండకూడదని ప్రయత్నిస్తాను. నా ఎమోషన్స్ ఆపుకోను. కాను వీలైనంత వరకు బ్యాలెన్స్‌గా ఉండటానికి ప్రయత్నిస్తాను.

మీరు పాడలేని పాటలేవైనా ఉన్నాయా?

కొన్ని పాడక వచ్చేసిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు చాలా సులభమైన పాటలు కూడా పాడలేని పరిస్థితులు ఉన్నాయి. కానీ ఇక్కడో విషయం చెప్పాలి. ఇది మూడ్‌కు సంబంధించిన విషయం. గొంతు అనేది మిషన్ కాదు. ఒకో రోజు ఒకేలా ఉంటుంది. గొంతు అనేది మన చేతుల్లో ఉండదు.

మీకు నచ్చిన గాయకులు ఎవరు?

బాలుగారు, చిత్రగారు, శ్రేయ ఘోషల్, సునీతగారు నాకు చాలా ఇష్టం.

మీ గొంతులో ఉన్న స్పెషాలిటీ ఏమిటి?

నేను కెరీర్ మొదలుపెట్టినప్పుడు నా గొంతు భిన్నంగా ఉందని అందరూ అనేవారు. పదిమందిలో పాడినా నా గొంతు అందరికీ వినిపిస్తుంది. అందుకే నాకు పాటలు వచ్చాయని అనుకుంటున్నా. ఇప్పుడు భిన్నంగా పాడేవాళ్లే వస్తున్నారు. అందువల్ల ఇప్పుడు సాధారణమైపోయింది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్



అలనాటి కథ

దాశరథి.. శ్రీశ్రీ.. విశ్వనాథ..!

ఒకప్పుడు జ్ఞాన్‌భాగ్ తెలుగు, ఉర్దూ, హిందీ, పర్షియన్ కవులకు నిలయంగా ఉండేది. అనేక మంది కవులు వస్తూ పోతూ ఉండేవారు. నితరం కవి సమ్మేళనాలు జరిగేవి. ఇలాంటి సమ్మేళనాల నేపథ్యంలో తెలుగులో గొప్ప కవులైన దాశరథి, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ వంటి కవులను కలిశాను. ఈ ఏడాది దాశరథి శతజయంతి ఉత్సవాలు జరుపుతున్నారు. ఆయనతో నాకు మంచి స్నేహం ఉండేది.

ఈ కాలమ్ రాసే ముందు నేను ఒక విషయాన్ని అందరి ముందూ ఒప్పుకోవాలి. నాకు తెలుగు చదవటం, రాయటం రాదు. కానీ దానిలో ఉన్న మాధుర్యాన్ని ఆస్వాదించగలను. శేషేంద్ర నాకు చాలాసార్లు తెలుగు లిపి నేర్పించటానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. తెలుగు అక్షరాలలో ఉండే ఒంపులను నేను ఒడిసి పట్టుకోలేకపోయా! తొలి తెలుగు రచయితల సమావేశాలు (తెలుగు విశ్వ సమ్మేళనం) హైదరాబాద్‌లోని ఆంధ్ర మహాసభ భవనంలో జరిగాయి. దీనికి తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ కవులందరూ హాజరయ్యారు. అరిపరాల విశ్వం, ఆరుద్ర, సి.నారాయణరెడ్డి, ఎల్లోరా, అజంతా, శ్రీశ్రీ, దాశరథి... ఇలా సంజీవయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మహామహులు వచ్చారు. నేను ఉపాధ్యక్షురాలిని. "తెలుగు భాషను గుర్తించలేని దానివి... నువ్వు ఆ సమావేశాలకు ఎందుకు వెళ్తున్నావు?" అని నా స్నేహితులు ఆట పట్టించారు. "నేను ఈ ప్రాంతానికి చెందినదాన్ని. ఇక్కడ ఇంత పెద్ద సభలు అవుతుంటే నేనేందుకు వెళ్లకూడదు" అని వాళ్లకు సమాధానమిచ్చా. నేను ఒక



సెషన్‌కు అధ్యక్షురాలిని. సాధారణంగా తెలుగు సమావేశాలంటే అందరూ తెలుగులోనే మాట్లాడతారనుకుంటాం కదా! తెలుగులో మాట్లాడలేక పోయినందుకు నేను కొంత ఇబ్బంది పడ్డా. కానీ అదే సెషన్‌లో శేషేంద్ర తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషులో ప్రసంగించాడు. బహుశా నా గురించే ఇంగ్లీషులో ప్రసంగించాడని అనుకున్నా. ఆ సమావేశాలలో పాల్గొనటానికి కొందరు అతిథులు మారిషస్ నుంచి వచ్చారు. వారిలో కొందరు జ్ఞాన్‌భాగ్‌లోనే ఉంటున్నారు. అందువల్ల వారందరి కోసం ఆ రోజు రాత్రి ఒక కవితా గోష్ఠి ఏర్పాటు చేశాను. ఆ మర్నాడు జరిగిన సమావేశాల్లో తొలిసారి నేను దాశరథిని కలిశాను. ఆ పరిచయం ఆ తర్వాతి కాలంలో స్నేహంగా మారింది. ఈ సమావేశాల తర్వాత నేను ఊటీ వెళ్లిపోయాను.

ఊటీ నుంచి వచ్చిన తర్వాత కొందరు ఉర్దూ రచయితలు నా దగ్గరకు వచ్చి... "శ్రీశ్రీని కలవాలనుకుంటున్నాం. సమావేశం ఏర్పాటు చేస్తారా" అని అడిగారు. తమాషా ఏమిటంటే... నేను అప్పటిదాకా ఎప్పుడూ శ్రీశ్రీని కలవలేదు. కానీ ఆయన గురించి అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ఉర్దూ రచయిత ముక్దుం మోయినుద్దీన్ ద్వారా విన్నా. ముక్దుంతో మా నాన్న ధన్‌రాజ్‌గిర్‌కు మంచి స్నేహం ఉండేది. రోజూ ఆయన మా ఇంటికి వచ్చేవారు. ఒక రోజు ముక్దుం నాకు ఒక

విశ్వనాథ వారి శిష్యులు కొందరు శేషేంద్రతో నా వివాహంపై విమర్శలు కురిపించటం మొదలుపెట్టారు. ఈ సమయంలోనే విశ్వనాథ వారికి 'జ్ఞానపీఠ్' పురస్కారం వచ్చింది. ఆయన ఢిల్లీ వెళ్తున్నప్పుడు ఎవరో నా వివాహ ప్రస్తావన తెచ్చారట. అప్పుడు ఆయన... "తప్పేముంది. ఆమె కూడా మన తెలుగు అమ్మాయేగా" అన్నారట.

ఇంగ్లీషు కవితల పుస్తకం ఇచ్చి... "దీని పేరు 'త్రీ చీర్స్ ఫర్ ఏ మ్యాన్'. ఇది తెలుగు కవితలకు అనువాదం. ఇతను చాలా గొప్పగా రాస్తున్నాడు. నువ్వు కూడా చదువు" అన్నారు. ఆ సమయంలో మా తరం వారందరం ప్రోగ్రెసివ్ రచయితల ప్రభావంలో ఉండేవాళ్లం. మిగిలినవారి పట్ల పెద్ద గౌరవం ఉండేది కాదు. అయినా శ్రీశ్రీ కవితల అనువాదాన్ని చదివాను. చాలా బావున్నాయనిపించింది. కానీ శ్రీశ్రీని కలిసే అవకాశం దొరకలేదు. అయితే ఉర్దూ రచయితల



కోరికవల్ల ఆ అవకాశం చిక్కింది. శ్రీశ్రీని శేషేంద్ర ఒక రోజు జ్ఞాన్‌బాగ్‌కు పిలిచాడు. ఆ రోజు ఉర్దూ పత్రిక 'సియాసత్' ఎడిటర్‌ను కూడా పిలిచిన జ్ఞాపకం. శ్రీశ్రీని శేషేంద్ర వెళ్లి కారులో జ్ఞాన్‌బాగ్‌కు తీసుకువచ్చాడు. ఆ రోజంతా చాలా ఉత్సాహంగా సాగింది. శ్రీశ్రీతో అలా ప్రారంభమయిన నా పరిచయం చాలా కాలం కొనసాగింది.

ఇక నేను మరచిపోలేని మరో మహాకవి విశ్వనాథ సత్యన్నారాయణ. ఒకసారి రవీంద్రభారతి కవి సమ్మేళనంలో ఆయన్ను చూశాను. ఆ సమ్మేళన నిర్వాహకులు ఇద్దరు... ఆయనను స్టేజీ మీద కూర్చోబెట్టారు. నేను ముందు వరసలోనే ఉన్నా. ఆయన సభలో ఉన్నవారందరినీ నిశితంగా పరిశీలించారు. ఆ తర్వాత ఉపన్యాసం ప్రారంభించారు. అదొక గంగా ప్రవాహంలా సాగిపోయింది. ఆయనను నేను తొలిసారి చూసింది అప్పుడే. సభ పూర్తయిన తర్వాత తిరిగి వెళ్తుంటే... ఆయనకు నమస్కారం చేశా. విశ్వనాథ తల పంకించి వెళ్లిపోయారు. ఆ తర్వాత శేషేంద్రతో నా వివాహం జరిగింది. ఇది ఆ సమయంలో పెద్ద సంచలనం సృష్టించింది. విశ్వనాథ వారి శిష్యులు కొందరు ఈ వివాహంపై విమర్శలు కురిపించటం మొదలుపెట్టారు. ఈ సమయంలోనే విశ్వనాథ వారికి 'జ్ఞానపీఠ్' పురస్కారం వచ్చింది. ఆయన ఢిల్లీ వెళ్తున్నప్పుడు ఎవరో నా వివాహ ప్రస్తావన తెచ్చారట. అప్పుడు ఆయన... "తప్పేముంది. ఆమె కూడా మన తెలుగు అమ్మాయేగా" అన్నారట. ఆ తర్వాత విమర్శలన్నీ ఆగిపోయాయి. విశ్వనాథ వారికి జ్ఞానపీఠ్ వచ్చిన తర్వాత... ఆయనను జ్ఞాన్‌భాగ్‌కు ఆహ్వానించాం. మా మ్యూజిక్ రూమ్‌లో అనేకమంది అతిథుల ముందు ఆయన 'శాకుంతలం' చదివారు. ఆయన వాగ్ధాటికి అక్కడి వారందరూ ముగ్ధులయ్యారు. ఇలా రకరకాల సందర్భాలలో నాకు తెలుగు కవులను కలిసే అవకాశం చిక్కింది.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

చర్మం మర్మం

చిట్కాలు అన్ని సమయాల్లో ఫలితాన్నివ్వవు. పైగా కొన్నిసార్లు వికటిస్తాయి కూడా! మరీ ముఖ్యంగా చర్మ సౌందర్యం కోసం అనుసరించే చిట్కాల పట్ల రెట్టింపు అప్రమత్తంగా ఉండాలి. చర్మానికి హానిని కలుగజేసే కొన్ని సాధారణ చిట్కాల గురించి తెలుసుకుందాం!

సోషల్ మీడియాలో చర్మ సౌందర్యాన్ని పెంచే ఎన్నో రకాల చిట్కాలు అందరికీ అందుబాటులో ఉంటున్నాయి. అయితే వాటి ప్రామాణికతలను తెలుసుకోకుండా, అనుసరిస్తే చర్మం పాడయ్యే ప్రమాదం ఉంటుంది. చర్మం సున్నితమైన అవయవం కాబట్టి, తోచిన చిట్కా అనుసరించడం ప్రమాదకరం. మరీ ముఖ్యంగా ముఖ చర్మపు మెరుపు కోసం, తెల్లదనం కోసం చర్మపు తత్వంతో సంబంధం లేకుండా తోచిన పదార్థాలను పూసుకోవడం కరెక్టు కాదు. కొన్ని పదార్థాలు ముఖ చర్మానికి నేరుగా పూసుకోవడం వల్ల ఊహించని స్థాయిలో నష్టం జరగవచ్చు.

నిమ్మరసం నేరుగా పూసుకోకూడదు

చర్మ సౌందర్యాన్ని పెంచే ఉత్పత్తుల్లో నిమ్మరసం ప్రధానమైనది. ఎన్నో రకాల సౌందర్య సాధనాల్లో నిమ్మ కచ్చితంగా ఉంటూ ఉంటుంది. విటమిన్ సిని కలిగి ఉండే నిమ్మరసానికి చర్మపు మెరుపును పెంచే స్వభావం ఉన్నా, నేరుగా చర్మానికి పూసుకోకూడదు. నిమ్మరసంలోని సిట్రిక్ యాసిడ్ చర్మాన్ని కందిపోయేలా చేస్తుంది. పొడిచర్మ తత్వం ఉన్నవాళ్ల చర్మం పగులుతుంది.



మొటిమలకు టూత్‌పేస్ట్ వద్దు

టూత్‌పేస్ట్ తయారీలో ఎన్నో రకాల రసాయనాలను ఉపయోగిస్తారు. దంతాలను శుభ్రం చేయడం కోసం ఉద్దేశించిన టూత్‌పేస్ట్‌ను మొటిమల మీద పూసుకోవడం సరి కాదు. టూత్‌పేస్ట్‌లో ఫ్లోరైడ్, మెంథాల్, గరుకుగా ఉండే పదార్థాలు ఉంటాయి. వీటి వల్ల చర్మం మీద దద్దుర్లు, అలర్జీలు రావచ్చు. టూత్‌పేస్ట్‌లోని ఆల్కహాల్‌తో చర్మంలోని సహజసిద్ధ నూనెలు తగ్గిపోయి, చర్మం పొడిబారిపోవచ్చు. కాబట్టి మొటిమల సమస్యను వైద్యంతోనే చక్కదిద్దుకోవాలి.

చక్కెర, ఉప్పు స్క్రబ్బర్స్ కావు

మృత కణాలను తొలగించుకోవడం కోసం చక్కెర, లేదా ఉప్పులతో చర్మాన్ని రుద్దుకోకూడదు. ఎక్స్‌ఫోలియేషన్ కోసం వీటిని ఉపయోగిస్తే, చర్మం పగిలి, ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతాయి. చర్మం ఎర్రబారి, పొట్టు తేలి, దద్దుర్లు, దురదలు మొదలవుతాయి. కాబట్టి ఎక్స్‌ఫోలియేషన్ కోసం ఉద్దేశించిన స్క్రబ్బర్స్ మాత్రమే ఉపయోగించాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో...

సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/p2lg8zNలో చదవండి.

మోడల్, నటి, నిర్మాత... నేహా ధూపియా. పెళ్లయ్యాక కుటుంబ జీవితంతో పాటు మోడల్‌గానూ రాణిస్తోంది. సినిమాలు తక్కువైనా రియాలిటీ షోస్‌తో లైమ్‌లైట్‌లో ఉంది. 'నోఫిల్టర్ నేహా'తో అప్‌డేట్ అయిన నేహా ధూపియా గురించి కొన్ని విశేషాలు ఇవే...

సినిమానే నా ఫస్ట్ లవ్!

ఎనిమిదేళ్ల నుంచి 'నో ఫిల్టర్ నేహా' పాడ్‌కాస్ట్ నిర్వహిస్తోంది నేహా ధూపియా. ఇప్పటికి ఆరు సీజన్లు పూర్తి చేసుకుంది. తన స్నేహితురాలు కరీనా కపూర్‌నుంచి, కత్రినా కైఫ్, రణ్‌బీర్ కపూర్, షాహిద్ కపూర్, తాప్సీ, రష్మిక మందన్నా.. ఇలా స్టార్లతో ఆమె నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లన్నీ దాదాపు సూపర్ హిట్టే. దాదాపు బాలీవుడ్ స్టార్లందరినీ తన పాడ్‌కాస్ట్‌లకు ఆహ్వానించింది. 'నటిగా, మోడల్‌గా, పాడ్ కాస్ట్ హోస్ట్‌గా, టెలివిజన్ హోస్ట్‌గా పని చేస్తుంటే.. మల్టీటాస్క్ మానుకో. అంత టెన్షన్ ఎందుకూ?' అంటుంటారు మిత్రులు. అయితే నాకు ఇదో సరదా. ఇష్టం.. అంటుంది నేహా ధూపియా. 'చాలామంది ఇష్టమైన షో ఏదీ? అని అడుగుతారు. నేను సమాధానం చెప్పటం కష్టం. అయితే మొదటి పాడ్‌కాస్ట్ కరణ్ జోహార్‌తో చేశా. ఇదే బాగా గుర్తుండే ఎపిసోడ్' అంటుంది నేహా ధూపియా.

ఎంతో గర్వంగా ఫీలయ్యా...

'నో ఫిల్టర్ నేహా' పాడ్‌కాస్ట్‌లకు ఆమే నిర్మాత. ఆరో సీజన్‌లో పాడ్‌కాస్ట్ వీడియో రూపంలో వచ్చింది. 'ప్రేక్షకుల ఆదరణ అద్భుతంగా ఉంది. హోస్ట్‌గా, నిర్మాతగా వ్యవహరించినందుకు గర్వంగా' ఉందని చెప్పుకుంటుంది నేహా. వాస్తవానికి ఆమె జర్నలిస్ట్ కాదు. అయితే హీరోయిన్ కావటం.. ఆమె అడిగే ప్రశ్నల విధానం వల్ల సెలబ్రిటీస్ అన్‌ఫిల్టర్ విషయాలనూ చెప్పుకొచ్చారు. అందుకే ఈ షో నిలబడింది. అన్నట్లు తన ప్రొడక్షన్ పేరు 'బిగ్ గర్ల్ ప్రొడక్షన్'. నేహా ధూపియా తండ్రి.. 'నీకేం బిగ్ గర్ల్ ఉండగా.. బెంగ ఎందుకూ?' అంటుంటాడట. 'నా బిగ్ గర్ల్ వల్ల నాలో హార్డ్‌వర్క్ అలవడింది. 'నాకు రూమర్లు వినటం ఇష్టం ఉండదు. జనాలకు ఇవే ఇష్టం. నేను అలాంటివి అడగలేను. అయినా వారితో సీక్రెట్స్ చెప్పించా. ఇకపోతే ఒక మనిషి నా ఎదురుగా మాట్లాడుతుంటే వారి మీద జోకులు వేయటం.. తక్కువ చేయటం చేయలేదు. ఇదే నా సక్సెస్' అంటుందీమె. అన్నట్లు కరోనా సమయంలో ఇద్దరు పిల్లలతో.. ఈ పాడ్‌కాస్ట్‌నూ విజయవంతంగా నిర్వహించింది.

సోషల్‌మీడియా ట్రోల్స్ పట్టించుకోను. నా పని చేస్కుంటూ వెళ్తుంటా. అయితే నా పేరెంట్స్, భర్త దగ్గరకు ట్రోల్స్ వచ్చినపుడు కోపం వస్తుంది. ఏదేమైనా సెలబ్రిటీలం కాబట్టి ఏదోటి అంటుంటారు. ఆన్‌లైన్ నెగటివిటీ ఉంటుంది. దాన్ని పెద్దగా పట్టించుకోను. అందుకే ప్రశాంతంగా ఉంటాను.

అలా అబద్ధం చెప్పను..

నేహా పంజాబీ సిక్ కుటుంబానికి చెందిన వ్యక్తి. తన తండ్రి నేవీలో పని చేశారు. కొచ్చిలో ఆమె పుట్టింది. విద్యాభ్యాసం కొచ్చిలో కొన్నాళ్లు జరిగింది. ఆ తర్వాత ఢిల్లీలో చదివింది. కాలేజీ రోజుల్లో మోడలింగ్ చేసింది. కొన్ని మ్యూజిక్ వీడియోలు చేసింది. దీంతో నేహా ధూపియా 2000 సంవత్సరంలో నటిగా అవకాశం చేజిక్కించుకుంది. అది ఇండో-జపనీస్ ప్రాజెక్ట్. అలా ఆమె ఇరవయ్యేళ్ల వయసులో సినిమాకోసం పలు దేశాలు తిరిగింది. 'జూలీ', 'షీసా', 'షూటవుట్ లోఖండ్ వాలా', 'మిథ్య', 'సింగ్ ఈజ్ కింగ్' లాంటి చిత్రాలతో పాటు చిన్నపాత్రల్లోనూ నటించింది. 2022లో 'ఎ థర్స్‌డే' చిత్రంలో ఏసీపీ పాత్రలో నటించింది. 'నాకోసం కథలు తయారు చేస్తున్నారు. నాకోసమే స్క్రిప్టు రాస్తారు అని చెబితే అది అబద్ధం అవుతుంది. నా పని నేను చేసుకుంటున్నా. ప్రొడ్యూసర్‌గా నా మార్గం నేను ఎంచుకున్నా. నా దగ్గరకు వచ్చిన పాత్రలు బావుంటేనే అంగీకరిస్తున్నా. కుటుంబం, నా బిగ్ గర్ల్ ప్రొడక్షన్ పనులతో సరిపోతోంది. ఏదేమైనా సినిమా అంటేనే నాకు ప్రేమ. సినిమానే నా ఫస్ట్ లవ్.



సినీరంగంలోనూ రామోజీ రావుది ప్రత్యేక ముద్ర

పత్రికారంగంలోనే కాదు చిత్రనిర్మాణ రంగంలోకి ప్రవేశించి తనదైన ముద్ర వేశారు రామోజీరావు. 'ఈ ఉషాకిరణాలు.. తిమిర సంహరణాలు' అంటూ ఆణిముత్యాల వంటి సినిమాలను అందించారు. స్టార్స్ వెంట పరిగెత్తకుండా కథకు, కళకు ప్రాధాన్యం ఇస్తూ ఆయన నిర్మించిన పలు సినిమాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. 'శ్రీవారికి ప్రేమలేఖ' పేరుతో తొలిసారిగా కామెడీ ఎంటర్‌టైనర్‌ను అందించినా ఆ తర్వాత ఆయన మనసుని హత్తుకొనే కథలతో చిత్రాలు నిర్మించారు. వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించి, ఎందరో ప్రతిభావంతులకు అవకాశాలు కల్పించారు. సినిమా నిర్మాణం వ్యాపారంగా ఆయన ఎప్పుడూ చూడలేదు. యథార్థ కథలను ఎన్నుకుని స్ఫూర్తివంతమైన చిత్రాలు నిర్మించారు.

నిర్మాతగా ఎందుకు మారారంటే..

అక్షర యోధుడిగా పేరు తెచ్చుకున్న రామోజీరావు నిర్మాతగా మారడానికి వెనుక ఓ ఆసక్తికరమైన కారణం ఉంది. అదేమింటే..





1976లో 'సితార' సినీ వార పత్రికను ప్రారంభించిన ఆయన ప్రతి ఏటా ఉత్తమ చిత్రాలను, ప్రతిభ ప్రదర్శించిన కళాకారులను ఎంపిక చేసి 'సితార' అవార్డులతో సత్కరించేవారు. ఎంతో ఘనంగా జరిగే ఈ అవార్డు వేడుకకి చిత్ర పరిశ్రమ యావత్తు హాజరయ్యేది. ఆ రోజుల్లో సితార అవార్డు అందుకోవడం ఒక గౌరవంగా భావించేవారు సినీ కళాకారులు. ఇలా మూడేళ్ల పాటు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి అవార్డుల వేడుకలు నిర్వహించే వారు రామోజీరావు. ఇలా అవార్డు వేడుకలు కాకుండా మీరే నిర్మాతగా మారి సినిమాలు తీయవచ్చు కదా అని సినీ ప్రముఖులు చెప్పిన మాటతో ఉత్తేజం పొందిన



రామోజీరావు చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టారు.

పంపిణీరంగంలోనూ..

తను తీసే సినిమాలను ప్రేక్షకులకు అందించడానికి సరైన పంపిణీదారుడు కావాలని గుర్తించిన రామోజీరావు ఆ రంగంలోకి కూడా ప్రవేశించారు. మయూరి పేరుతో ఆయన ఏర్పాటు చేసిన పంపిణీ సంస్థ ఉషాకిరణ్ మూవీస్ చిత్రాలనే కాదు బయటి సినిమాలనూ పంపిణీ చేసింది. అలాగే 'మయూరి' పేరుతో ఆడియో సంస్థను కూడా నెలకొల్పి ఆడియో రంగంలోనూ రాణించారు రామోజీరావు.

తన పేరుతో ఫిల్మ్ సిటీ

అంతవరకూ ఏ సంస్థకూ తన పేరు పెట్టుకోని రామోజీరావు తొలిసారిగా 'రామోజీ ఫిల్మ్ సిటీ' అంటూ తన పేరుతో ఓ సినీ నగరాన్ని నిర్మించి అభిరుచిని చాటుకున్నారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ ఫిల్మ్ సిటిలో వివిధ భాషల షూటింగ్స్‌కు నిలయంగా మారింది.

నందమూరి హీరోల పరిచయం

స్వర్గీయ నందమూరి తారకరామారావు మనవడు జూనియర్ ఎన్టీఆర్‌ను 'నిన్ను చూడాలని' చిత్రంతో హీరోగా 2001లో పరిచయం చేశారు రామోజీరావు. అలాగే నందమూరి కల్యాణ్‌రామ్‌ను కూడా 2003లో 'తొలి చూపులోనే' చిత్రంతో హీరోగా పరిచయం చేశారు రామోజీరావు. నందమూరి హరికృష్ణ తనయులైన వీరిద్దరూ ఇప్పుడు చిత్ర పరిశ్రమలో అగ్రస్థానంలో ఉన్నారు. అలాగే దర్శకుడు రాఘవేంద్రరావు తనయుడు ప్రకాశ్‌ను కూడా 'నీతో' సినిమాతో హీరోగా పరిచయం చేశారు. శ్రీకాంత్, తరుణ్, వినోద్‌కుమార్ కూడా ఉషాకిరణ్ మూవీస్ చిత్రాల ద్వారానే హీరోలుగా పరిచయమయ్యారు.

వేటూరి మాట.. బాలు పాట

సాధారణంగా ప్రతి సినిమా బ్యానర్ లోగోకు ఓ సిగ్నేచర్ మ్యూజిక్ ఉంటుంది. కానీ నలుగురి కంటే భిన్నంగా ఆలోచించే రామోజీరావు వేటూరితో 'ఈ ఉషాకిరణాలు.. తిమిర సంహరణాలు' అంటూ లోగో సాంగ్‌ను రాయించి, బాలుతో పాడించారు. అందుకే రామోజీరావు చిత్రాలలాగానే ఆయన బ్యానర్ లోగో సిగ్నేచర్ ట్యూన్ కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోయింది. 'శ్రీవారికి ప్రేమలేఖ' చిత్రంతో మొదలైన రామోజీరావు సినీ ప్రయాణంలో ఎన్నో అద్భుత చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ప్రమాదంలో కాలు పోగొట్టుకుని, కృత్రిమ పాదంతో నాట్యంలో రాణించిన సుధాచంద్రన్ జీవిత కథనే 'మయూరి' చిత్రంగా మలిచారు. ఇందులో సుధాచంద్రనే నటించడం గమనార్హం. అలాగే రౌడీయిజం, గుండాయిజంపై తిరగబడిన ఓ యువతి స్ఫూర్తివంతమైన కథతో 'ప్రతిఘటన' చిత్రాన్నీ, ఒడిశాలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా 'మౌన పోరాటం' చిత్రాన్ని, పరుగుల రాణి అశ్వనీ నాచప్పను నటిగా పరిచయం చేస్తూ 'అశ్వని' చిత్రాన్ని నిర్మించి తన ప్రత్యేకత చాటుకున్నారు రామోజీరావు. వీటితో పాటు 'నువ్వే కావాలి', 'నచ్చావులే', 'నువ్విలా' వంటి యూత్‌ఫుల్ సినిమాలనూ రూపొందించి అన్ని రకాల ప్రేక్షకులను మెప్పించారు రామోజీరావు.

నటుడిగా ఓ చిత్రంలో



సినిమా అంటే ఆసక్తి కలిగిన రామోజీరావు 1978లో వచ్చిన 'మార్పు' చిత్రంలో న్యాయ మూర్తిగా అతిథి పాత్రను పోషించారు. యు.విశ్వేశ్వరరావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రంలో రామోజీరావుది చిన్న పాత్రే. అయినా పత్రికాధిపతిగా ఆయనకి ఉన్న ఇమేజ్ వల్ల సినిమా పోస్టర్స్‌లో ఆయన ఫొటోను కూడా ప్రముఖంగా వాడారు.

నేడు షూటింగ్స్ బంద్

రామోజీ రావు మృతికి సంతాపం ప్రకటిస్తూ తెలుగు చిత్ర సీమ ఆదివారం జరిగే సినిమా షూటింగులన్నింటిని కాన్సిల్ చేసింది. ఈ మేరకు తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఓ ప్రకటనను విడుదల చేసింది.

నవ్య 'దృశ్యం' పేజీలోని మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xLSylxl లో చదవండి.



కోకా కోలా గ్రూప్ డైరెక్టర్ జోనథన్ రీఫ్‌తో శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి

పెద్దపల్లిలో కోకా కోలా పరిశ్రమ

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అంతర్జాతీయ శీతల పానీయాల కంపెనీ కోకా కోలా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులకు సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్రంలో ఆ కంపెనీ ప్లాంట్ ఉండగా.. విస్తరణలో భాగంగా పెద్దపల్లిలో రూ.700 కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం కోకా కోలా గ్రూప్ డైరెక్టర్ జోనథన్ రీఫ్‌తో అట్లాంటాలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పరిశ్రమలు పెట్టాలని కంపెనీని ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన జోనథన్.. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. విస్తరణలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కంపెనీ తెలిపిందని సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు ఎక్స్‌లో ప్రకటించారు.

21 మందికి నీట్‌లో 720/720 మార్కులు

- ఆకాశ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ సీఈవో దీపక్ మెహరోత్రా

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నీట్ (యూజీ) ఫలితాల్లో తమ విద్యార్థులు ఘన విజయాలను సాధించారని ఆకాశ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ తెలిపింది. తమ విద్యార్థులు 21మంది 720/720 మార్కులతో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించారని సంస్థ ఎండీ, సీఈవో దీపక్ మెహరోత్రా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో తరగతిలో శిక్షణ పొందిన విద్యార్థులు 14 మంది ఉన్నారని పేర్కొన్నారు. మ్రిదుల్ మాన్య ఆనంద్ (ఢిల్లీ), ఆయుష్ నౌగ్రయ్యా (ఝాన్సీ), అక్షత్ పంగారియా(హల్ద్వానీ), ఆదిత్య కుమార్(చెన్నై), అర్ఘ్యదీప్ దత్తా(కోల్‌కతా), సక్షం అగర్వాల్ (సిలిగురి), సుజయ్ దత్తా(ఢిల్లీ), ఆర్యన్‌యాదవ్(లఖ్‌నవ్), మానవ్ ప్రియదర్శి(రాంచీ), పాలన్షా అగర్వాల్(ముంబై), ధ్రువ్‌గార్గ్, సమిత్ కుమార్ సైనీ, ఇరమ్ ఖాజీ(జైపూర్), క్రితి శర్మ(సూరత్) తరగతిలో శిక్షణ పొందారని ఆయన వివరించారు. తమ సంస్థ ద్వారా డిస్టెన్స్ లెర్నింగ్‌లో శిక్షణ పొందిన ఏడుగురు విద్యార్థులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. తమ టాప్ ర్యాంకర్లుగా నిలవడంపై దీపక్ మెహరోత్రా హర్షం వ్యక్తం చేశారు.

మోదీ గ్యారెంటీకి వారంటీ ఖతం

- యూపీలో ఓటమికి ఆయన రాజీనామా చేయాలి
- లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ బాధ్యతలు తీసుకోవాలని ప్రజల కోరిక
- 3 ఎంపీ సీట్లుంటే.. ఇప్పుడు 8 గెలిచాం
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ మోదీ గ్యారెంటీతో వెళ్లిందని, కానీ ఫలితాల తీరుతో ఆ గ్యారెంటీకి వారంటీ ఖతమైందని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న యూపీలో బీజేపీ ఓటమికి బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో మోదీ సర్కారు యువత, రైతులను వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. శనివారం ఢిల్లీలోని అశోకాహోటల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వారాణసీలో ప్రధాని మోదీకి మెజారిటీ తగ్గిందన్నారు. లోక్‌సభలో మోదీ సర్కారును నిలదీసేందుకు ప్రతిపక్ష నేతగా రాహుల్ బాధ్యతలు తీసుకోవాలని దేశంలోని 140 కోట్ల ప్రజలతో పాటు కాంగ్రెస్ కోరుకుంటోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు 3 ఎంపీలుంటే ఈ ఎన్నికల్లో 8 స్థానాల్లో గెలిచినట్లు చెప్పారు. 64 మంది ఎమ్మెల్యేలకు తోడు కొత్తగా కంటోన్మెంట్ స్థానాన్ని గెలుచుకున్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 శాతం ఓట్లు తమ పార్టీకి రాగా, లోక్‌సభ ఎన్నికల్లో 41 శాతం ఓట్లు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

సోనియాతో రేవంత్ భేటీ

కాంగ్రెస్ అగ్రనేత సోనియాతో సీఎం రేవంత్ ఆమె నివాసంలో ఉదయం సమావేశమయ్యారు. సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో సోనియాతో పలు విషయాలు చర్చించారు. పీసీసీ అధ్యక్ష పదవి, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరు, ఫలితాలపై వివరించినట్లు తెలిసింది. తెలంగాణ తల్లి ఉత్సవాలు, అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఓటు బ్యాంకు పెరగడం, బీజేపీ గెలిచిన 8 సీట్లలో 7 చోట్ల బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోవడం, బీజేపీకి బీఆర్ఎస్ లోపాయికారిగా సహకారం అందించిందని ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. అనంతరం సోనియా నివాసం నుంచి నేరుగా సీడబ్ల్యూసీ భేటీకి వెళ్లారు. కాగా, సాయంత్రం సీఎం రేవంత్‌ను పార్టీ ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి, బలరాంనాయక్, మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

తుగ్లక్ రోడ్ 23 నివాసానికి రేవంత్..

తుగ్లక్ రోడ్‌లోని 23 నివాసానికి సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా మారారు. సీఎం శుక్రవారం రాత్రి తుగ్లక్ రోడ్‌లోనే బస చేశారు. సీఎం రేవంత్ భార్య, కుమార్తె, అల్లుడు విడిగా శుక్రవారం ఢిల్లీ వచ్చి ఆ ఇంట్లోనే విడిది చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన రేవంత్‌కు కేంద్రం యమునా బ్లాక్‌లోని 9వ ఫ్లోర్‌లోని ఫ్లాట్‌ను కేటాయించగా సీఎం అయిన తర్వాత కూడా అక్కడే ఉన్నారు. అయితే తుగ్లక్ రోడ్ 23 నివాసానికి ఇటీవల చేపట్టిన చిన్నపాటి మరమ్మతులు పూర్తవడంతో సీఎం అధికారికంగా ఇక నుంచి అక్కడే బస చేయనున్నారు. కాగా, 2004 నుంచి తుగ్లక్ రోడ్‌లోని నివాసంలో కేసీఆర్ దాదాపు 20 ఏళ్లున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, సీఎం పదవి నుంచి దిగిపోవడంతో కేసీఆర్ ఆ ఇంటిని ఖాళీ చేశారు.

తీన్మార్ మల్లన్నకు సీఎం శుభాకాంక్షలు..

ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచిన తీన్మార్ మల్లన్నకు సీఎం శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆయన గెలుపు కోసం కృషి చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలను అభినందించారు.





ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో రేవంత్; సీఎం రేవంత్‌ను కలిసిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు

ఆరోగ్యశ్రీలోకి యాంజియోగ్రామ్

- కొత్తగా 65 చికిత్స విధానాలకు ఆమోదం
- ఆయుష్మాన్ భారత్‌లోని 98 చికిత్సలు కూడా

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్తగా పలు చికిత్సలను చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యాంజియోగ్రామ్, పార్కిన్‌సన్, వెన్నెముక సర్జరీ సహా 65 చికిత్స విధానాలతోపాటు ఆయుష్మాన్ భారత్ పరిధిలోని 98 చికిత్స విధానాలను ఆరోగ్య శ్రీ జాబితాలో చేర్చింది. అలాగే, ప్రస్తుతం అమల్లో ఉన్న చికిత్సల ప్యాకేజీ ధరలను పెంచింది. ఇందుకోసం అదనంగా రూ.497.29కోట్లు అవసరం కాగా, శనివారమే ఆ నిధులను విడుదల చేసింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్త చికిత్సా విధానాల చేర్పు, ప్రస్తుతం ఉన్న ప్రొసీజర్స్ ప్యాకేజీల ధరల పెంపు అంశంపై ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో అన్ని అంశాలపై చర్చించిన భట్టి విక్రమార్క.. కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం(2007)లో ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది. పేద ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ఈ పథకం కింద 2.84కోట్ల మంది లబ్ధిదారులు ఉండగా, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిమితిని రూ.10లక్షల దాకా పెంచారు. ఆరోగ్యశ్రీ పరిధిలో మొత్తం 1402 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా, మొత్తం 1672 చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 1375 చికిత్సా విధానాలకు ప్యాకేజీ ధరలను పెంచాలన్న వైద్య నిపుణులు సూచన మేరకు కాంగ్రెస్ సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో యాంజియోగ్రామ్ సహా 65 అధునాతన చికిత్స విధానాలను ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్న 98 చికిత్సా విధానాలు ఆరోగ్యశ్రీలో చేర్చింది. ఆయుష్మాన్ పరిధిలోని చికిత్సలను చేర్చినందుకు రూ.189 కోట్లు, కొత్తగా చేర్చిన 65 చికిత్సా విధానాలతో రూ.158.20 కోట్ల మేర అదనపు భారం పడుతుందని సర్కారు వెల్లడించింది.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల అస్తి పట్టింపు లేదు / చౌదరి / 42y / 5'6" /2nd మ్యారేజ్ /Cardiology మంచి స్థిరాస్తులు కలిగిన అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9985092978 AJH-02399

★ 58y / రెండవ పెళ్లి / విడో/ Fair / Govt. ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు రెంట్స్ /పిల్లలు లేరు / ఏలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల,ఆస్తి పట్టింపు లేదు). ఫోన్:7995376608 AJH-002410

★ కుల పట్టింపు లేదు / విడో/ బ్యాంక్ లో VRS / సొంత బిజినెస్ / సొంత ఇల్లు రెంట్స్, పొలాలు / వెల్ సెటిల్డ్‌గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్:8498936945 AJH-002410

★ OC / కుల పట్టింపు లేదు / 42y/5'5"/ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / బెంగళూర్ / మధ్యతరగతి వధువుకు వరుడు కావలెను డైరెక్ట్ : 9182734077 AJH-002410

★ ఆర్యవైశ్య/ 21y & 23y & 25y & 26y &28y & 30y &32y & 34y &35y & 36y &38y & 39y &40y & 42y &43y & 45y &46y & 48y &50y & 52y & 53y & 55y & 57y & 59yrs. వధూవరుల "మా సేవ" (Since 1998):PH/WA:9291503949 AJH-002410

★ కమ్మ /కుల అస్తి పట్టింపు లేదు / 30y/5'5"/MS (OBG) డాక్టర్; Own Clinic, మెడికల్ షాప్, టెన్ హౌస్, 10 ఎకరాల ల్యాండ్, సింగిల్‌గా ఉన్న వధువుకు లేట్ or 2nd మ్యాచ్ వరుడు కావలెను. వాట్సాప్ : 9642664671 AJH-14372

★ క్రిస్టియన్ / 27y / 5'3" / B.Tech / SWE/ అందమైన వధువుకు తగిన SWE/ బిజినెస్ వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-14372

★ విడో / 52y / గవర్నమెంట్ టీచర్ / పిల్లలు లేరు / తగిన వరుడు కావలెను. మ్యారేజెస్ ఫర్ ఇండియన్ సీనియర్ సిటిజన్స్. పద్మిని. 8523840236 AJH-14372

★ రెడ్డి / 2nd / వయస్సు : 36 / ఎత్తు 5.5 / business కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. కుల మత అస్తి ప్రసక్తి లేదు. ఫోన్: 9573723073 AJH-14373

★ కుల పట్టింపు లేదు /విడో/50y/ ఆంధ్ర/Govt. Doctor / Own Clinic / 1 Girl Settled / Own House / Lands / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8374476725 AJH-002453

★ కుల, అస్తి ప్రసక్తి లేదు/విడో/45y/ తెనాలి/Govt. Teacher/ Own House / Agriculture Lands పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 7286976721 AJH-002453

★ కాపు / కుల పట్టింపు లేదు / 48y/ Central Govt. Job / వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (2వ సంబంధమైనా ఓ.కె) ఫోన్ : 9676896226 AJH-002453

★ కుల పట్టింపు లేదు / 50y/ Widow / ఆంధ్ర /Govt. Job / సొంత అపార్ట్‌మెంట్ / ల్యాండ్స్ / ఒంగోలు, గుంటూరు, విజయవాడ వారికి ప్రాధాన్యత. ఫోన్ : 9989350417 AJH-002453

★ కుల పట్టింపు లేదు / 42y/ Widow / ఆంధ్ర పిల్లలు లేరు / మెడికల్ డిపార్ట్‌మెంట్ / మంచి జీతం / సొంత ఇల్లు / Lands / అమ్మ సంరక్షణలో ఉంటున్న వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 7075948409 AJH-002454

★ రెండవపెళ్లి (పద్మశాలి) : 45 సం॥ రాలు, విడో, సొంత ఇల్లు, అలాగే రెడ్డి 46 సం॥ రాలు, కాపు 42 సం॥ రాలు, రాజులు 35 సం॥ రాలు ఉన్న వధువుకు వరులు కావలెను. పిల్లలు ఉన్నా Ok. సెల్ : 91005 79008 AJL_186364

★ రెడ్డి /విడో/ కుల, మత, అస్తి ప్రసక్తి లేదు / Qly: డిగ్రీ / ఎత్తు 5.4 / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికము ఓ.కె). ఫోన్ : 8143011223 AJH-002454

★ రాజులు, (సూర్యవంశం, చంద్రవంశం) ఐటీరాజులు : 27 సం॥ రాలు, సొంత ఇల్లు, స్థిరాస్థి ఉన్న అమ్మాయికి ఆంధ్ర, తెలంగాణాలలో మంచి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్ : 91005 79008 AJL_186364

★ కుల పట్టింపు లేదు / విడో / పిల్లలు లేరు / 60 Y / Retd. HM / ఓన్ కార్ / రెంట్స్ / ఓన్ అపార్ట్‌మెంట్ / మంచి ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. సంప్ర. 85559 47283 AJB-174

★ నాయి బ్రాహ్మిన్స్: ఇంటర్, 26 సం॥ రాలు, 5.3, సొంత ఇల్లు, ఫాదర్ కులవృత్తి, బ్రదర్ జాబ్ ఉన్న అమ్మాయికి మంచి కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91005 79008 AJL-186364

★ SC మాల / B.Tech / Govt. Asst. ఇంజనీర్ / ఇరిగేషన్ Dept. / మంచి జీతం : / 5'3 ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. సెల్: 8897389698 AJJ-157517

★ యాదవ్స్, (పూజగొల్ల, ఎర్రగొల్ల, కర్ణగొల్ల, అళ్లగొల్ల) : 1st మ్యారేజ్, 10 to డిగ్రీ, 26 సం॥ రాలు, ఉన్న అమ్మాయికి మంచి వరుడు కావలెను.సెల్ : 91005 79008 AJL_186364

★ 2వ పెళ్లి / ఏకైక కుమార్తె / B.Tech / సాఫ్ట్‌వేర్ / మంచి జీతం / 5'3 ఎత్తు / 27 సం.ల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. సెల్: 9963757612 AJJ-157517

★ (ఆచారులు) : విశ్వబ్రాహ్మిన్స్ : 26 సం॥రాలు, Inter, సొంత ఇల్లు, బ్రదర్ ప్రైవేట్ జాబ్, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి మంచి సాంప్రదాయ వరుడు కావలెను. సెల్ : 91005 79008 AJL_186364

★ వడ్డెర / B.Tech / C.Govt. Asst. కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ / మంచి జీతం / 5'3 ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు అందమైన వరుడు కావలెను. సెల్: 9618579861 AJJ-157517

★ రెడ్డి : 1st మ్యారేజ్, 27 సం॥రాలు, డిగ్రీ, 5.4., 2 ఎకరాల పొలం, ఫాదర్ వ్యవసాయం, బ్రదర్ సాఫ్ట్‌వేర్‌గా ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 91005 79008 AJL_186364

★ గౌడ / B.Tech / Govt. Asst. Exq. ఇంజనీర్ / RWS / మంచి జీతం / 5'4 ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. సెల్: 7032058965 AJJ-157517

★ (నాయుడు) కాపు, కమ్మ, బలిజ : మొదటి సంబంధం, 26 సం॥రాలు, డిగ్రీ, 5.4, సొంత ఇల్లు, వ్యవసాయం ఉన్న అమ్మాయిలకు వరులు కావలెను. సెల్ : 91005 79008 AJL_186364

★ SC మాదిగ / B.Tech / C.Govt. క్లర్క్ & క్యాషియర్ / DCCB / మంచి జీతం / 5'4 ఎత్తు / 24 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. సెల్: 7032058965 AJJ-157517

★ పద్మశాలి, పట్టుశాలి, దేవాంగులు : 1st మ్యారేజ్, 26 సం॥రాలు, సొంత ఇల్లు, ఫాదర్ బిజినెస్ ఉన్న వధువుకు సాంప్రదాయ వరుడు కావలెను. సెల్ : 91005 79008 AJL_186364

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

వధువు కావలెను



★ మున్నూరుకాపు /31y/5'8"/Bhmct/ మంచి జీతం / హైదరాబాదులో జాబ్ / ఆస్తి / గద్వాల వరుడికి జాబు / చదువు ఉండి కులకట్టు పట్టింపు లేని వధువు కావలెను. డైరెక్ట్ : 9440122661 AJH-002410

★ కాపు /52y/5'8"/ఆమెరికన్ సిటిజన్ / B.Tech (JNTU)&M.S(USA)/ మంచి ప్రాపర్టీ /USA లో సొంత ఇల్లు / మంచి జీతం గల వరుడికి 33-46 వయసు గల S.W.E.INDIA/USA వధువు కావలెను. బయోడేటా & ఫోటోతో డైరెక్ట్ సంప్ర : 8555961146 AJH-002410

★ CNB; OC / రాజులు /C.Govt. / 45y / 5'11" / MA / మంచి జీతం ★ రెడ్డి / C.Govt. / 40y / 5'9" / B.Tech / మంచి జీతం ★ స్థిరాస్తి, వ్యవసాయ భూమి గల వరులకు విడో, డైవర్సీలు సంప్ర: 6304448107 AJH-14372

★ బలిజ /35 సం.లు, డిగ్రీ, సొంత ఇల్లు, ప్రైవేట్ జాబ్, వరునికి మంచి కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. (కుల ప్రసక్తి లేదు) డైరెక్ట్ : 9440378427 AJH-002454

★ 35y, Reddy / 5'6" / IT employee వరుడుకి, కుల, మత, వయసు ప్రసక్తి లేని అందమైన అమ్మాయి కావలెను. Direct Contact : 8970497543 AJH-002454

★ కమ్మ : అతి సంపన్నుడు చాలా అందమైన వరుడు 28, 5.9, B.Tech - VIT, MBA - IAM, 40 LPA. Req :- Doctors, Non Medical చదివిన సంపన్న కుటుంబానికి చెందిన అందమైన వధువు కావలెను. No Brokerage Cell : 913345 9739 AJB-182331

★ వైశ్య డైవర్సీ : వయస్సు: 56, పిల్లలు లేరు, ఒంటరి, మంచి సంపాదన కలిగిన వరునికి తగిన వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు, నోబ్రోకర్స్, డైరెక్ట్ Ph: 7386213167. AJG-2385

★ యాదవ / B.Tech / సాఫ్ట్‌వేర్ / డెవలప్ మెంట్ ఇంజనీర్ / 5'8 ఎత్తు / 33 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. సెల్: 9963757612 AJJ-157517

★ రజక / కట్నప్రసక్తి లేదు / C.A / చార్టెడ్ అకౌంటెంట్ / మంచి జీతం / 5'8 ఎత్తు / 30 సం.ల వరుడికి అందమైన వధువు కావలెను. సెల్: 8897389698 AJJ-157517

★ డైరెక్ట్ కాంటాక్ట్ : ఆర్యవైశ్య, 46 Yrs. 5.5 బిజినెస్, జాబ్, 30cr స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్) ఫోన్ : 91821 61015, 76808 72085 AJT - 3079

★ కమ్మ / B.Tech / C.Govt. సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ / మంచి జీతం / 5'9 ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. సెల్: 9618579861 AJJ-157517

★ ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. 1.2 ఆర్యవైశ్య అబ్బాయి 35, M.Sc., M.Ed., ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, జూ.డిగ్రీ, వీరయ్య, నల్లగొండ, M9H.B మునుగోడు రోడ్ సెల్: 9121325068. AJY_152718

★ 49 సం.లు 5'.7", వ్యాపారం, వరుడుకు ఆర్థికంగా బాగా స్థిరపడి, ఎలా వున్నా మంచి మనస్సు కలిగి కడవరకు తోడుండే చక్కని వధువు కావలెను. సంప్ర: 9502294163. AJV-192856

కళ్యాణ వేదిక

★ Free Registration బ్రాహ్మిణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-002410

★Free Registration హిందు / మాల / మాదిగ క్రిస్టియన్ వధూవరుల Online స్వయం వరం July 14th Bhavani Matrimony, Hyd. Ph: 9704656103 /9533608887 AJH-002410

★ యూనివర్సల్ మాట్రిమోని అన్ని కులముల వారికి ఇండియా మరియు అబ్రాడ్ 1st & 2nd వివాహ సంబంధముల కొరకు సంప్రదించండి. సెల్ :888 60 18 188 AJB - 194501

★ మీ అమ్మాయికి, అబ్బాయికి పెళ్ళి సంబంధం కావాలా? అన్ని కుల, మతాలకు అర్హత, 2వ సంబంధాలు చూడబడును. Doctors, Engine, PG, IIT, IIM, Bitspilani, Groups Civils . www.sweethomemarriage.in. 9849072372 AJV_183429

పర్వతనేని (కమ్మ) వివాహ వేదిక

Regd. No. AP-06-17-001- 02477065

పర్వతనేని రామబ్రహ్మం, VJA 9849350056 పర్వతనేని శ్రీకాంత్, HYD 8886664567

గత 27 సం॥లుగా దేశ విదేశీ వధూవరులకు పెళ్ళి సంబంధాలు కుదుర్చుతున్న అగ్రగామి సంస్థ

వధువు కావలెను

కమ్మ: 26 5'9 BE 22L 15cr; 26 5'8 BE 18L 2.5cr; 30 5'11 MS 36L 5cr; 34 5'9 75L 6cr; 29 5'9 IIT 43L 1cr; 28 6'IIT 50L 19cr; 27 5'7 5cr;

కమ్మ: 29 5'11 MS 30L 7cr; 31 6' 12L 30cr; 31 5'11 BE 30L 4cr; 29 5' 11 BE 9L 20cr; 31 LLB 50L 60cr; 33 5'11 BE 33L 8cr.

కమ్మ: 27 5'10 BE 15cr; 33 5'7 MS 11L 4cr; 31 5'9 BE 19L 15cr; 34 5'6 BE 12L 10cr; 35 5'8 ME 5L 8cr; 29 6'BE 10L 5cr; 29 5'10 BE 80L2cr.

కమ్మ: 30 5'7 BE 12L 10cr; 35 5'8 30L 4cr; 29 5'10 MS 33L 4cr; 34 5'11 BE 12L 2cr; 35 5'11 BE 24L 2cr; 33 5'9 MS 36L 10cr; 27 5'8 ME 32L 4cr; 32 5'8 BE 20L 4cr.

కమ్మ: 28 5'9 CA 10L 40cr; 27 5'8 ME 5L 50cr; 28 5'10 BE 50L 30cr; 29 5'10 BE 36L 5cr; 31 6'BE 18L 6cr; 30 5'10 BE 12L 10cr; 29 6'BE 25L 5cr.

కమ్మ: 29 6'2 BE 14L 5cr; 28 5'10 MSc 18L 20cr; 29 5'11 MS 30cr; 29 6'2 IIT 40L 20cr; 27 6'1 MS 40L 2cr;29 5'10 MS 15L 15cr; 28 5'8 MS 18.5L 8cr.

కమ్మ: 32 5'11 MS $120K 4cr; 30 6'0 MS $135K 6cr; 32 5'10 MS $130K 2½cr; 31 5'7 MS $140K 10cr; 29 6'1 MS $125K 7cr; 29 5'10 MS (Germany) 70K 5cr;

కమ్మ: 29 5'11 MS $120K 5cr; 31 6'2 MS $104K 3cr; 29 5'8MS $152K 4cr; 29 5'10 MS (Australia) 50L 5cr; 31 5'8 ME (German) $68K 1cr; 31 5'9 BE $120K 2cr;

కమ్మ: 29 5'11 MS $150K 10cr; 31 6'0 MS $117K 5cr; 30 5'9 MS $130K 15cr; 27 5'11 MS $100K 20cr; 28 5'6 MS $120 K 7cr.

కమ్మ: 33 5'11 MS $270K 2cr; 32 5'7 MS $160K(Canada) 3cr; 29 5'10 MS UK 45000(P) 17cr; 29 5'10 MS(Austr) $114K 5cr; 28 5'11 MS (Canada) $200K 5cr;

కమ్మ: 28 6'2 MS (New Zealan) NZD 80000 30cr; 30 5'10 MS $110K 2cr;30 6'2 PGDM (Canada) 74L 6cr; 31 6' MS $105K 10cr;

కమ్మ: 32 5'10 MS $160K 50cr; 32 6' MS $100K 10cr; 32 5'10 MS $140K 4cr; 29 6'2 IT (Canada) $95K 10cr; 31 5'7 MS $350K 10cr.

కమ్మ: 29 6'3 MS $120K 3cr; 34 5'6 MS $110K 5cr; 30 6'2 MS $135K 10cr; 29 6'0 BE(Citizen) $300K 30cr; 29 5'9 MS $110K 6cr;

కమ్మ: 28 6'0 MS $317K 10cr; 31 5'7 MS $130K 30cr; 29 5'11 MS $120K 5cr; 31 6'1 MS $150K 4cr; 26 5'11 MS $100K 10cr; 30 6'2 MBBS (Citiz) 25cr;

కమ్మ: 35 5'7 MS $120K 20cr; 34 5'8 MS $100K 10cr; 35 5'9 MS $115K 10cr; 29 6' MS $200K 3cr; 27 5'10 MS 10cr; 32 5'11 MS $100K 4cr.

Divorce: 32 5'8 MS $131K 15cr;37 5'7 MS $95K 4cr; 36 6'2 MBA 9L 4cr; 35 5'7 MSc (Singapore) 60L 2cr; 32 6' MS 10L 4cr; 34 6'0 BE $120K 5cr;

Divorce: 31 6'2MS 24L 50cr; 35 6'1 MS $115K 2½ cr; 38 5'11 BE 15L 10cr; 34 5'10 MS $310K 50cr; 38 5'10 Gen.M 36L 15cr; 35 6'2 MS(Hongkong)3cr 70cr;

Divorce: 34 6' MS $150K 20cr;34 5'9 BE 7L 6cr; 39 5'6 MBA 18L 2cr; 40 5'10 MS 18L 5cr; 40 6'2 MS $120K 6cr; 41 5'11 B.com 25cr; 40 5'10 BE $300K 3cr;

Doctors: 33 5'11 (H.M) 24L 20cr; 33 5'8 Radiology 2½ cr; 27 6'2 G.med 2cr; 35 5'10 MD-Gen.Med 40cr; 29 5'9 MD-Pedi 25cr;

Doctors: 29 5'11 MS(Gen.Med) 40cr; 32 5'6 M.Pharmacy 21L 2½ cr; 29 5'8 MD- Pediatrics 9cr; 30 6'0 MS-G.Sur 10cr; 34 5'7 Pharm-D 24L 15cr; 36 5'9 MS-Ortho.10cr;

వరుడు కావలెను

కమ్మ: 26 5'3 BE 18L 10cr; 26 5'2 BE 8L 6cr; 26 5'10 BE 6L 15cr; 28 5'5 MBA 15L 1cr; 27 5'2 BE 27.5L 2 ½ cr; 27 5'5 BE 25cr;

కమ్మ: 25 5'8 BE 40cr;27 5'8 ME 20cr; 26 5'5 MS 30cr;26 5'3 BE 40cr; 24 5'5 BE 40cr;30 5'9 MS 10cr; 28 5'3 MBA 10cr;31 5'8 BE 7cr.

కమ్మ: 26 5'7 BE 10L 2cr; 28 5'7½ BE 5L 3cr; 34 5'6 BE 30L 2 ½ cr; 30 5'4 ME 8cr; 28 5' PGDM 8cr; 26 5'4 IT 6L 3cr; 28 5'4 BE 14.5L 2cr.

కమ్మ: 31 5'2 MS 15L 100cr; 29 5'2 MS 60cr; 28 5'5 BE 12L 12cr; 28 5'6 MS 10cr; 32 5'6 BE 8L10cr; 28 5'4 MS 18L 10cr; 32 5'3 BE 15L 10cr.

కమ్మ: 31 5'3 BE 20L 1cr; 28 5'7 BE 7cr; 28 5'5 BE 9L 5cr; 30 5'5 ME 3 Cr; 26 5'7 BE 18L 2cr; 27 5'2 BE 1cr; 30 5'6 MS 15L 1cr; 30 5'9 BE 18L 3cr.

కమ్మ: 27 5'2 ICWA 15cr; 32 5'8 MBA 10cr; 29 5'7 LLB 25cr; 28 5'6 BA 50cr; 28 5'6 BA 50cr; 26 5'4 BBA 25cr; 28 5'6 MBA 6cr; 26 5'3 CA 11.5L 4cr.

కమ్మ: 28 5'3 MS $125K 20cr; 29 5'6 MS $160K 30cr; 32 5'5 MS $140K 50cr; 30 5'6 MS $150K 40cr; 30 5'5 MS 25cr (Health Information) ; 27 5'5 MS 5cr;

కమ్మ: 27 5'9 MBA (UK) 5cr; 27 5'5 MS (GHM) 10cr; 30 5'4 MS $139K 4cr; 32 MS (Singapore) 5'4½ 10cr; 29 5'5 MS 10cr; 32 5'4 Dental doctor $285K 5cr; 26 5'5 IMR (US citizen) 25cr;

కమ్మ: 27 5'8 ½ MS $130K 10cr; 32 5'7 MS $100K 8cr; 28 5'4 MS (Australia) $100K 5cr; 27 5'9 Doing MS 4cr; 28 5'4 MS $150K 10cr; 34 5'8 MS 15cr;

కమ్మ: 29 5'6 MS $12K 20cr; 32 5'4MS $180K 6cr; 29 5'0 MS (Pune) 3½ cr; 32 5'7 MS $110K 6cr; 31 MS $100K 5cr; 28 5'5 MS $125K 15cr; 26 5'7 MS $110K 3cr.

కమ్మ: 27 5'5 MS 2cr; 30 5'8 MS $110K 5cr;28 5'5 (BDS-Doing MS) 6cr; 31 5'2 BE $120K 2 ½ cr; 27 5'4 MS $130K 5cr.

కమ్మ: 5'7 ½ MS $125K 10cr; 27 5'5 BBC (Citizen) 100cr; 26 5'4 MS London 3 ½ cr; 28 5'4 MS 10cr; 29 5'6 MS (Australia) (No PR) 3cr;

కమ్మ: 28 5'5 MS $100K 5cr;32 5'3 MS $155K 5cr; 25 5'7 MS $100 K 4cr; 34 5'9 MS $ 120K 6cr; 29 5'4 MS $145K 2cr; 31 5'4 MS $110K 3cr.

Divorce: 28 5'6 Doing MS 40cr; 33 5'5 MS $165K 9cr; 29 5'7 ½ BDS 2 Cr; 43 5'6 Ph.D 12L 5cr; 35 5'4 MS 8L 2cr; 34 5'2 BE 12L 1cr.

Divorce: 34 5'7 BE 5L 15cr; 34 5'2 ME 10L 6cr; 34 5'6 BE $95K 3cr; 31 5'3 Doing MS 1cr; 37 5'4 BDS $175K 7cr; 38 5'5 MS $120K 5cr;

Divorce: 37 5'4 BE $100K 2cr; 29 5'7 BE 9L 4cr; 36 5'7 MS 36L 3½cr; 36 5'6 BE 50L; 32 5'6 ME 12L 1cr; 34 5'6 Ph.D 13L 2cr; 34 5'1 B.com 20cr;

Divorce: 34 5'4 BA 5cr; 31 5'3 MBA $140K 100cr; 35 5'7 BE 12L 1cr; 36 5'8½ MS $125K 10cr; 34 5'7 MS $140K 10cr; 32 5'4 MD-Radiology 40cr.

Doctors: 28 5'4 MD-(Redi) 5cr; 26 5'4 BHMS 7L 4cr; 28 5'7 MD GM 20cr; 28 5'5 MD G.M 10cr; 28 5'7 G.M 10cr; 30 5'3 MS-Orth 12L 10cr; 28 5'3 BDS 1cr.

Doctors: 30 5'8 MD-Derm 18L 10cr; 28 5'8 MBBS 20cr; 31 5'6 MD-Derma 50cr; 30 5'6 PG G.M 18L 7cr; 28 5'4 MSRA 55 L 25cr.

Doctors: 27 5'5 Anest 5cr; 26 5'5 MBBS10cr; 28 5'2 MS-OBG 5cr; 29 5'4 MBBS 30cr; 28 5'7 MBBS 12L 5cr; 28 5'6 PG G.M 10cr; 28 5'4 PG (OBG&Gyne) 20cr;

స్నేహ మ్యారేజ్ బ్యూరో

(కమ్మవారికి మాత్రమే)

HEAD OFFICE : #11-160, గద్దం రత్తయ్యవీధి. Near Time హాస్పిటల్, అశోక్‌నగర్, VJA-7: 99481 29111, 99481 29222
Branch Office : Hyderabad : 87905 99799, 99510 32647 Khammam, Vizag, Rajhamundry
www.snehamarriage.com. 87905 99799 (whatsapp)

వరుడు కావలెను

కమ్మ : 30, 5.6, DM Gastro 100Cr ★ 30, 5.7, DM Neroulogy 50Cr ★ 31, 5.4, DM Cardiology 40Cr ★ 99481 29111

కమ్మ : 33, 5.7, DM Cardiology 50LPA 60Cr ★ 34, 5.4, MCH Vasco Surgen 60Cr ★ 32, 5.6, MCH Vasco Surgen 50Cr ★ 89782 17967

కమ్మ : 29, 5.6, MS OBG IVF 200Cr ★ 29, 5.8, MS OBG 50Cr ★ 32, 5.6, MS OBG IVF 40Cr ★ 98488 97778

కమ్మ : 28, 5.7, MD Radiology 100Cr ★ 27, 5.6, MD Radiology 70Cr ★ 29, 5.2, MD Radiology 20Cr ★ 96666 58789

కమ్మ : 52, 5.3, MD GM 70Cr ★ 29, 5.6, ENT 50Cr ★ 29, 5.4, MD General Medicine 50Cr ★ 95420 16659

కమ్మ : 29, 5.4, MD Radiology 100Cr ★ 28, 5.4, MD GM 70Cr ★ 28, 5.6, MD GM 50Cr ★ 99481 29222

కమ్మ : US Citizen Doctors : 32, 5.3, MD Radiology 30Cr ★ 29, 5.3, MD Internal Medicine 400K 50Cr ★ 27, 5.4, MD Internal Medicine 40Cr ★ 95420 16659

కమ్మ : 28, 5.6 MD Internal Medicine 350K, 50Cr ★ 29, 5.7, MD Internal Medicine 50Cr ★ 29, 5.4, MD Internal Medicine 300K 50Cr ★ 99481 29111

కమ్మ : 34, 5.5, MDS 26 LPA 30Cr ★ 29, 5.3, MDS, 30Cr ★ 29, 5.2, MDS, 50Cr ★ 29, 5.6, MDS, 40Cr ★ 99510 32647

కమ్మ : 27, 5.3, BDS, 20Cr ★ 28, 5.4, BDS 50Cr ★ 28, 5.5, BDS, 25Cr ★ 28, 5.5, BDS, 30Cr ★ 95420 16659

కమ్మ : Divorce : 30, 5.7, DM Cardiology 50Cr ★ 33, 5.5, DM Neurology 50Cr ★ 32, 5.5, DM Nefrology 50Cr ★ 33, 5.6, MD Nerology 36LPA 60Cr ★ 95420 16659

కమ్మ : Divorce : 34, 5.4, MD GM 36LPA 50Cr ★ 34, 5.5, MD Dermatology 40LPA 50Cr ★ 36, 5.4, MS, OBG IVF 45LPA 25Cr ★ ★ 99510 32647

కమ్మ : 27, 5.4, MS 140K 50Cr ★ 27, 5.4, MS 170K, 20Cr ★ 28, 5.4, MS, 150K, 50Cr ★ 98488 97778

కమ్మ : 27, 5.9, MS, 150K 20Cr ★ 27, 5.6, MS, 135K 20Cr ★ 27, 5.7, MS, 160K 20Cr ★ 96666 58789

కమ్మ : 27, 5.7, MS, 160K 50Cr ★ 27, 5.5, MS, 160K 50Cr ★ 27, 5.6, MS, 170K 40Cr ★ 96666 58789

కమ్మ : 27, 5.6, MS Stanford 270K 60Cr ★ 28, 5.3, MS Harvard 250K 78Cr ★ 28, 5.5, MS Stanford 28K 30Cr ★ 99481 29222

కమ్మ : Australi PR : 30, 5.4, MS, 100K AU Dollars 30Cr ★ 29, 5.6, MS 95K AU Dollars 20Cr ★ 29, 5.7, MS 100K AU Dollars 15Cr ★ 30, 5.5, MS 1000K AU Dollars 25Cr ★ 98487 54267

కమ్మ : 30, 5.2, MS, 85K, AU Dollars 25Cr ★ 31, 5.3, MS, 90K, AU Dollars 30Cr ★ 28, 5.2, MS, 83K, AU Dollars, 10Cr ★ 99481 29222

కమ్మ : Canada : 27, 5.4, MS, 90 Cada 30Cr ★ 34, 5.5, MS, PHD 10K Cada 20Cr ★ 37, 5.6, MS, 100K Cada 20Cr ★ 96666 58789

కమ్మ : UK PR : 30, 5.4, CAICF 70K UK Pounds 20Cr ★ 30, 5.4, CAICW 100K UK Pounds 30Cr ★ 30, 5.8, MS, 90K UK Pounds 20Cr ★ 27, 5.3, MSC 60K UK Pounds 12Cr ★ 98488 97778

కమ్మ : India : 33, 5.8, MS, 2000Cr ★ 32, 5.6, MS Stanford 200Cr Own Business Property కలిగిన అందమైన వధువుకి Well Settled వరుడు కావలెను. ★ 89782 17967

కమ్మ : 28, 5.6, IIT KGP 50LPA 100Cr ★ 52, 5.6, IIT Guwahti MBA IIM KOZ 80LPA 50Cr ★ 30, 5.4, IIT Mumbai 45LPA 50Cr ★ 96666 58789

కమ్మ : 27, 5.2, B.Tech MBA 40LPA 50Cr ★ 26, 5.7, B.Tech MBA 36LPA 40Cr ★ 30, 5.5, B.Tech MBA 1Cr PA 15Cr ★ 99481 29222

కమ్మ : Divorce : 28, 5.8, M.Tech 25LPA 25Cr ★ 33, 5.4, M.Tech, 50LPA, 60Cr ★ 33, 5.6, CAICW 40LPA 50Cr ★ 30, 5.4, ICICW 36LPA 50Cr ★ 98487 54267

వధువు కావలెను

కమ్మ : 30, 5.11, DM Cardiology 200Cr ★ 30, 5.11, DM affrology CMC 100 Cr ★ 31, 6, MCH Urology 50Cr ★ 96666 58789

కమ్మ : 29, 5.8, MCH Surgical Oncology 100Cr ★ 29, 5.10, MCH Neurosurgeon 50Cr ★ 29, 5.7, MCH Plastic Surgeon 50Cr ★ 98488 97778

కమ్మ : 30, 5.10, DM Cardiology 200Cr ★ 31, 5.9, DM affrology 50Cr ★ 31, 5.9, Dm Urology 50Cr ★ 89782 17967

కమ్మ : 31, 5.11, MCH Surgical Oncology, 100Cr ★ 31, 5.8, MCH Neurosurgeon 50Cr ★ 31, 5.9, MCH Surgical Oncology 100Cr ★ 96666 58789

కమ్మ : 31, 6, DM Nanotology 50Cr ★ 31, 5.10, Dm Nanotology 40Cr ★ 31, 5.11, DM Nanotology 50Cr ★ 99481 29222

కమ్మ : 31, 6, MS Ortho 100Cr ★ 31, 5.11, MS Ortho 50Cr ★ 32, 5.10, MS Ortho 30Cr ★ 98487 54267

USA Citizen Doctors

కమ్మ : 30, 5.11, DM Cordiology 1000Cr ★ 33, 6, MCH Surgical Oncology 150Cr ★ 31, 6, MD International Medicine 50Cr ★ 99481 29111

కమ్మ : 33, 5.11, MD Internatonal Medicine 350K, 10Cr ★ 34, 5.10, MS Inernational Medicine 400K 40Cr ★ 35, 5.11,DM Neurology 450K, 40Cr ★ 99481 29111

UK PR - కమ్మ 32, 5.10, DM Cardiac Oxford University 100 UK Pounds ★ 33, 6, DM Cardiology hart transition 150 UK Pounds, 30Cr ★ 34, 5.11, Dm Neurology 140 UK Pounds 20Cr ★ 99510 32647

Divorce - కమ్మ : 34, 5.7, DM Cardiology 60 LPA, 50Cr ★ 35, 5.8, DM Cardiology 50 LPA, 20Cr ★ 35, 5.10, MCH Surgical Oncology MSENT 60 LPA 50Cr ★ 95420 16659

Divorce - కమ్మ : 36, 5.9, DM Medical Oncology, 1000Cr, Own Hospital HYD. ★ 35, 6, DM, Medical Oncology, 100Cr ★ 38, 6.1, DM Cardiology 60 LPA, 60Cr ★ 96666 58789

కమ్మ : 29, 6.1, MS Stanford 300K 50Cr ★ 29, 5.9, MS, Harvard 300K 40Cr ★ 28, 6, MS Stanford 270K, 40Cr ★ 99481 29111

కమ్మ : 27, 5.11, MS Stanford 250K, 50Cr ★ 32, 5.8, MS, Harvward 300K, 40Cr ★ 33, 6, MS 170K, 30Cr ★ 89782 17967

కమ్మ : 33, 5.11, MS, 140K 20Cr ★ 28, 6, MS, 170K amazan 40Cr ★ 28, 59, MS 150K Google 25 Cr ★ 98488 97778

కమ్మ : 29, 5.11, MS 200K Facebook 40Cr ★ 28, 5.11, MS 160K amazon 30Cr ★ 29, 5.8, MS 250K 25Cr ★ 96666 58789

India MS - కమ్మ : 30, 6.1, MS Harvard 2000 cr Own Business BNG ★ 31, 6, MS, 1000Cr Own Business BNG Property కలిగిన అందమైన వరుడుకి Well Settled వధువు కావలెను. ★ 29, 5.11, MS, 200Cr Own Business HYD ★ 95420 16659

కమ్మ : 30, 5.10, MS 200Cr Own Business HYD Property కలిగిన అందమైన వరుడుకి Well Settled వధువు కావలెను. ★ 32, 5.8, IIT PGP MBIMM CAL 1Cr PA 200Cr ★ 33, 5.11, MS Roorkee MBIAM Kozpude 80 LPA 50Cr ★ 99481 29222

కమ్మ : 28, 5.10, IIT KGB 40 LPA 50Cr ★ 28, 5.10, IIT Guwahati amazon 50 LPA, 30Cr ★ 29, 5.6, IIT Roorkee 45 LPA 45 Cr ★ 96666 97778

కమ్మ : 29, 6, IIT Mumbai 80 LPA 80Cr ★ 29, 6.1, IIT Kanpur, 70 LPA 30Cr ★ 30, 6, IIT Guwahati 70 LPA 50Cr ★ 89782 17967

కమ్మ : 29, 6, CA, 40 LPA, 20Cr ★ 31, 5.10, CA, 25 LPA, 20Cr ★ 31, 6, CA, 35 LPA, 30 Cr ★ 32, 6.1, CA, 29 LPA, 15Cr ★ 99481 29222

కమ్మ : 30, 6.2, B.Tech, MBA, 40 LPA, 50Cr ★ 30, 5.11, B.Tech, MBA 36 LPA 25Cr ★ 30, 5.8, B.Tech, MBA 40 LPA 40Cr ★ 98487 54267

Kamma - Divorce : కమ్మ : 32, 5.7, IIT Mumbai 80 LPA, 30Cr ★ 31, 5.7, IIT Kanpur, 55 LPA, 30Cr ★ 33, 6, IIT, KGP, MBA IAMCAL 1Cr PA, 50Cr ★ 99510 32647

దిగ్గజాన్ని కోల్పోయాం



రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ దిగ్గజాన్ని కోల్పోయింది. రామోజీరావు ఎంతో మందికి మార్గదర్శకునిగానిలిచారు. ఆయన ఎందరికో ఆదర్శమైన వ్యాపారవేత్త. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంపై చెరగని ముద్ర వేశారు. పద్మవిభూషణ్ సత్కారం అందుకున్న ఆయన మీడియా, సినీ పరిశ్రమలకు అందించిన సేవలు చిరస్మరణీయం. రామోజీరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భారత మీడియాకు దార్శనికుడు



రామోజీరావు మరణం బాధాకరం. భారతీయ మీడియాలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు. ఆయన సేవలు సినీ, పత్రికా రంగాల్లో చెరగని ముద్ర వేశాయి. మీడియా, వినోద ప్రపంచాల్లో నూతన ప్రమాణాలను ఆయన నెలకొల్పారు. ఆయనతో సంభాషించడం, ఆయన అపారమైన జ్ఞానం నుంచి లబ్ధి పొందేందుకు నాకు అనేక అవకాశాలు లభించడం నా అదృష్టం. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

- ప్రధాని నరేంద్ర మోదీ

రామోజీరావు సేవలు చిరస్మరణీయం

జర్నలిజం, సినిమా, వినోద రంగాల్లో రామోజీరావు చేసిన సేవలు చిరస్మరణీయం. రామోజీరావు భారతీయ మీడియా ముఖచిత్రాన్ని మార్చివేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి.

- రాహుల్ గాంధీ, ఖర్గే

ప్రజాస్వామ్య విజయం చూశారు

ప్రజాస్వామ్యం, ప్రజలకోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు రామోజీరావు. ఈరోజు ప్రజాస్వామ్య విజయం చూసి, ఆనందించి స్వర్గస్థులయ్యారు. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

- సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

అక్షరవీరుడి మరణం తీరని లోటు

- రామోజీరావు మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి
- రామోజీరావు నిజమైన లెజెండ్ : గవర్నర్ సీపీ రాధాకృష్ణన్


(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని అన్నారు. అక్షర వీరుడు రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకున్నారు. రామోజీ కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కాగా రంగం ఏదైనా విలువలకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన వ్యక్తి రామోజీరావు అని సీఎం అన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మీడియా రంగానికి దశాదిశ చూపిన దార్శనికుడు రామోజీరావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయనతో భేటీ అయిన క్షణాలను రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కాగా, రామోజీరావు గొప్ప లౌకికవాది అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఏ పార్టీలు అధికారంలో ఉన్నా రామోజీరావు నిత్యం ప్రజల పక్షాన నిలబడి ప్రతిపక్షంగా వ్యవహరించారని చెప్పారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లు రవి, రేణుకా చౌదరి, పద్దిరాజు రవిచంద్ర, టీపీసీసీ నేతలు జగ్గారెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్, మధుయాష్కీగౌడ్ సంతాపం తెలియజేశారు. కాగా, రామోజీరావు నిజమైన లెజెండ్ అని, ఆయన మరణ వార్త బాధ కలిగించిందని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ సంతాపం..

రామోజీరావు మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకునిగా రామోజీరావు అందించిన సేవలను స్మరించుకున్నారు. రామోజీరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రామోజీరావు ఒక వ్యవస్థ



చాలా బాధాకరం. యుగపురుషుడు... ఒక వర్గస్ కోసం పుట్టిన వ్యక్తి. చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. రామోజీరావు చివరి శ్వాస వరకూ సమాజహితం కోసం పని చేశారు. తెలుగు జాతి కోసం కృషి చేశారు. ఓ సాధారణ కుటుంబంలో పుట్టి అసాధారణ వ్యక్తిగా ఎదిగారు. ఆయన ఓ వ్యక్తి కాదు ఒక వ్యవస్థ. 40 ఏళ్లగా ఆయనతో నాకు పరిచయం ఉంది. నాకు ఎప్పుడూ ఒకటే చెప్పేవారు. మీరు ఏం చెప్పినా 'ధర్మం ప్రకారమే పనిచేస్తాను, విధి నిర్వహిస్తాను' అని, ఎప్పుడు ప్రజాపక్షానే ఉంటానని స్పష్టంగా చెప్పేవారు. పత్రికా రంగంతోపాటు చిత్ర పరిశ్రమకూ ఎనలేని సేవలు చేశారు. రామోజీరావు స్ఫూర్తితో తెలుగు జాతిని ముందుకు తీసుకువెళ్తా.

- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

ఇబ్బందులున్నా తట్టుకున్నారు



రామోజీరావు గారి మరణం దిగ్భ్రాంతి కలిగించింది. ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి ఆయనను కలవాలనుకున్నాను. ఈలోపే ఇలా జరిగింది. గత ప్రభుత్వాలు ఆయన్ను ఎంతో ఇబ్బంది పెట్టాయి. ఆయన అవన్నీ తట్టుకుని నిలబడ్డారు. తెలుగు పాత్రికేయ రంగానికి వేలాది మంది జర్నలిస్టులను అందించిన మహోన్నత వ్యక్తి ఆయన. తెలుగు చలన చిత్ర రంగానికి సంబంధించి అద్భుతమైన మౌలిక వసతులతో రామోజీ ఫిలిం సిటీని అందించారు. వారి కుటుంబానికి నా సానుభూతి

- పవన్ కల్యాణ్, జనసేన అధ్యక్షుడు

ఆయనలో చిన్నపిల్లాడిని చూశా

రామోజీరావులో అందరూ గాంభీర్యాన్ని చూస్తే నేను మాత్రం ఆయనలోని చిన్నపిల్లాడిని చూశా. నేను 2009లో ప్రజారాజ్యం పార్టీకి సంబంధించి సలహాల కోసం ఆయన్ను తరచూ కలిసేవాడిని. ఓ సందర్భంలో ఆయనకు ఒక కార్టియర్ పెన్ను బహుమతిగా ఇచ్చాను. ఆయన వద్దు అంటారని అనుకున్నా. కానీ, ఆయన మాత్రం చిన్నపిల్లాడిలా తెగ సంతోషపడిపోయారు. ఆయనకు పెన్నులను కలెక్ట్ చేసే హాబీ ఉంది. తాను కలెక్ట్ చేసిన పెన్నులను నాకు చూపారు. ఆయన లేరంటే, అది తెలుగు జాతికే తీరని లోటు. ఒక పెద్దను కోల్పోయింది.

- కొణిదెల చిరంజీవి, సినీ నటుడు

అఖండ తెలుగు జ్యోతి ఆరిపోయింది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య
- రామోజీరావు ఓ శక్తి: కిషన్ రెడ్డి
- వెనకడుగు వేయని వ్యక్తి: దత్తాత్రేయ
- భారతరత్న ఇవ్వాలి: రాజమౌళి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



రామోజీరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిషన్‌రెడ్డి

రామోజీరావు మరణంతో ఒక అఖండమైన తెలుగు జ్యోతి ఆరిపోయిందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రామోజీరావు ఒక వ్యక్తి కాదు, శక్తిమంతమైన వ్యవస్థ అని తెలిపారు. ఆయన చేతలు, రాతలు, ఆయన చేపట్టిన కార్యక్రమాలు భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కాగా, పాత్రికేయ రంగంలో చెరగని ముద్రవేసిన రామోజీరావు..తన ప్రయాణంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా వెనుకంజ వేయలేదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. తెలుగు భాష గురించి ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు ఓ వ్యక్తి కాదు శక్తి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. రాజ్యసభ సీటు సహా ఎన్ని ఆఫర్లు వచ్చినా రామోజీరావు సున్నితంగా తిరస్కరించారని తెలిపారు. తెలుగు పత్రికారంగంలో, తెలుగు ప్రసార మాధ్యమాలలో విప్లవాత్మక మార్పుకు బీజం వేసిన మహానుభావుడు రామోజీరావు అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అక్షరానికి కూడా ఓ సామాజిక బాధ్యత ఉంటుందని సమాజానికి చాటిన వ్యక్తి రామోజీరావు అని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. జర్నలిజం విలువలు, ఔన్నత్యాన్ని పెంచి, రక్షించిన వ్యక్తి రామోజీరావు అని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం నేతలు చాడ వెంకటరెడ్డి, తమ్మినేని వీరభద్రం తదితరులు తమ సంతాపం తెలియజేశారు. కాగా, ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన రామోజీరావు చిత్రపటం వద్ద బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్ వేర్వేరుగా నివాళులర్పించారు. రామోజీరావు మరణం బాధాకరమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. తెలుగు జర్నలిజం ద్వారా తెలుగు భాష సమున్నతికి కృషి చేసిన రామోజీరావు మరణం తీరని లోటని ఓ ప్రకటన చేశారు. రామోజీరావు మరణం మీడియా రంగానికి తీరని లోటని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే, రామోజీరావు మరణం పట్ల తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తమ సంతాపం తెలియజేశాయి. కాగా, రామోజీరావు మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ప్రముఖ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పించిన రామోజీరావుకు భారతరత్న ఇవ్వాలని ప్రభుత్వాలను కోరారు. రామోజీరావు సినీ, పత్రికా రంగాలకు విశేష సేవలందించారని సినీనటుడు మురళీమోహన్ పేర్కొన్నారు. మహా వృక్షం నేలకొరిగిందని, రామోజీరావు మరణం అందరికీ తీరని లోటని గాయకుడు ఎస్పీ చరణ్ అన్నారు.



నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

- హాజరు కానున్న 4.03 లక్షల మంది
- రాష్ట్ర వ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాలు
- అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ఆదివారం నిర్వహించేందుకు టీజీపీఎస్సీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. సుమారు 4.03లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఈ మేరకు టీజీపీఎస్సీ పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. 10 గంటల తర్వాత ఆయా కేంద్రాల ప్రధాన గేట్‌ను మూసివేస్తారని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు గానీ, వస్తువులను గానీ అనుమతించబోమని పేర్కొన్నారు. పరీక్షకు చెప్పులు మాత్రమే ధరించి రావాలని, బూట్లు వేసుకుని రావద్దని, ఉదయం 9.30గంటల నుంచే బయోమెట్రిక్ హాజరు తీసుకుంటామని చెప్పారు. కాగా, బయోమెట్రిక్ హాజరు నమోదు కోసం శిక్షణ పొందిన ఇన్విజిలేటర్లను నియమించారు. అన్ని పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించేందుకు ప్రతీ 20 పరీక్ష కేంద్రాలకు ఒక రీజనల్ కోఆర్డినేటర్లను, పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్లు, గుర్తింపు పత్రాలు పరిశీలనకు ప్రతీ 100 మందికి ఒక అధికారిని నియమించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్, 3-5 కేంద్రాలకు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. కాగా, అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి జిల్లాలకు వెళ్లే అభ్యర్థుల కోసం శనివారం నుంచే ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ పాయింట్ల నుంచి బస్సులు నడుపుతున్నామని తెలిపారు. జిల్లాల నుంచి హైదరాబాద్ వచ్చే అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల సమాచారం అందించే ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సమయానికి కేంద్రానికి చేరుకుని, ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా పరీక్ష రాయాలని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పది లక్షల కేసుల పరిష్కారం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు భారీ స్పందన వచ్చినట్లు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి అయిన డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సీహెచ్ పంచాక్షరి వెల్లడించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు శనివారం లోక్‌అదాలత్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. 4.53 లక్షల పెండింగ్ కేసులు, 5.81 లక్షల ప్రీలిటిగేషన్ మొత్తం కలిపి 10.35 లక్షల కేసులు పరిష్కారం కాగా రూ.743 కోట్లు లబ్ధిదారులకు పరిహారంగా అందించినట్లు పేర్కొన్నారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో 132 కేసులు పరిష్కారం కాగా రూ.9.5 కోట్లు పరిహారం అందజేశారు.

వైద్య విద్య కళాశాలల
అధ్యాపకుల వేతనాల పెంపు?



- గిరిజన ప్రాంత అధ్యాపకులకు 50%
- మైదాన ప్రాంతాల్లో 30% పెరుగుదల
- త్వరలో విడుదలకానున్న జీవో

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల వేతనాలు త్వరలో పెరగనున్నాయి. వారి మూల వేతనంపై 50% వేతనం పెంచాలని రాష్ట్ర సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే మైదాన ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల అధ్యాపకులకు వారి మూల వేతనంపై 30% మేరకు వేతనం పెరగనుంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను వైద్యవిద్య సంచాలకులు ప్రభుత్వానికి పంపారు. సంబంధిత ఫైలుకు ఆర్థిక శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే వైద్య ఆరోగ్య శాఖ జీవో జారీ చేయనుంది. సంబంధిత జీవో వారం పది రోజుల్లోపే వచ్చే అవకాశం ఉందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైద్య విద్య కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు మూల వేతనంపై 50% వేతనాలు పెంచారు. అదేవిధంగా తెలంగాణలోనూ వేతనాలు పెంచనున్నారు. దీంతో అధ్యాపకులకు వేతనాలు భారీగా పెరగనున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు మూల వేతనంపై కేవలం 9శాతమే హెచ్‌ఆర్‌ఏ ఇస్తున్నారు. ఉదాహరణకు మూల వేతనం రూ.68,900 ఉన్న ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆసిఫాబాద్‌లో పనిచేస్తే ఆయనకు కేవలం 9% (రూ.6200) హెచ్‌ఆర్‌ఏ వస్తుంది. ఇదే అసిస్టెంట్ ప్రొఫెసర్ హైదరాబాద్‌లో పనిచేస్తే 30% హెచ్‌ఆర్‌ఏ (రూ.20,670) ఇస్తారు. పైగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది. అదే ఆసిఫాబాద్‌లో పనిచేసే వారికి హెచ్‌ఆర్‌ఏ తక్కువగా రావడంతో పాటు అక్కడ నివసించేందుకు కనీస వసతులూ ఉండవు. పైగా పిల్లల్ని చదివించేందుకు సరైన పాఠశాలలు కూడా లేని పరిస్థితి ఉంటుంది. అలాగే ప్రైవేటు ప్రాక్టీసూ ఉండదు. ఈ కారణాలతోనే గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య విద్య కళాశాలల్లో పనిచేసేందుకు అధ్యాపకులు ఆసక్తి చూపడం లేదు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం లాంటి నగరాలు, పట్టణాలను మినహాయిస్తే మిగిలినచోట పని చేందుకు అధ్యాపకులు ముందుకు రావడం లేదు. దాంతో గిరిజన, గ్రామీణ ప్రాంత మెడికల్ కాలేజీల్లో 50% మేర అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అధ్యాపకులను ప్రోత్సహించడానికి వేతనాలు పెంచే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది.

వేతనాలు పెరిగితే ఇలా..

ప్రస్తుతం వైద్య విద్య కళాశాలలో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు మూల వేతనం రూ.68,900 ఉంది. అసోసియేట్‌కు రూ.79,800, మూడేళ్ల అసోసియేట్‌గా పూర్తిచేస్తే వారికి రూ. 1,34,400 వేతనం ఉంది. ఇక ప్రొఫెసర్‌కు మూల వేతనం రూ.1,44,000 ఉంది. వీటికి అదనంగా 50% వేతనం పెరగనుంది. అంటే గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,03,350 అవుతుంది. దీనిపై 9% హెచ్‌ఆర్‌ఏ వస్తుంది. అలాగే అసోసియేట్‌కు రూ. 1,19700, మూడేళ్ల పూర్తి చేసుకున్న అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.2,01,600, ప్రొఫెసర్‌కు రూ.2,16000 వరకు వేతనం పెరుగుతుంది. వీటికి అదనంగా 9% హెచ్‌ఆర్‌ఏ వస్తుంది. ఈ స్థాయిలో వేతనాలు పెరిగితే గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య విద్య కళాశాలల్లో పనిచేసేందుకు అధ్యాపకులు ఎక్కువగా ఆసక్తి చూపుతారని నాగర్ కర్నూల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నరహరి తెలిపారు. ప్రస్తుతం అందరూ హైదరాబాద్‌కు పోస్టింగ్ కావాలని అడుగుతున్నారని, అదే గ్రామీణ ప్రాంత అధ్యాపకుల వేతనాలు పెంచితే నగర పోస్టులకు అంత డిమాండ్ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య విద్య కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో ప్రొఫెసర్లను తీసుకున్నారు. ఇప్పుడు వేతనాలు పెంచి, రెగ్యులర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే.. రిక్రూట్‌మెంట్‌కు భారీగా డిమాండ్ ఉంటుందని మరో ప్రభుత్వ కాలేజీకి చెందిన అధ్యాపకుడు అభిప్రాయపడ్డారు. అంతేకాక అధ్యాపకుల కొరత కూడా తీరుతుందని ఆయన పేర్కొన్నారు.

తప్పుడు పత్రాలతో రుణాలు

అమాయకుల ఆధార్ కార్డులు వాడుకున్న నిందితులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- నల్లగొండ జిల్లా ఎస్పీ చందన దీప్తి వెల్లడి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆధార్, ఏటీఎం కార్డులు, లాప్‌టాప్‌లు తదితరాలు

నల్లగొండ క్రైం, జూన్ 8: అమాయకుల ఆధార్ కార్డులను సేకరించి వాటిలో చిరునామా మార్చడంతోపాటు వారి పేరిట తప్పుడు పత్రాలతో బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందన దీప్తి శనివారం తెలిపారు. నిందితుల నుంచి 27 ఆధార్‌కార్డులు, రూ.1,32,600 నగదు, 44 సెల్‌ఫోన్లు, రెండు కార్లు, 83 పాన్‌కార్డులు, 18 సిమ్‌కార్డులు, 92 డెబిట్, క్రెడిట్ కార్డులు, 64 రబ్బర్ స్టాంపులు, 3 ల్యాప్‌టాప్‌లు, కలర్ ప్రింటర్, 9 బోగస్ సంస్థల పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం కురమర్తి గ్రామానికి చెందిన కాశమల్ల క్రాంతికుమార్ హైదరాబాద్‌లో సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టాడు. నష్టాలురావడంతో మూసేశాడు. అదే కంపెనీలో పనిచేసిన సిలివేరు సతీష్‌తో కలిసి సంపాదించాలనే దురుద్దేశంతో కొత్త దందాకు తెరలేపారు. సతీష్ బాబాయి కాశమల్ల నాగరాజుకు తెలిసిన, చదువురాని అమాయకుల ఆధార్ కార్డులు తెప్పించుకున్నారు. వారికి కొంత డబ్బు ఇస్తామన్నారు. ఆధార్‌కార్డులో ఫొటోషాప్‌లో చిరునామాలను మార్చారు. వారి ఆధార్‌కార్డులతో పాన్‌కార్డులు తీసుకున్నారు. ఫోన్ నంబర్లను లింక్ చేసేందుకు కొత్త సిమ్ కార్డులు తీసుకున్నారు. వాటితో వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి పాసు పుస్తకాలు, చెక్ బుక్‌లు, ఏటీఎం కార్డులు తీసుకుని వారి వద్దనే ఉంచుకున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి వీరంతా హైదరాబాద్‌లో ఉద్యోగస్తులని, వారి ఆదాయం అధికంగా చూపేందుకు కొన్ని లావాదేవీలు జరిపి సిబిల్ స్కోర్ పెరిగాక రుణాలు తీసుకున్నారు. క్రెడిట్ కార్డులూ తీసుకుని జల్సాలు చేశారు. బ్యాంకులకు తిరిగి సొమ్ము కట్టలేదు. దుప్పలపల్లికి చెందిన ఓ యువకుడు ఇచ్చిన సమాచారంతో నల్లగొండ పట్టణం చైతన్యపురి కాలనీకి చెందిన కాశమల్ల నాగరాజు, హైదరాబాద్ మణికొండలోని మాదాపూర్‌కు చెందిన ఆఫ్ సాఫ్ట్ ఐటీ సొల్యూషన్స్ సీఈవో కాశమల్ల క్రాంతి, అదే కంపెనీకి చెందిన ఉద్యోగి సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

ఎన్నికల తీర్పుతో మోదీకి
నైతిక పరాభవం

- కాంగ్రెస్‌కు నైతిక స్థైర్యం ఇచ్చింది: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, జూన్ 8: లోక్‌సభ ఎన్నికల తీర్పు ప్రధాని నరేంద్ర మోదీకి నైతికంగానూ, రాజకీయంగానూ చివరకు వ్యక్తిగతంగా కూడా పరాభవాన్నే విఁగిల్చిందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఎన్నికల్లో మోదీ దయనీయమైన పనితీరును సమర్థించుకోవడానికి ఆయన భజనపరులు ప్రయత్నాలు మొదలుపెట్టారని, అందులో భాగంగా ప్రజాతీర్పులో సానుకూల అంశాలను అన్వేషించే పని ప్రారంభమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఎద్దేవా చేశారు. నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు అధికారం దక్కించుకొన్న మొదటి వ్యక్తి మోదీనే అని ప్రచారం జరుగుతోందని, అయితే తన పార్టీ కేవలం 240 సీట్లు మాత్రమే దక్కించుకొని, మూడోవంతు ప్రధానిగా విఁగిలిపోవడం ప్రజా తీర్పు ఎలా అవుతుందో మాత్రం వారు చెప్పట్లేదని విమర్శించారు. 'నెహ్రూ 1952లో 364 సీట్లు, 1957లో 371 సీట్లు, 1962లో 361 సీట్లు గెలిచారు. ప్రతిసారీ 2/3 మెజారిటీ వచ్చింది. అయినప్పటికీ ఆయన పూర్తి ప్రజాస్వామిక వాదిగా కొనసాగారు. తన నిరంతర ఉనికితో పార్లమెంట్‌ను సంరక్షించారు' అని జైరాం తెలిపారు. నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు ప్రమాణ స్వీకారం చేసిన వ్యక్తి మోదీ ఒక్కరే కాదని, వాజపేయి 1996, 1998, 1999లో మూడుసార్లు, ఇందిరాగాంధీ 1966, 1967, 1971, 1980లో నాలుగుసార్లు ప్రమాణస్వీకారం చేశారని గుర్తుచేశారు. 2024 ఎన్నికలు మోదీకి, బీజేపీకి నైతిక ఓటమి అయితే కాంగ్రెస్‌కు నైతిక స్థైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు.



రామోజీరావు కుమారుడు కిరణ్‌ను ఓదారుస్తున్న చంద్రబాబు




రామోజీ సతీమణికి నమస్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు





రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

అక్షరయోధుడి అస్తమయం



(మొదటిపేజీ తరువాయి)

చికిత్స అందించారు. అత్యవసర యాంజియోగ్రామ్ చేయడంతో పాటుగా స్టెంట్ వేశారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో శనివారం తెల్లవారుజామున 4.51 గంటలకు రామోజీరావు తుది శ్వాస విడిచారని స్టార్ హాస్పిటల్ ప్రకటించింది. కాగా, అనంతరం రామోజీరావు పార్థివదేహాన్ని ఫిలింసిటీకి తరలించారు. ఆదివారం ఉదయం 9-10 గంటల మధ్యలో ఫిలింసిటీలోని స్మృతివనంలో రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సీడబ్ల్యూసీ సమావేశాల కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఈ మేరకు ఆదేశించారు. ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌లకు సీఎస్ సూచించారు. రామోజీరావు మరణవార్త తెలిసిన వెంటనే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఫిలింసిటీకి వెళ్లి నివాళులర్పించారు. రామోజీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కాగా, అజరామర చిత్రాలను నిర్మించడంతో పాటు సినీ రంగానికి ఫిలిం సిటీ లాంటి అద్భుతాన్ని అందించిన రామోజీరావుకు నివాళిగా ఆదివారం షూటింగ్‌లను నిలిపివేయాలని తెలుగు చిత్ర పరిశ్రమ నిర్ణయించింది.



రామోజీరావు పార్థివదేహం

ఫిలింసిటీలో ఘనంగా నివాళులు..

రామోజీరావును కడసారి చూసేందుకు ఫిలింసిటీలోని ఆయన నివాసానికి రాజకీయ, వ్యాపార, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆయన భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. కాగా, రామోజీరావు మృతికి సంతాపంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం, సోమవారాలు సెలవు దినంగా ప్రకటించారు. ఆయన అంత్యక్రియలకు సీనియర్ ఐఏఎస్‌లు ఆర్పీ సిసోదియా, రజత్ భార్గవ, సాయిప్రసాద్‌లతో కూడిన బృందాన్ని ప్రత్యేకంగా పంపుతున్నట్లు వెల్లడించింది. ప్రధాని మోదీ సందేశంతో వచ్చిన కేంద్ర మాజీ మంత్రి నిర్మలాసీతారామన్.. రామోజీ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కాగా, రామోజీకి నివాళులర్పించినవారిలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి, పలువురు మంత్రులతో పాటు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి - హైదరాబాద్ సిటీ, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం

జననం
1936 నవంబరు 16

పుట్టిన గ్రామం
కృష్ణా జిల్లాలోని పెదపారుపూడి

తల్లిదండ్రులు
వెంకటసుబ్బారావు, వెంకట సుబ్బమ్మ

వివాహం
1961 ఆగస్టు 19న రమాదేవితో

రామయ్య.. రామోజీరావుగా

రామోజీరావు అసలు పేరు రామయ్య. అయితే ఆయన పాఠశాలలో చేరాక.. తొలి రోజు ఉపాధ్యాయుడు నీ పేరేంటి అని అడగ్గా.. ఈయన రామోజీరావు అని చెప్పారు. రికార్డులో అదే పేరు ఎక్కింది. అలా తన పేరును తానే మార్చి పెట్టుకున్నారు. ఆయన భార్య పేరు చిన్నతనంలో రమణమ్మ. ఆమె కూడా రామోజీరావు లాగానే ఆమె పేరును రమాదేవిగా మార్చుకున్నారు. ఆమె పేరిటే రమాదేవి పబ్లిక్ స్కూల్‌ను రామోజీరావు స్థాపించారు.

రైతు కుటుంబం నుంచి పద్మవిభూషణ్ దాకా!

1962లోనే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు శంకుస్థాపన

1974 ఆగస్టు 10న ఈనాడు దినపత్రిక ప్రారంభం

చెరుకూరి రామోజీరావు ప్రస్థానం అనితరసాధ్యం



రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్‌గా, దిగ్గజ వ్యాపారవేత్తగా, సినీ నిర్మాతగా అనితర సాధ్యమైన ప్రయాణం సాగించిన రామోజీరావుది సాధారణ మధ్య తరగతి రైతు కుటుంబం. కృష్ణా జిల్లాలోని పెదపారుపూడి గ్రామానికి చెందిన చెరుకూరి వెంకటసుబ్బారావు, వెంకట సుబ్బమ్మ దంపతుల కుమారుడైన రామోజీరావు.. 1936 నవంబరు 16న జన్మించారు. గుడివాడలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 1947లో 8వ తరగతిలో చేరి, సిక్స్ ఫాం వరకు అక్కడే చదివారు. గుడివాడ కళాశాలలో ఇంటర్మీడియట్, బీఎస్సీ పూర్తి చేశారు. ఢిల్లీలోని ఓ యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్టుగా తొలి ఉద్యోగం చేశారు. 1961ఆగస్టు 19న రమాదేవిని వివాహం చేసుకున్నారు. 1962లో హైదరాబాద్ వచ్చిన రామోజీరావు.. అదే ఏడాది మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు శంకుస్థాపన చేశారు. 1965లో కిరణ్ యాడ్స్ పేరిట మరో సంస్థను ప్రారంభించారు. 1969లో రైతుల కోసం అన్నదాత పత్రికను ప్రారంభించారు. 1970లో ఇమేజెస్ అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీకి శ్రీకారం చుట్టారు. 1972-73లో విశాఖలో డాల్ఫిన్ హోటల్‌ను నిర్మించి, ప్రారంభించారు. 1974 ఆగస్టు 10వ తేదీన విశాఖ వేదికగా ఈనాడు దినపత్రికకు శ్రీకారం చుట్టారు. 1975 డిసెంబరులో 'ఈనాడు'ను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. 1976లో సినీ ప్రేమికుల కోసం సితార, 1978లో విపుల, చతుర మాసపత్రికలను ప్రారంభించారు. 1980లో ప్రియా ఫుడ్స్ పేరిట నోరూరించే పచ్చళ్లను తయారు చేసి, ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేశారు. 1983లో ఉషాకిరణ్ మూవీస్ సంస్థను ప్రారంభించారు. 1992-93 మధ్య ఈనాడు ద్వారా సారాపై సమరం ప్రకటించిన రామోజీరావు.. మద్య నిషేధంపై ఉత్తర్వులు వచ్చే వరకూ పోరాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద సినీ స్టూడియోగా పేరుగాంచిన రామోజీ ఫిల్మ్ సిటీని 1996లో స్థాపించారు. 2002లో ఈటీవీ ఆరు ప్రాంతీయ చానళ్లను ప్రారంభించి, టీవీ రంగంలో సరికొత్త మార్పునకు నాంది పలికిన రామోజీరావును బీడీ గోయెంకా అవార్డు, యుధ్‌వీర్ అవార్డు వరించాయి. 2016లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన పద్మవి

ప్రముఖుల నివాళులు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తాజా మాజీ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నివాళులర్పిస్తున్న చిరంజీవి



జనసేన అధినేత పవన్ కల్యాణ్

అర్ధ శతాబ్ది... అద్వితీయ ముద్ర!

తెలుగునాట సామాజిక జీవనంపై రామోజీ సంతకం.. ప్రయోగాలే వేదికగా వ్యాపార సామ్రాజ్య విస్తరణ

హైదరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రామోజీరావు లాగా ఒక్క రోజు బతికినా చాలు అని ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు కీరవాణి అన్నారు. రామోజీరావు లాగా వ్యాపారం చేయాలని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొన్ని వేలమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కలలుగంటారు. మీడియా మొఘల్ రామోజీరావు కేవలం వ్యాపారవేత్త కాదు. తెలుగు రాష్ట్రాల అర్ధ శతాబ్దపు రాజకీయాలను, సామాజిక జీవనాన్ని తన మీడియా సంస్థల ద్వారా ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. వ్యాపారవేత్తగా ఆరు దశాబ్దాల ప్రయాణంలో వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించడమే కాకుండా తన సంస్థల ద్వారా దాదాపు పాతిక వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. యాడ్ ఏజెన్సీతో తొలి అడుగులు వేసిన ఆయన తన జీవితకాలంలో స్పృశించిన వ్యాపార రంగాలు చూస్తే భారతదేశ వాణిజ్యవేత్తల్లో చేతివేళ్ల మీద లెక్క పెట్టగలిగినంత కొద్ది మందికే సాధ్యమైన వ్యవహారం అది. రైతు కుటుంబం నుంచి వ్యాపారవేత్తగా ఎదగాలన్న ఆకాంక్షతో ఢిల్లీదాకా అన్ని అవకాశాలను అన్వేషించి, చివరకు హైదరాబాద్‌లో చిట్‌ఫండ్ కంపెనీ ద్వారా తన విజయయాత్రను ప్రారంభించారు. అందులో కుదురుకున్నాక రైతుల కోసం ఏదైనా చేయాలన్న తపనతో 1969 నుంచి దాదాపు ఐదు దశాబ్దాల పాటు అన్నదాత పేరుతో రైతుల కోసం పత్రిక నడిపారు. 1974లో 'ఈనాడు' ద్వారా దినపత్రిక రంగంలో అడుగు పెట్టారు. అప్పటికే దిగ్గజ పత్రికలున్న నేపథ్యంలో తెలుగునాట పెద్దగా రాజకీయ ప్రాధాన్యం లేని వైజాగ్ నుంచి 'ఈనాడు'ను ప్రారంభించి, ప్రయోగాలనే మెట్లుగా చేసుకుంటూ రాష్ట్రమంతటా విస్తరించారు. దేశంలోనే తొలిసారిగా స్థానిక వార్తల కోసం ట్యాబ్లాయిడ్‌ను తీసుకొచ్చారు. వాటి కోసం మండల స్థాయిలో విలేకరులను నియమించే సంప్రదాయానికి తెర తీశారు. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసి, ఉదయం 6 గంటలకే పత్రిక ఇంటి ముందుకు వచ్చే సంప్రదాయానికి తెరతీశారు.

సినిమాల్లోకి...

తెలుగు ప్రజలను అత్యధికంగా ప్రభావితం చేస్తున్న రంగం సినిమాలేనని రామోజీరావు గ్రహించారు. చిన్న సినిమాలతో మొదలెట్టి వివిధ భాషల్లో 85 సినిమాలు నిర్మించారు. కొద్ది బడ్జెట్‌తో సమకాలీన సమస్యలను కథలుగా తీసుకొని భారీ విజయాలు సాధించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ సిటీని నిర్మించారు. టాలీవుడ్ మాత్రమే కాకుండా బాలీవుడ్, కోలీవుడ్, ఇతర భాషా ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో సినిమాలు తీసుకొనే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించారు. దేశం గర్వించదగ్గ బాహుబలి లాంటి సినిమా టాలీవుడ్‌లో రూపొందడానికి ఆయన పరోక్ష సహకారం ఉంది. చెన్నై, ముంబైలకు పోటీగా ప్రస్తుతం హైదరాబాద్ భారతీయ సినిమాకు కీలకంగా మారడంలో ఆయన పాత్ర ఉంది. ఫిల్మ్‌సిటీని పర్యాటక ప్రాంతంగా మలిచి ఏటా 13 లక్షల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నారు. 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా వందల మంది గాయకులను తెలుగునేలకు పరిచయం చేశారు.

టీవీరంగంలోకి...

దూరదర్శన్ ఏక ఛత్రాధిపత్యం నశించి స్టార్ టీవీతో దేశంలో ప్రైవేటు టీవీ చానల్ విప్లవం ముంచుకొస్తున్న విషయాన్ని రామోజీరావు గ్రహించారు. 1995లోనే తెలుగునాట ప్రైవేటు చానల్‌కు తెర తీశారు. క్రమంగా వివిధ భాషల్లో 12 టీవీ చానెళ్లు స్థాపించి దేశంలోనే అతిపెద్ద చానళ్ల వ్యవస్థను సృష్టించారు. మీడియా మొఘల్‌గా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

ఫీడ్ బ్యాక్‌కు పెద్దపీట

రామోజీరావు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ కోసం పరితపించేవారు. తన పత్రిక కథనాల మీద ఎవరు అభ్యంతరాలు లేవనెత్తినా స్పందించి తిరుగు లేఖలు రాసేవారు. సహేతుకమైన విమర్శలు చేస్తే, అభినందించి తన తప్పు దిద్దుకొనేవారు. ఆయన సంతకంతో లేఖలను అపురూపంగా దాచుకున్నవారు వేలమంది ఉంటారు. తన ఉద్యోగులు చెప్పిన విషయాలను కూడా రామోజీరావు అంతే శ్రద్ధగా వినేవారు. చాంతాడంత పొడుగు రిపోర్టులు రాసినా విసుక్కోకుండా చదివేవారు. ఎందులో ఏ మంచి ఆలోచన ఉంటుందో అన్నది ఆయన ఉద్దేశం.

తెలుగు అంటే ప్రాణం

రామోజీరావుకు తెలుగు భాష అంటే ప్రాణం. ఆధునిక కాలపు తెలుగుభాషా సేవకుల్లో అగ్రగణ్యుడు. పత్రికలో వాడుక భాషనే వాడాలని పట్టుబట్టారు. ప్రపంచీకరణలో భాగంగా తెలుగును ఇంగ్లిష్ వింగేస్తున్న విషయాన్ని గ్రహించి దాన్ని పరిహరించేందుకు తన పత్రిక, చానెళ్ల ద్వారా సాధ్యమైనంత కృషి చేశారు. వ్యవహారిక భాషలో ఉండే కథలు, నవలలను ఆదరించడం కోసం విపుల, చతుర పేరుతో మాసపత్రికలను నిర్వహించారు. 'తెలుగు వెలుగు' పేరుతో సాహితీ మాస పత్రికను, పిల్లల కోసం బాలభారతం మాస పత్రికను నడిపారు. ఆయన సేవలను గుర్తించి వెంకటేశ్వర వర్సిటీ డాక్టరేట్ ఇచ్చింది. తెలుగులో వ్యవహారిక పదకోశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు అదొక ప్రామాణిక నిఘంటువు. ఆయన న్యూస్‌టైం పేరుతో ఆంగ్లపత్రికను నిర్వహించారు.

యాక్టివిటీతో జనంలోకి...

పత్రిక జనంతో మమేకం అవ్వాలంటే వాళ్ల సమస్యలపై వార్తలు రాయడమే కాకుండా ప్రజల్లోకి వెళ్లి కార్యకలాపాలు చేపట్టాలన్నది రామోజీరావు విధానం. అందుకే, విపత్తులు వచ్చినపుడు సహాయ కార్యక్రమాల్లో, సామాజిక ఉద్యమాలు వచ్చినపుడు పాల్పంచుకోవడంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ వార్తలు రాయించేవారు. 1984లో ఎన్టీఆర్‌ను కేంద్రం అక్రమంగా గద్దె దించినపుడు ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమాన్ని భుజాన వేసుకున్నారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని కూడా అలాగే చేపట్టి నడిపించారు. తుఫాను బాధితులకు పాఠకుల నుంచి విరాళాలు సేకరించి ఇళ్లు నిర్మించి ఇచ్చారు.

టీడీపీకి అధికారంలో పాత్ర


1982లో ఎన్టీఆర్ నేతృత్వంలో టీడీపీ ఏర్పడిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడం ఒక ప్రభంజనం. ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్‌ను ఢీకొని అధికారంలోకి రావడం దేశంలోనే ఒక సంచలనం. కొత్తగా ఏర్పడిన పార్టీకి అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలిచి విస్తృత ప్రచారమిచ్చి ప్రజల్లోకి వెళ్లేందుకు రామోజీరావు కృషి చేశారు.

మొండి పట్టుదల

ఆత్మగౌరవం విషయంలో రామోజీరావుది రాజీలేని ధోరణి. చేయని తప్పుకు శిక్ష విధించాలని శాసన మండలి నిర్ణయించిందని భావించిన ఆయన మండలి ఆదేశాలకు తల వంచలేదు. చివరికి ప్రభుత్వమే మండలిని రద్దు చేసే పరిస్థితి వచ్చింది. తర్వాత కాలంలో కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలతోనూ ఆయన అదే రాజీలేని ధోరణిని కనబరిచారు. ఆరు దశాబ్దాలుగా చిట్ ఫండ్స్ నిర్వహిస్తూ రాజకీయ ప్రత్యర్థులు సంక్షోభం సృష్టించే ప్రయత్నం చేసినా తట్టుకొని నిలబడ్డారు. ఫైనాన్స్ రంగం చిన్న తప్పుడు ప్రచారానికే కూలిపోయేంత సున్నితమైనది. ప్రభుత్వాలు తన మూలాలను దెబ్బ తీయాలని యత్నించినా చిట్టీల చందాదారుల నమ్మకంతో నిలబడ్డారు. ప్రైవేటు రంగంలో ఒకటో తారీఖునే జీతాలివ్వడం అనే సంప్రదాయాన్ని సృష్టించారు. మీడియా, సినిమా, ఫుడ్ ప్రాసెసింగ్ మాత్రమే కాకుండా హాస్పిటాలిటీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాల్లోనూ విస్తరించారు.

తొలి వ్యాపారం ఖమ్మం నుంచే...

ఖమ్మం సంక్షేమ విభాగం: దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుతో రామోజీరావుకు మంచి స్నేహం ఉంది. ఆయన సూచన మేరకు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన రామోజీ రావు.. ఖమ్మంలోనే తొలి వ్యాపారం ప్రారంభించారు. 1970లోనే ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఉన్న భవనంలో రెండు గదులను అద్దెకు తీసుకొని ఎరువుల దుకాణం ఏర్పాటు చేశారు. అయితే, రైతుల కష్టాలను దగ్గర్నుంచి చూసిన ఆయన... బాకీలు వసూలు చేయలేకపోయారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో రెండేళ్లకే దానిని మూసివేశారు. ఆ తర్వాతి కాలంలో జలగం సూచనతో హైదరాబాద్‌కు వెళ్లి పలు వ్యాపారాలను ప్రారంభించారు. ఖమ్మంకు చెందిన విలాసరావుకు రామోజీతో బంధుత్వం ఉంది. మయూరి లాడ్జి బుచ్చిబాబు, డాక్టర్ హరీశ్‌రావుతోపాటు ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి, తమ్మినేని వీరభద్రం, పోటు రంగరావు, కూనంనేని సాంబశివరావుతో ఆయనకు స్నేహ సంబంధాలు ఉన్నాయి.




నచ్చిన జర్నలిస్టు బీజీ వర్గీస్

ఇష్టమైన ఆహారం పెసరట్టు, మీగడ పెరుగు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మీడియా రంగ దిగ్గజమైన రామోజీరావుకు నచ్చిన జర్నలిస్టు ఒకరు ఉన్నారు. ఆయనే బీజీ వర్గీస్. రామోజీరావుకు ఇష్టమైన ఆహారం వేరుశనగ పప్పు, పెసరట్టు, మీగడ పెరుగు. ఎన్ని సాధించినా తీరని కల ఏదని ఆయన్ని అడిగితే.. తీరని దానిని తానెప్పుడూ కలగనని స్పష్టంగా చెప్పారు. ప్రపంచం మిమ్మల్ని ఏ విధంగా గుర్తించుకోవాలనుకుంటున్నారని అడిగితే.. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిదనొక్కటి ఆహుతిచ్చాను" అనుకుంటే చాలని వ్యాఖ్యానించారు.

స్నేహం చేసే ముందే ఆలోచించాలి



"స్నేహం చేసేముందే జాగ్రత్తగా ఆలోచించి చేయాలి.. ఒక సారి స్నేహం చేశాక తర్వాత ఆలోచించకూడదు. తర్వాత ఎలాంటి పరిస్థితి ఎదురైనా స్నేహాన్ని, స్నేహితుడిని వదలకూడదు" అని రామోజీరావు తనతో తరచూ చెప్పేవారని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పలు సందర్భాల్లో చెప్పారు. రామోజీరావు ఓ చిత్రంలో నటించారు. ఆ చిత్రం పేరు "మార్పు" ఇందులో ఆయన న్యాయవాది పాత్రలో నటించారు. అతిథి పాత్రలోనే అయినప్పటికీ ఆయన ఫొటో సినిమా పోస్టర్‌లో ముద్రించారు.

మమ్మల్ని అన్యాయంగా సస్పెండ్ చేశారు

- విచారణాధికారి తప్పుడు నివేదిక ఇచ్చారు..
- మహబూబాబాద్ జిల్లా డీఏవోకు సస్పెండైన ఏఈవోల లేఖ

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టిన వ్యవహారంలో విచారణాధికారి తప్పుడు నివేదికను ఇచ్చారని.. అందులో తమకు ఎలాంటి ప్రమేయం లేదని సస్పెండైన ఏఈవోలు అరవిండ్, జమున, దీపిక మహబూబాబాద్ జిల్లా వ్యవసాయాధికారికి శనివారం లేఖ రాశారు. తమను అన్యాయంగా సస్పెండ్ చేశారని.. పునర్విచారణ చేపట్టి సస్పెన్షన్ ఎత్తేయాలని కోరారు. మే 18న తొర్రూర్ ఆగ్రోస్-1, పీఏసీఎస్ తొర్రూర్ ఆగ్రోస్-2, ఆగ్రోస్-4 సామవరపుకుంటతండా కేంద్రాలకు 500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల స్టాక్ వచ్చిన విషయం తమకు సమాచారమే లేదని, సీడ్ సేల్ పాయింట్ దగ్గర కూడా ఎటువంటి అలాట్‌మెంట్ జరగలేదని లేఖలో పేర్కొన్నారు. అయితే స్టాక్ వచ్చిందంటూ మే 22న ఏవో కె.సోమకుమార్ తమకు వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారమిచ్చారని, సేల్ పాయింట్ అలాట్‌మెంట్ చెక్ చూసుకునే లోపే దాదాపు 50 శాతం మేర విత్తనాలు ఆన్‌లైన్‌లోనే అయిపోయాయని తెలిపారు. ఏవో సోమకుమార్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను సేల్‌పాయింట్ వారికి ఇవ్వడంతో.. వారే రైతుల పేరిట ఆన్‌లైన్ పర్మిట్స్ జనరేట్ చేశారని వెల్లడించారు. కాగా, ముగ్గురు ఏఈవోలను సస్పెండ్ చేస్తూ శుక్రవారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే.

నేడు, రేపు మోస్తరు వర్షాలు..

రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఆది, సోమ వారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు నిజామాబాద్ గుండా వ్యాపించినట్లు శనివారం తెలిపింది. మరో 2-3 రోజుల్లో రాష్ట్రంలోని మరి కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది.

వీధి కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడి మృతి


అభిరామ్ (ఫైల్)

చిలుపూర్, జూన్ 8: వీధి కుక్కలు మరో పసి బాల్యాన్ని చిదిమేశాయి. రాష్ట్రంలో ఈ తరహా ఘటనలు రెండు రోజులకొకటి జరుగుతున్నా కొంత మంది తల్లిదండ్రులు జాగ్రత్త వహించక తమ పసి మొగ్గలను ఒంటరిగా వదులుతూ వారి నిండు ప్రాణాలను వీధి కుక్కలకు బలి చేస్తున్నారు. తాజాగా జనగామ జిల్లాలో ఆరేళ్ల బాలుడిని తండ్రి ఒంటరిగా వదిలేయడంతో వీధికుక్కల అతడిపై పాశవికంగా దాడి చేసి చంపేశాయి. జనగామ జిల్లా చిలుపూర్ మండలం లునావత్ తండాకు చెందిన గుగులోత్ మధు, సరిత దంపతులకు ఇద్దరు కుమారులుండగా చిన్న వాడైన అభిరామ్ (6) శనివారం పొలం పనులకు వెళ్తున్న తల్లిదండ్రుల వెంట వెళ్లాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తండ్రి బాలుడిని తీసుకొచ్చి తండా సమీపంలో ఒంటరిగా వదిలేసి ఇంటికి వెళ్లమని చెప్పి తిరిగి పొలానికి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలుడు కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా తండాకు సమీపంలోని ఓ వాగులో బాలుడు విగతజీవిగా పడి ఉన్నాడు. ఒంటిపై తీవ్రమైన గాట్లు ఉండడం.. సమీపంలో కుక్కలు మంద కనిపించడంతో వాటి పనేనని గుర్తించారు.

డిజిటల్ సేవల యాదాద్రి!

అమల్లోకి ఆన్‌లైన్ బుకింగ్ విధానం.. ఆర్జిత సేవలు, పూజా కైంకర్యాలు, గదుల బుకింగ్ ఆన్‌లైన్‌లో

- అందుబాటులోకి దేవస్థానం వెబ్ పోర్టల్
- యూపీఐ ద్వారా కూడా పార్కింగ్ ఫీజు
- ప్రసాద టోకెన్ల బాధ్యత సెంట్రల్ బ్యాంక్‌కు
- త్వరలోనే కంప్యూటరైజ్డ్ రసీదులు
- సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్న దేవస్థానం
- డిజిటల్ విధానంతో పెరిగిన ఆదాయం
- మేలో 18.90 కోట్ల రాబడి


యాదగిరిగుట్టపై ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ బుకింగ్ సిస్టం (పీవోఎస్)

యాదాద్రి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పుణ్య క్షేత్రానికి పిల్లాపాపలతో కలిసి వెళ్లాక స్వామివారి దర్శనం కోసం క్యూలో నిల్చుని టికెట్లు తీసుకోవడం.. బ్రేక్ దర్శనానికో.. శ్రీఘ్రదర్శనానికో.. వత్రాలు, ఇతర పూజా కైంకర్యాలకో రద్దీని తట్టుకొని టికెట్లు సంపాదించడం ఎంత ప్రయాస? బస చేసేందుకు అప్పటికప్పుడు గదులు బుక్ చేసుకోవడమూ కష్టమే! మరి.. ఈ ఇబ్బందుల్లేకుండా ఎంచక్కా ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవలకు సంబంధించిన అన్నింటినీ ఆన్‌లైన్‌లో ముందుగానే బుకింగ్ చేసుకోగలిగితే? అది భక్తులకు ఎంత సౌకర్యవంతమో కదా! ఈ వ్యవస్థే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో అమల్లోకొచ్చింది. భక్తుల సౌకర్యార్థం, అలాగే అవకతవకలను నివారించి ఆదాయాన్ని మరింత పెంచే ఉద్దేశంతో స్వామివారి ఆర్జిత సేవలను ఆన్‌లైన్‌లో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆలయాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ సిస్టం (పీవోఎస్)ను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం దేవస్థానం వెబ్ పోర్టల్ (యాదాద్రి టెంపుల్. తెలంగాణ) ద్వారా ఆర్జితసేవలు, పూజా కైంకర్యాలు, గదులు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించింది. దేవస్థానంలో శాశ్వత పూజల నుంచి ఆర్జితసేవలు, తదితర సేవలన్నీ డిజిటల్‌మయం కానున్నాయి. ఫలితంగా భక్తులు ముందుగానే ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవలను బుకింగ్ చేసుకొని, ఎలాంటి ఆపసోపాలు పడకుండా హాయిగా దర్శనం చేసుకోవొచ్చు. కొండమీద వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన పార్కింగ్ ఫీజు రూ.500ను యూపీఐ విధానంలోనూ చెల్లించే విధంగా ఏర్పాటు చేశారు. ప్రసాదాల టోకెన్ల బాధ్యత సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పగించారు. ఇటీవల కొండపైన ఉన్న శివాలయం పక్కన కొత్తగా ప్రసాదాల టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ త్వరలోనే ప్రసాదాలను కంప్యూటరైజ్డ్ రసీదుల ద్వారా విక్రయించనున్నారు. ఆలయానికొచ్చే భక్తులు ఆధ్యాత్మికత, ఆహ్లాద వాతావరణంలో గడిపేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం వేళల్లో ఆర్జిత సేవలు తిలకించేందుకు రూ.78 లక్షలతో ఎల్‌ఈడీ, డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి శుక్ర, శనివారాల్లో సాయంకాలం 5గంటల నుంచి 7గంటల వరకు సంగీత సాహిత్య నృత్య సభల నిర్వహణకు పర్మినెంట్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. గతంలో దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్‌లో స్వామివారి దర్శనం చేసుకునేందుకు రూ.500 డిపాజిట్ చేయాల్సి ఉండేది. అయితే భక్తుల సౌకర్యార్థం డిపాజిట్ లేకుండానే ప్రోటోకాల్ కార్యాలయం నుంచి వీల్ చైర్లు తీసుకెళ్లే అవకాశం కల్పించారు.

పెరిగిన ఆదాయం

స్వామివారి చెంత సౌకర్యాలు మెరుగుపడటంతో భక్తుల రాక పెరగడం, ఫలితంగా దేవస్థాన ఆదాయమూ పెరిగింది. ఏప్రిల్ నెలలో మొత్తం రూ.15.64 కోట్ల ఆదాయం సమకూరగా, మే నెలలో రూ.18.90 కోట్ల ఆదాయం వచ్చింది. ఒక్క ప్రసాదాల విక్రయంతో ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో రూ.1,74,63,580 అధికంగా ఆదాయం వచ్చింది. గదుల అద్దెల ద్వారా ఆదాయం రూ.24.37 లక్షల నుంచి రూ.43.52 లక్షలకు పెరిగింది. హుండీల రూ.2.33 లక్షల నుంచి రూ.3.92 లక్షలకు, సత్యనారాయణస్వామి వ్రతాల ద్వారా రూ.43.37 లక్షల నుంచి రూ.47.18 లక్షలకు, శీఘ్ర దర్శనం ద్వారా రూ.95,650 నుంచి రూ.1,84,300 వరకు, వీఐపీ దర్శనం(రూ.150) ద్వారా రూ.95,55,000 నుంచి రూ.2,22,90,000వరకు, బ్రేక్ దర్శనం (రూ.300) ద్వారా రూ.69.10 లక్షల నుంచి రూ.95.76 లక్షలకు, వరకు, ఆర్జిత సేవల ద్వారా రూ.1.13 కోట్ల నుంచి రూ.1.40 కోట్లకు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.3.05 కోట్ల నుంచి రూ.4.79 కోట్లకు, కళ్యాణకట్ట ద్వారా 22.28 లక్షల నుంచి రూ.32.31 లక్షలకు ఆదాయం పెగిగింది.

డిజిటల్ సేవలను మెరుగుపరుస్తున్నాం



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం డిజిటల్ సేవలను మెరుగుపరుస్తున్నాం. స్వామివారికి సంబంధించిన అన్ని సేవలనూ ఆన్‌లైన్ చేస్తున్నాం. దేవస్థానం చేత క్యూఆర్‌కోడ్, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రసాదాలకు కంప్యూటరైజ్డ్ రసీదులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. మౌలిక సౌకర్యాలతో పాటు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దాతల సహకారంతో కొండపై భక్తుల కోసం తగిన సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- ఎ.భాస్కర్‌రావు, ఈవో యాదగిరిగుట్ట దేవస్థానం

బాబు ప్రమాణానికి వేగంగా ఏర్పాట్లు

- మొదలైన ప్రధాన స్టేజీ నిర్మాణ పనులు
- కేసరపల్లిలో పార్కింగ్ స్థలాల పరిశీలన

గన్నవరం, జూన్ 8: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో ఆయన ప్రమాణానికి ముహార్తం ఖరారైంది. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకార స్థలిలో పనులు వేగవంతం అయ్యాయి. కేసరపల్లి మేధా టవర్స్ పక్కనే ఉన్న పొట్లూరి బసవరావు, కంకణాల రమేశ్‌లకు చెందిన 11 ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. సభాస్థలికి అవసరమైన మెటీరియల్ మొత్తం వచ్చింది. శనివారం సాయంత్రం ప్రధాన స్టేజీ పనులు చేపట్టారు. గోకరాజు గంగరాజుకు చెందిన స్థలంతోపాటు మేధా టవర్స్, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, వాహన పటుత్వ కేంద్రం, కేసరపల్లి పెట్రోల్ బంక్ పక్క భూమి.. ఇలా 15 ఎకరాలు వాహనాల పార్కింగ్ కోసం పరిశీలిస్తున్నారు. బ్లాక్‌ల వారీగా విభజన చేసి సీట్లు కేటాయించనున్నారు. సుమారు లక్షకు పైగా ప్రజలు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు సాగుతున్నాయి.

ప్రమాణం ఉదయం 11.27 నిమిషాలకే..

షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు 12వ తేదీ ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణ స్వీకారం చేస్తారు. కానీ సీఎంవో అధికారులు ప్రమాణ స్వీకారం ఆ రోజు 9.27లకు ఉంటుందని తప్పుగా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. జరిగిన పొరపాటును తెలుసుకుని, ఆ పోస్టును సవరించారు.

ప్రధాని మోదీని నమ్మొద్దు..

- చంద్రబాబు, నితీశ్‌లకు టీపీసీసీ నేత నిరంజన్ సూచన

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీని నమ్మొద్దంటూ టీడీపీ, జేడీఎస్ అధినేతలు చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్‌లకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ సూచన చేశారు. మోదీని నమ్మితే నట్టేట ముంచుతారని హెచ్చరించారు. ఈసారి ప్రజలు మోదీని, బీజేపీని నమ్మలేదని, అందుకే సీట్లు తక్కువగా వచ్చాయన్నారు. అసలు మోదీ పట్ల బీజేపీలోనే అంతర్గతంగా వ్యతిరేకత ఉందని, అందుకే హడావుడిగా ఆయన ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారని చెప్పారు.

చేప ప్రసాదానికి పోటెత్తిన జనం

తెలంగాణ, ఏపీతోపాటు పలు రాష్ట్రాల నుంచి రాక.. ఆదివారం ఉదయం వరకు కార్యక్రమం

- స్పీకర్ ప్రసాద్‌రావు, మంత్రి పొన్నం చేతుల మీదుగా ప్రారంభం
- గుండెపోటుతో ఒకరి మృతి



మంత్రి పొన్నం ప్రభాకర్, మెట్టు సాయికుమార్‌కు చేప ప్రసాదాన్ని అందజేస్తున్న బత్తిని కుటుంబసభ్యులు

గోషామహల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చేప ప్రసాదానికి వచ్చిన వారితో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం పోటెత్తింది. తెలంగాణ, ఏపీతోపాటు పలు రాష్ట్రాల నుంచి భారీగా ప్రజలు తరలి వచ్చారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని దివంగత బత్తిని హరినాథ్‌గౌడ్ కుటుంబసభ్యులు, సోదరులు ఏటా ఉబ్బసం బాధితులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఇతర రాష్ట్రాలతోపాటు నేపాల్ తదితర దేశాల నుంచి బాధితులు శుక్రవారం ఉదయం నుంచే ఎగ్జిబిషన్ మైదానానికి తరలివచ్చారు. శనివారం ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి, స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మత్స్య పారిశ్రామిక సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ బత్తిని కుటుంబసభ్యుల సేవా భావాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి పద్మశ్రీ అవార్డును ఇప్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి, మత్స్యశాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అధర్ సిన్హా, కమిషనర్ గోపి తదితరులు పాల్గొన్నారు. వచ్చినవారికి ఎగ్జిబిషన్ మైదానంలో పలు శాఖల అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో పంపించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చొరవ తీసుకుంది. శనివారం రాత్రి వరకు దాదాపు 60 వేల మందికి పైగా టోకెన్లు విక్రయించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల వరకు చేప ప్రసాదం పంపిణీ నిర్విరామంగా కొనసాగుతుందని తెలిపారు. కాగా చేప ప్రసాదం కోసం వచ్చిన నిజామాబాద్ జిల్లాకు చెందిన గొల్ల రాజు(65) శనివారం తెల్లవారుజామున ఛాతీలో నొప్పి, ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. గమనించిన కుటుంబసభ్యులు నాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

17 మంది ఎంపీల్లో 14 మందిపై కేసులు

బీజేపీ ఎంపీ ఈటలపై అత్యధికంగా 54 కేసులు

హైదరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి కొత్తగా ఎన్నికైన 17 మంది ఎంపీల్లో 14 మంది(82%)పై కేసులున్నాయని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ)' తెలిపింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై అత్యధికంగా 54 కేసులున్నాయని వెల్లడించింది. ఎంపీ అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్లను, ఎన్నికల ఫలితాలను ఎఫ్‌జీజీ విశ్లేషించి ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఖమ్మం ఎంపీ రఘురామ్‌రెడ్డికి అత్యధికంగా 7,66,929 ఓట్లు పోలయ్యాయని తెలిపింది. మల్కాజిగిరి నియోజకవర్గంలో నోటాకు 13,366 మంది ఓటేశారని పేర్కొంది. ఎంపీల్లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అత్యంత సంపన్నుడు కాగా, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు అతి తక్కువ ఆస్తులున్నట్లు విశ్లేషించింది.



శ్రీ చెరుకూరి రామోజీ రావు

16.11.1936 - 08.06.2024

"జ్ఞానులు, సమత్వ బుద్ధి కలిగి ఉండి, జననమరణ చక్రంలో బంధించే కర్మ ఫలములపై మమకార - ఆసక్తులను త్యజించి ఉంటారు. ఇలాంటి దృక్పథంతో పని చేయటం వలన సమస్త దుఃఖములకు అతీతమైన స్థితిని పొందెదరు..."

భగవద్గీత : 2 వ అధ్యాయము 51 వ శ్లోకము

బాధాతప్త హృదయాలతో

అనురాధ జె. దేశాయ్
జితేంద్ర దేశాయ్
ఉత్తర జె. దేశాయ్
బి. వెంకటేష్ రావు
బి. బాలాజీ రావు
బి. జగదీష్ రావు

V H GROUP

వెంకటేశ్వర హేచరీస్ గ్రూప్
వెంకీస్ (ఇండియా) లిమిటెడ్

Venky's

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



క్రికెట్ కథతో బాక్సాఫీసు బరిలో

ఏటా భారతీయ చిత్రపరిశ్రమలో క్రీడా నేపథ్యంలో వచ్చే చిత్రాలకు కొదవ లేదు. క్రికెట్ క్రీడ నేపథ్యంలో తెరకెక్కిన 'లగాన్' చిత్రం బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. అయినా క్రికెట్ ఆట నేపథ్యంలో తెరకెక్కే చిత్రాల సంఖ్య మనదగ్గర చాలా తక్కువే. 'లగాన్'ను మినహాయిస్తే ఆ తరహా కథలతో వచ్చిన చిత్రాలకు ప్రేక్షకాదరణ అంతంతమాత్రంగా ఉండడమే దానికి కారణం. క్రికెట్, సినిమా... రెండూ ప్రజలకు ఎంతిష్టమో చెప్పక్కర్లేదు. మంచి కథతో ఆకట్టుకునేలా సినిమా తీస్తే ప్రేక్షకులు ఆదరించడం ఖాయం. అందుకే వెండితెరపై సరికొత్త క్రికెట్ కథను ఆవిష్కరించేందుకు కొంతమంది హీరోలు, హీరోయిన్లు సిద్ధమయ్యారు. క్రికెటర్లుగా త్వరలో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతున్న ఆ నాయకా నాయికలు ఎవరో చూద్దాం.

బాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న సీనియర్ హీరోల్లో అజయ్ దేవ్‌గణ్ ముందుంటారు. మూస ధోరణికి భిన్నంగా అన్ని జానర్లలో వరుసపెట్టి సినిమాలు చేస్తూ వస్తున్నారు. కొన్ని విజయాలు, మరికొన్ని అపజయాలు పలకరించినా వెరవకుండా ప్రయోగాలకు దిగుతున్నారు. ఇటీవలే 'మైదాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు అజయ్. ఒకప్పటి భారత ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవితం ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఏప్రిల్ 10న విడుదలైన ఈ స్పోర్ట్స్ డ్రామా బాక్సాఫీసు దగ్గర ఓ మోస్తరు విజయాన్ని అందుకొంది. అజయ్ నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు ఆయన మరో స్పోర్ట్స్ బయోపిక్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తొలి తరం క్రికెటర్లలో ఒకరైన పల్వాంకర్ బాలూ జీవిత కథ ఆధారంగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో పల్వంకర్ పాత్రను అజయ్ దేవ్‌గణ్ పోషిస్తున్నారు. దిగ్మాన్షూ ధూలియా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రీతీ సిన్హా నిర్మిస్తున్నారు. దేశంలో పల్వాంకర్ తొలి దళిత క్రికెటర్. బ్రిటీషర్ల ఏలుబడిలోనే దేశానికి ప్రాతినిధ్యం వహించి, బ్రిటిష్ జట్టును తన స్పిన్‌తో ముప్పతిప్పలు పెట్టి విజయాలు అందించారు పల్వాంకర్. ఆయన జీవిత కథ ఆధారంగానే 'లగాన్' చిత్రాన్ని నిర్మించారు అని కూడా చెబుతుంటారు. 1906లో ఆంగ్లేయులతో జరిగిన ఓ మ్యాచ్‌లో పల్వాంకర్ తన అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించారు. ఆ సందర్భంలో ఆయన్ను ఏనుగుపై ఊరేగించి, బాలగంగాధర్ తిలక్ స్వయంగా సన్మానం చేశారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రగుహ రాసిన 'స్పిన్ అండ్ అదర్ టర్న్స్', 'ఏ కార్నర్ ఆఫ్ ఫారిన్ ఫీల్డ్' అనే పుస్తకాల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.







టెస్ట్ చూడాల్సిందే

నయనతార, మాధవన్, సిద్ధార్థ్ ప్రధానపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'టెస్ట్'. మీరాజాస్మిన్ కీలకపాత్ర పోషించారు. నిర్మాత శశికాంత్ ఈచిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. చెన్నైలో జరిగిన ఓ అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ ముగ్గురు వ్యక్తుల జీవితాల్లో ఎలాంటి ప్రభావాన్ని చూపిందనే పాయింట్ చుట్టూ అల్లుకున్న కథ ఇది. సిద్ధార్థ్ క్రికెటర్ అర్జున్ పాత్రలో కనిపించనున్నారు. వేసవికి విడుదల చేయాలనుకున్నా కుదరలేదు. సెప్టెంబర్‌లో 'టెస్ట్' ప్రేక్షకుల ముందుకొస్తోంది.

దాదా బయోపిక్

కెప్టెన్‌గా భారత క్రికెట్ జట్టుకు ఎన్నో ఘన విజయాలను అందించారు సౌరవ్ గంగూలీ. దర్శకుడు లవ్ రంజన్, నిర్మాత అంకుర్ గార్గ్ గతేడాది గంగూలీని కలిసిన సందర్భంలో దాదా బయోపిక్ తొలిసారి వార్తల్లోకి వచ్చింది. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది, ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసి గంగూలీ బయోపిక్‌ను సెట్స్‌మీదకు తీసుకెళతామని అప్పట్లో వారు ప్రకటించారు. ఈ చిత్రంలో గంగూలీ పాత్ర కోసం ఆయుష్మాన్ ఖురానాను ఎంపిక చేసినట్టు బాలీవుడ్ మీడియా చెబుతోంది. కొన్నాళ్ల కిత్రం ఆయుష్మాన్ సీరియస్‌గా క్రికెట్ ప్రాక్టీస్ చేశారు. రణ్‌బీర్ కపూర్, హృతిక్‌రోషన్ పేర్లూ వినిపించాయి. అయితే ఈ ఏడాది మరోసారి గంగూలీ బయోపిక్ వార్తల్లో నిలిచింది. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను బాలీవుడ్ నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా కలవడమే దీనికి కారణం. ఆయన నిర్మిస్తున్న గంగూలీ బయోపిక్‌లో రజనీకాంత్ కీలకపాత్రను పోషించబోతున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.



ఈసారైనా రిలీజ్ అయ్యేనా?

మహిళా క్రికెటర్ జులన్‌గోస్వామి జీవితం ఆధారంగా తెరకెక్కిన బాలీవుడ్ చిత్రం 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ పాత్రను అనుష్క శర్మ పోషించారు. ప్రోసిత్‌రాయ్ దర్శకత్వం వహించారు. 2022లోనే ఈ చిత్రం మొదలైంది. అదే ఏడాదిలోనే షూటింగ్ కూడా పూర్తయింది. క్రికెటర్ పాత్ర కోసం అప్పట్లో అనుష్కశర్మ కఠోర సాధన చేశారు. ఈ చిత్రం ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలవ్వాల్సి ఉండగా వాయిదా పడింది. బడ్జెట్ ఎక్కువవడం, సినిమా తాము అనుకున్న విధంగా రాకపోవడంతో ఓటీటీ సంస్థ ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. త్వరలో మరో ఓటీటీలో 'చక్దా ఎక్స్‌ప్రెస్'ను ప్రేక్షకుల ముందకు తెచ్చేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

గతవారం క్రికెట్ నేపథ్యంలో రూపొందిన రెండు చిత్రాలు విడుదలయ్యాయి. 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం

చక్కటి ఆదరణను సొంతం చేసుకుంది. మహిళా క్రికెటర్ పాత్రలో జాన్వీకపూర్ నటన ప్రేక్షకులను మెప్పించింది. అలాగే తెలుగు చిత్రం 'భజే వాయువేగం'లో కార్తికేయ క్రికెటర్‌గా కనిపించారు.

రూ.14 కోట్ల బంగ్లా కొన్న త్రిప్తి డిమ్రి



బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రి 'యానిమల్' చిత్రంతో ఓవర్‌నైట్ సెన్సేషన్‌గా మారిన సంగతి తెలిసిందే. అప్పటివరకు ఆమె నటించిన మూణ్నాలుగు చిత్రాలతో వచ్చిన గుర్తింపు కంటే 'యానిమల్'లో చేసిన పాత్రతో పది రెట్ల గుర్తింపును తెచ్చుకుని క్రేజీ ఆఫర్స్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 'విక్కీ విద్య కా ఓ వాలా వీడియో', 'బ్యాడ్ న్యూస్', 'ధడక్ 2' వంటి వరుస సినిమాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్న ఈ భామ.. ఇటీవలే రూ. 14 కోట్లు పెట్టి బాలీవుడ్ స్టార్స్ నివసించే బాంద్రాలో ఓ బంగ్లాను కొనుగోలు చేశారు. దాదాపు 250 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ రెండస్థుల భవంతికి ఆమె ఇటీవలే 70 లక్షల రూపాయలు స్టాంప్ డ్యూటీకి, రూ. 30వేలు రిజిస్ట్రేషన్‌కు చెల్లించారు.

'కాంచన 4'లో మృణాల్?



బాలీవుడ్, టాలీవుడ్‌లో నటించిన కొద్ది చిత్రాల్లోనే మంచి రోల్స్‌తో ప్రేక్షకుల మదిలో పాగా వేసిన నటి మృణాల్ ఠాకూర్. ఇటీవలే తెలుగులో 'ఫ్యామిలీ స్టార్' చిత్రంతో సందడి చేసిన ఆమె.. అన్నీ అనుకున్నట్లు జరిగితే తన తదుపరి చిత్రంతో తమిళంలోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. కొరియోగ్రాఫర్, దర్శకుడు రాఘవ లారెన్స్ 'కాంచన' సిరీస్‌లో మరో భాగాన్ని తెరకెక్కించే పనుల్లో ఉన్నారు. లారెన్స్ దర్శకత్వం వహించే 'కాంచన 4' సినిమాలో ఆమెను హీరోయిన్‌గా సెలక్ట్ చేసుకోవడానికి ఆయన మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడేలా ఉంది. కాగా, దర్శకుడు రాఘవ లారెన్స్ 2007లో తెరకెక్కించిన 'ముని' చిత్రానికి కొనసాగింపుగా హారర్ కామెడీ సినిమా సిరీస్ 'కాంచన'లో ఇప్పటికే మూడు భాగాలు వచ్చిన సంగతి తెలిసిందే.

పెళ్లయిన నాలుగేళ్లకే...

నటుడు, గాయకుడు, బిగ్‌బాస్ కన్నడ సీజన్ 5 విజేత చందన్ శెట్టి, ఇన్‌ఫ్లూయన్సర్ నివేదిత గౌడ నాలుగేళ్ల తమ వైవాహిక బంధానికి వీడ్కోలు పలికారు. బెంగళూరులోని ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం అప్లయి చేసినట్లు నివేదిత గౌడ శుక్రవారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. 'చందన్ శెట్టి, నేను పరస్పర అంగీకారంతోనే చట్టబద్ధంగా విడిపోవడానికి నిర్ణయించుకున్నాం. మేం విడిపోయినా ఒకరినొకరం గౌరవించుకుంటూనే ఉంటాం. స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు అర్థం చేసుకుని ఎప్పటిలాగానే తమ వంతు సహకారాన్ని అందిస్తారని ఆశిస్తున్నా' అని ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



రజనీకాంత్ భయం.. కృష్ణ అభయం!

ఫ్లాష్ బ్యాక్



హీరో కృష్ణ.. తెలుగు చిత్రరంగంలో సూపర్ స్టార్. రజనీకాంత్.. తమిళ చిత్ర రంగ సూపర్ స్టార్. వీరిద్దరూ కలిసి మూడు తెలుగు చిత్రాల్లో నటించారు. వాటిల్లో తొలి చిత్రం 'అన్నదమ్ముల సవాల్'. కన్నడంలో విజయవంతమైన 'సహోదర సవాల్' చిత్రం ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంది రజనీకాంత్ కన్నడంలో నటించిన అతి తక్కువ చిత్రాల్లో 'సహోదర సవాల్' ఒకటి. ఆ సినిమాలో విష్ణు వర్ధన్, రజనీకాంత్ హీరోలుగా నటించారు యాక్షన్ చిత్రాల దర్శకుడిగా బ్రాండ్ కలిగిన కె.ఎస్.ఆర్.దాస్ ఈ కన్నడ చిత్రానికి దర్శకత్వం వహించడం విశేషం. కన్నడంలో ఈ సినిమా విజయం సాధించడంతో సారథి స్టూడియోస్ సంస్థ రీమేక్ హక్కులు కొన్నది. క్రైమ్, యాక్షన్ అంశాలు కలిగిన ఈ చిత్రంలో హీరోగా కృష్ణ నటిస్తే బిజినెస్‌కు ఢోకా ఉండదని నిర్మాతలు భావించి ఆయన్ను సంప్రదించారు. తన తొలి సినిమా 'తేనె మనసులు' నుంచి సారథి స్టూడియోస్ తో అనుబంధం ఉంది కనుక కృష్ణ వెంటనే అంగీకరించారు. 'అంతులేని కథ' చిత్రంతో పరిచయమై అచిరకాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న రజనీకాంత్ కన్నడంలో తను పోషించిన పాత్రను తెలుగులోనూ పోషించారు. ఇది ఆయనకు ఐదవ తెలుగు చిత్రం. తెలుగు వెర్షన్‌కు కూడా కె.ఎస్.ఆర్.దాస్ దర్శకత్వం వహించారు. కృష్ణ సరసన జయచిత్ర, రజనీకాంత్ పక్కన చంద్రకళ నటించారు. హైదరాబాద్ లోనే 'అన్నదమ్ముల సవాల్' షూటింగ్ జరిగింది. ఎక్కువ రోజులు హైదరాబాదులో ఉండాల్సి రావడం తో హీరో కృష్ణ మద్రాసు నుంచి తన సొంత కారు తెచ్చుకొన్నారు. అవుట్ డోర్ కు వెళ్ళినప్పుడల్లా తన సొంత కారు ఉపయోగించడం ఆయనకు అలవాటే. ఒక రోజు ఉదయం కృష్ణ షూటింగ్ బయలుదేరుతుంటే రజనీకాంత్ ఆయన దగ్గరకు వచ్చారు. 'అన్నయ్యా.. కారులో మీతో పాటు లోకేషన్ కి రావచ్చా' అని వినయంగా అడిగారు. అప్పటికే కృష్ణ టాప్ హీరో. రజనీకాంత్ ఎదుగుతున్న నటుడు. అయినా అరమరికలు లేని వ్యక్తి కావడంతో కృష్ణ వెంటనే నవ్వేసి 'తప్పకుండా... పద వెళ్దాం' అన్నారు. కారులో కొంత దూరం ప్రయాణించిన తర్వాత 'అన్నయ్యా.. నా జీవితంలో ఇటువంటి కారును ఎప్పటికైనా కొంటానంటారా' అని అడిగారు రజనీకాంత్. ' నీ ప్రతిభ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. హీరోగా నువ్వు తప్పకుండా పైకి వస్తావు. పేరు, డబ్బు గడిస్తావు' అని చెప్పి రజనీ భుజం తట్టారు హీరో కృష్ణ.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మిస్టరీస్ ఆఫ్ ది టెర్రకోట వారియర్స్	హాలీవుడ్ మూవీ	జూన్ 12
బ్రిడ్జ్‌టన్	వెబ్‌సిరీస్	జూన్ 13
మహరాజ్	హిందీచిత్రం	జూన్ 14
అమెజాన్ ప్రైమ్		
ది బాయ్స్ 4	వెబ్‌సిరీస్	జూన్ 13
జీ 5		
పరువు	తెలుగుచిత్రం	జూన్ 14
లవ్ కీ అరెంజ్ మ్యారేజ్	హిందీ చిత్రం	జూన్ 14
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ప్రొటెక్టింగ్ ప్యారడైజ్	డాక్యుమెంటరీ సిరీస్	జూన్ 10
నాట్ డెడ్ యెట్	వెబ్‌సిరీస్	జూన్ 12
ఆహా...		
పారిజాత పర్వం	తెలుగు చిత్రం	జూన్ 12
బుక్ మై షో		
ది ఫాల్ గై	హాలీవుడ్ మూవీ	జూన్ 14
జియో సినిమా		
గాంత్	హిందీ సిరీస్	జూన్ 11
ఆపిల్ టీవీ ప్లస్		
ప్రిజ్యూమ్డ్ ఇన్నోసెంట్	వెబ్‌సిరీస్	జూన్ 12





ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 9 జూన్ 2024
diksuchi@andhrajyothy.com

తెలంగాణ డీఈఈ సెట్ నోటిఫికేషన్

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్య విభాగం - డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ డీఈఈ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలు సహా ప్రైవేట్ అన్ఎయిడెడ్, మైనారిటీ, నాన్ మైనారిటీ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి ప్రైవేట్ కళాశాలలో 80 శాతం 'ఎ' కేటగిరీ సీట్లు, 20 శాతం 'బి' కేటగిరీ సీట్లు ఉంటాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లతోపాటు 'ఎ' కేటగిరీ సీట్లను సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 'బి' కేటగిరీ సీట్లను కళాశాలల యాజమాన్యం నిర్ణయం మేరకు భర్తీ చేస్తారు. 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టీజీ డీఈఈ సెట్ 2024 వివరాలు: డీఈఈ సెట్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. డీఈఎల్ఈడీ ప్రోగ్రామ్ ఈ మూడు మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్ కోసం ఎంచుకొన్న మాధ్యమంలోనే డీఈఈ సెట్ రాయాల్సి ఉంటుంది. డీపీఎస్ఈ ప్రోగ్రామ్ ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఇందులో చేరాలనుకొనేవారు డీఈఈసెట్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలోనే రాయాలి. ఆంగ్ల మాధ్యమంలో డీఈఈ సెట్ రాస్తే రెండు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అవకాశం ఉంటుంది.

- డీఈఈ సెట్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 10, జనరల్ తెలుగు(తెలుగు మాధ్యమం అభ్యర్థులకు)/జనరల్ ఉర్దూ (ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు) నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో ఎగ్జామ్ రాసేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 20, ఫిజికల్ సైన్సెస్ నుంచి 10, బయలాజికల్ సైన్సెస్ నుంచి 10, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ ప్రశ్నలను ఆ భాషల్లోనే ఇస్తారు. మిగిలిన రెండు పార్ట్‌లలో అన్ని ప్రశ్నలనూ అభ్యర్థులు ఎంచుకొన్న మాధ్యమంలో ఇస్తారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. ఈ ఎగ్జామ్‌లో అర్హత పొందాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 35 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు. కానీ, వీరు ఓసీ/ఎన్‌సీసీ/డిఫెన్స్ పర్సనల్ కేటగిరీ సీట్లకు పోటీ పడాలంటే 35 శాతం మార్కులు తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఎడిట్ ఆప్షన్ ఓపెన్:** జూన్ 29 నుంచి 30 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 3 నుంచి
- **టీజీ డీఈఈ సెట్ 2024 తేదీ:** జూలై 10
- **ఫలితాలు విడుదల:** జూలై 16
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** జూలై 19 నుంచి 23 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 24 నుంచి 27 వరకు
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 31
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లింపులు:** ఆగస్టు 1 నుంచి 4 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 6 నుంచి
- **వెబ్‌సైట్:** https://deecet.cdse.telangana.gov.in/

ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- 'ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఏడీఈఈ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ.డిజైన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు-సీట్లు



- బీఎఫ్ఏ కోర్సులో అయిదు స్పెషలైజేషన్లు ఉన్నాయి. రెగ్యులర్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 35, పెయింటింగ్ 20, స్కల్ప్‌చర్ 10, ఫొటోగ్రఫీ 30 సీట్లు ఉన్నాయి. ఎస్ఎస్ఎస్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 15, పెయింటింగ్ 15, స్కల్ప్‌చర్ 10, యానిమేషన్ 60, ఫొటోగ్రఫీ 20 సీట్లు ఉన్నాయి.
- బీ.డిజైన్ కోర్సులో ఇంటీరియర్ డిజైన్ స్పెషలైజేషన్ ఉంది. ఇందులో ఎస్ఎస్ఎస్ కేటగిరీ కింద 60 సీట్లు ఉన్నాయి.

ఎఫ్ఏడీఈఈ 2024 వివరాలు

- ఎగ్జామ్‌లో భాగంగా ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్ పేపర్లు ఉంటాయి. బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్‌చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు ఎ, బి, సి పేపర్లు; బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ) ప్రోగ్రామ్‌కు డి, ఇ పేపర్లు; బీ డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌నకు ఎఫ్ పేపర్ రాయాల్సి ఉంటుంది.
- ఎ-పేపర్‌లో మెమొరీ డ్రాయింగ్ అండ్ కలరింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర
- బి-పేపర్‌లో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం 50 నిమిషాలు
- సి-పేపర్‌లో ఆబ్జెక్ట్ డ్రాయింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర
- డి-పేపర్‌లో 100 మార్కులకు కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్ ఎగ్జామ్ ఉంటుంది. పరీక్ష సమయం గంటన్నర
- ఇ-పేపర్‌లో 50 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 50 నిమిషాలు
- ఎఫ్-పేపర్‌లో 200 మార్కులకు డిజైన్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.
- ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం


- **ప్రోగ్రామ్ వార్షిక ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు ఏడాదికి రూ.35,000 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్ఎస్ఎస్ కేటగిరీ అభ్యర్థులు బీ డిజైన్ (ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌నకు రూ.75,000; బీఎఫ్ఏ(యానిమేషన్) ప్రోగ్రామ్‌నకు రూ.70,000; బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్‌చర్, ఫొటోగ్రఫీ) ప్రోగ్రామ్‌లకు రూ.65,000 చెల్లించాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్:** పరీక్షకి నాలుగు రోజుల ముందు
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎఫ్ఏడీఈఈ 2024 తేదీలు:** బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ), బీ.డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌లకు జూలై 20; బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్‌చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు జూలై 21
- **వెబ్‌సైట్:** www.jnafauadmissions.com, www.jnafau.ac.in



దేవుడిచ్చిన వరం

అనగనగా ఒక అడవిలో రాణి అనే పేరు గల కాకి ఉండేది. దానికి ఆ అడవిలో ఆడుకోవడానికి బోలెడు మంది స్నేహితులు ఉండేవారు. ఒక రోజు ఆ కాకి సరస్సు దగ్గర ఒక హంసను చూసింది. ఆ హంస ఎంతో అందంగా ఉందని అనిపించింది. అదే మాట హంసతో చెప్పింది. అప్పుడు హంస- " ఆ చెట్టు మీద ఉండే చిలుకను చూసే దాకా నేను కూడా నేనే అందరికంటే అందమైన దాన్ని అనుకుంటూ వచ్చాను. కానీ ఆ చిలుక ఆకుపచ్చ ఎరుపు రంగుల్లో ఎంతో అందంగా ఉంది" అంటూ బాధ పడింది. కాకి ఇదే మాట వెళ్లి చిలుకతో చెప్పింది. ఆ మాటలకు చిలుక- " నాదేమి అందం నాకు రెండే రంగులున్నాయి కానీ నేనుచూసిన నెమలికి ఎన్ని రంగుల ఈకలో తెలుసా? సృష్టి లో అందరికంటే నెమలే చాలా అందమైనది" అని చెప్పింది. కాకి నెమలిని వెతుకుతూ వెళ్లింది. కానీ నెమలి కనపడలేదు. అలా వెతుకుతూ కాకి ఒక ఊరు చేరింది. అక్కడ నెమలి ఒక జంతు ప్రదర్శనశాలలో ఉంది. అప్పుడు నెమలి ఆ కాకి దగ్గరకు వెళ్లి - "నువ్వు ఎంత అందమైనదానివో.. అందరికీ నువ్వంటే ఇష్టం. అందువల్ల నువ్వు చాలా సంతోషంగా ఉండాలి" అంది. అప్పుడు ఆ నెమలి- "నా అందమైన ఈకలే నాకు స్వేచ్ఛ లేకుండా చేశాయి. నేను పురి విప్పి ఆడుతున్నప్పుడు మనుషులు చూశారు. నన్ను బంధించారు. అందరూ నేను అందంగా ఉంటానంటారు. కానీ ఏం ప్రయోజనం? మీరు ఎంతో స్వేచ్ఛగా ఉన్నారు" అని బాధపడింది. అప్పుడు కాకికి అందం కన్నా స్వేచ్ఛగా ఉండటం చాలా ఆనందాన్ని ఇస్తుందనే విషయం అర్థమయింది.

సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి







దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 328

	9					6		2
5	6				9	7	1	
4			2	8			6	
			4		3			
	3			6	1			9
	4	7	9				5	3
8		6					7	

సుడోకు - 327 సమాధానం

8	7	1	9	6	4	5	3	2
4	6	5	2	8	3	9	1	7
2	3	9	7	5	1	6	8	4
3	9	2	6	1	7	4	5	8
5	1	6	8	4	2	7	9	3
7	4	8	5	3	9	2	6	1
6	5	7	3	2	8	1	4	9
9	8	4	1	7	6	3	2	5
1	2	3	4	9	5	8	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

జేఎన్‌యూలో ఎమ్మెస్సీ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బయోటెక్నాలజీ, కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్-బీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: బయోటెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 12, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 3 సీట్లు కేటాయించారు.

- కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 6, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓబీసీలకు 4, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 2 సీట్లు నిర్దేశించారు.


అర్హత: ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ)లో ప్రవేశానికి ఫిజికల్, బయలాజికల్(బయోకెమిస్ట్రీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/బోటనీ/మైక్రోబయాలజీ/జువాలజీ), అగ్రికల్చరల్, వెటర్నరీ అండ్ ఫిషరీ సైన్సెస్, ఫార్మసీ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ(ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సు) పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎమ్మెస్సీ(కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్)లో ప్రవేశానికి బేసిక్ సైన్సెస్, అప్లయిడ్ సైన్సెస్ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **అభ్యర్థుల మొదటి మెరిట్ లిస్ట్ విడుదల:** జూలై 8
- **అభ్యర్థుల రెండో మెరిట్ లిస్ట్ విడుదల:** జూలై 17
- **అభ్యర్థుల మూడో మెరిట్ లిస్ట్ విడుదల:** జూలై 26
- **ఫిజికల్ వెరిఫికేషన్ తేదీ:** ఆగస్టు 1
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in



జాబ్ కార్నర్



బీఎస్ఎఫ్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 1526

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)..డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి సంక్షిప్త ప్రకటనను విడుదల చేసింది. అస్సాం రైఫిల్ ఎగ్జామినేషన్ - 2024 ద్వారా ఈ ఖాళీలు భర్తీ చేస్తారు. అర్హులైన పురుష/మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

1. హెడ్ కానిస్టేబుల్(హెచ్‌సీ)(మినిస్టీరియల్/కంబాటెంట్ మినిస్టీరియల్), హవల్దార్(క్లర్క్): **1,283 పోస్టులు**
2. అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)-(స్టెనోగ్రాఫర్/కంబాటెంట్ స్టెనోగ్రాఫర్), వారెంట్ ఆఫీసర్(పర్సనల్ అసిస్టెంట్): **243 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి 12వ తరగతి ఉత్తీర్ణత, టైపింగ్, స్టెనోగ్రఫీ సర్టిఫికెట్, నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 8 **వెబ్‌సైట్:** rectt.bsf.gov.in/

బామర్ లారీలో జూనియర్ ఆఫీసర్లు

Balmer Lawrie

కోల్‌కతాలోని భారత ప్రభుత్వరంగ సంస్థకు చెందిన పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖ పరిధిలోని బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్ కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ ఆఫీసర్(ప్రొడక్షన్/క్వాలిటీ అస్యూరెన్స్, ఎస్‌సీఎం/ఎలక్ట్రికల్/ఆపరేషన్స్): 14 పోస్టులు

విభాగాలు: గ్రీసెస్ అండ్ లూబ్రికెంట్స్, ఇండస్ట్రియల్ ప్యాకేజింగ్, లాజిస్టిక్స్ సర్వీస్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.21,750 - రూ.65,000

వయోపరిమితి: 25 ఏళ్లు మించకూడదు

జాబ్ లోకేషన్: చెన్నై, కోల్‌కతా, సిల్వెస్సా, బరోడా, తలోజ, ముంబయి, హైదరాబాద్.

దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది

ఎంపిక విధానం: రాత పరీక్ష తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 5

వెబ్‌సైట్: https://www.balmerlawrie.com/

కల్యాణి ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్స్

ఖాళీలు 104

కల్యాణి(పశ్చిమబెంగాల్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

విభాగాలు: బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఒ అండ్ జి, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫిజియాలజీ, పల్మనరీ మెడిసిన్.

అర్హత: ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణత

వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఇంటర్వ్యూ విధానం: ఆన్‌లైన్/ఆఫ్‌లైన్

వేదిక: అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఒకటో అంతస్తు, ఎయిమ్స్ కమిటీ రూం, కల్యాణి

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 2, 3

వెబ్‌సైట్: https://aiimskalyani.edu.in/

సీఎల్ఆర్ఐలో ప్రాజెక్ట్ అసిస్టెంట్స్

ఖాళీలు 32

చెన్నైలోని సీఎస్ఐఆర్ - సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీల వివరాలు

1. సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్: **1 పోస్టు**
2. ప్రాజెక్ట్ అసిస్టెంట్: **12 పోస్టులు**
3. ప్రాజెక్ట్ అసిస్టెంట్-1: **12 పోస్టులు**
4. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **4 పోస్టులు**
5. సీనియర్ రీసెర్చ్ ఫెలో: **1 పోస్టు**
6. ప్రిన్సిపాల్ ప్రాజెక్ట్ అసోసియేట్: **1 పోస్టు**
7. రీసెర్చ్ అసోసియేట్: **1 పోస్టు**

CSIR-CLRI

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోరు ఉండాలి.

ఎంపిక : రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

రాత పరీక్ష తేదీ: జూన్ 12

ఇంటర్వ్యూ తేదీలు: జూన్ 13, 14

రాత పరీక్ష వేదిక: ట్రిపుల్ హెలిక్స్ ఆడిటోరియం, సీఎల్ఆర్ఐ

ఇంటర్వ్యూ వేదిక: సీఎస్ఐఆర్-సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సర్దార్ పటేల్ రోడ్, అడయార్, చెన్నై.

వెబ్‌సైట్: https://www.clri.org/

